శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మోదీ వైఫల్యాలు పట్టించుకోని 'గోదీ' 04

'సెంటిమెంట్' రాహుల్‌కు అదనపు బలం 03



గురువారం | 23-05-2024 | ఖమ్మం | సంపుటి 07, సంచిక: 172 | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00


# ఆదానీ సంస్థ ఫ్రాడ్ !?

FINANCIAL TIMES

Adani suspected of fraud by selling low-grade coal in India as cleaner fuel

▸ Papers suggest cheap cargoes passed off ▸ Big profits at cost of air quality ▸ Setback for pollution fight



ఫైనాన్షియల్ టైమ్స్ సంచలన కథనం

నాణ్యమైన బొగ్గు పేరుతో నాసిరకం బొగ్గు సరఫరా

తమిళనాడు విద్యుత్ సంస్థకు టోకరా

రెండింతలకు పైగా లాభం దండుకున్న ఆదానీ కంపెనీ

**లండన్ :** ఖరీదైన శుద్ధి చేసిన ఇందనానికి బదులుగా తక్కువ నాణ్యతతో కూడిన బొగ్గును భారతదేశంలోని ఒక రాష్ట్ర ప్రభుత్వ సంస్థకు ఆదానీ గ్రూప్ సరఫరా చేసిందని ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ బిజినెస్ డైలీ 'ఫైనాన్షియల్ టైమ్స్' (ఎఫ్‌టి) దినపత్రిక సంచలన వార్తా కథనాన్ని మంగళవారం నాడు ప్రచురించింది. దీర్ఘకాలికంగా నడుస్తున్న బొగ్గు కుంభకోణం ఆరోపణలపై తాజాగా ఆధారాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) చేతికి చెక్కిన పత్రాలతో పాటు, 'ఫైనాన్షియల్ టైమ్స్' పరిశీలనలో భారతదేశానికి చెందిన ఆదానీ గ్రూప్ సంస్థలు కు సంబంధించి అవినీతి ఆరోపణలతో పాటు పర్యావరణ కోణం కూడా బైటపడింది. ఆదానీ సంస్థ మోసపూరితంగా పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే తక్కువ నాణ్యత కలిగిన బొగ్గు సరఫరా ద్వారా భారీ లాభాలు గడిస్తున్నదని పేర్కొంది. జనవరి 2014లో ఆదానీ కొనుగోలు చేసిన ఇండోనేషియా షిప్‌మెంట్‌లో కిలో బొగ్గుకు 3,500 క్యాలరీలు కలిగి ఉన్నట్లు ఇన్‌వాయిస్‌లో పేర్కొన్నారని, అదే షిప్‌మెంట్‌ను తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టాన్‌జెడ్‌కో)కు కిలో బొగ్గుకు 6వేల క్యాలరీలుగా చూపి, అత్యంత నాణ్యమైన గ్రేడ్ కలిగిన బొగ్గు అని చెప్పి విక్రయించింది. ఈ వ్యవహారంలో రవాణా ఖర్చులు పోగా ఆదానీ రెండింతలకు పైగా సొమ్ము చేసుకున్నట్లు స్పష్టమవుతుందని ఎఫ్‌టి కథనంలో వివరించారు. అదే సంస్థకు ఆదానీ కంపెనీ సుమారు 105 మిలియన్ టన్నుల బొగ్గును 22 షిప్‌మెంట్‌ల ద్వారా విక్రయించినట్లు పత్రాలు కూడా తమ వద్ద ఉన్నట్లు వెల్లడించింది. ఇండోనేషియాలో తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును ఉత్పత్తి చేసే ఒక మైనింగ్ గ్రూప్ నుండి తరువాయి 2లో

## ఆదానీ స్కామ్‌పై జెపిసి

'ఇండియా' ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లో విచారణ : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నెల రోజుల్లోనే ఆదానీ కుంభకోణంపై విచారణకు పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి)ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. తమిళనాడు ప్రభుత్వ రంగ సంస్థతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఆదానీ గ్రూప్ తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును సరఫరా చేసిందని మీడియాలో వార్తలు వచ్చాయని పేర్కొంది. బిజెపి ప్రభుత్వంలో భారీ బొగ్గు కుంభకోణం వెలుగులోకి వచ్చిందని, ఈ కుంభకోణం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఇష్టమైన మిత్రుడు ఆదానీ తక్కువ నాణ్యత కలిగిన బొగ్గుకు మూడింతల ధర వసూలు చేసి వేల కోట్ల రూపాయలను లూటీ చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఫలితంగా సామాన్యుడు తమ జేబు నుండి అధిక విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆదానీ గ్రూప్ నుండి ఎలాంటి స్పందన వెలువడలేదు. గతంలో ఇలాంటి ఆరోపణలను వెన్వెంటనే ఖండన వచ్చేది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్) తన నివేదికలో ఖరీదైన బొగ్గు సరఫరా చేయాలని తమిళనాడు జనరేషన్, డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టాన్‌జెడ్‌కో)తో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా ఆదానీ గ్రూప్ ఖరీదైన స్వచ్ఛమైన బొగ్గు తరువాయి 2లో

ఎసిపి ఉమామహేశ్వర్‌రావుకు

# రిమాండ్





ఎసిపి అక్రమాస్తులు రూ.50 కోట్లకుపైగానే

బినామీ సందీప్ గురించి ఆరా

సహకరించిన ఉన్నతాధికారులపై కూడా ఎసిబి దృష్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమాస్తుల కేసులో హైదరాబాద్ సిసిఎస్ ఎసిపి ఉమామహేశ్వర్‌రావును మంగళవారం ఉదయం ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. అనంతరం అతన్ని నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న అతని అక్రమాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్ వివరాలను ఎసిబి అధికారులు కోర్టుకు అందించారు. కేసులో ఎసిబి దర్యాప్తు అధికారులకు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా ఉమామహేశ్వర్ తన అక్రమ సంపాదనలతో బినామి పేర్లపై ఆస్తులు కూడబెట్టినట్లు తేలింది.బహిరంగ మార్కెట్లో అతని ఆస్తి విలువ సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుంది. ఇందులో కొన్ని ఆస్తులు తన అత్తగారి తరపు బంధువుల పేర్లపై, మరికొన్ని ఆస్తులు తన స్నేహితుతో పాటు మురో ముఖ్యమైన సందీప్ అనే వ్యక్తిపై కూడా కూడబెట్టారు. ఈ విషయాలన్ని అతని ఇంట్లో జరిగిన సోదాల్లో లభించిన అతని ల్యాప్‌టాప్‌లో మరిన్ని కీలక విషయాలు వెలుగు చూశాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచి జరిగిన ఎసిబి సోదాలు బుధవారం మధ్యా హ్నం వరకు కొనసాగాయి. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అతని బంధువులు, స్నేహితుల ఇండ్లపై సోదాలు నిర్వహించారు. ఉమామహేశ్వర్‌రావును మరింత లోతుగా విచారించేందుకు పోలీసు కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు కూడా లేకపోలేదు. ఉమామహేశ్వర్‌రావు తన వద్దకు వచ్చే ఫిర్యాదుదారులనే బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు ఎసిబి విచారణలో తేలింది. తమ పేర్లు చెప్పడానికి నిరాకరించిన కొంత మంది బాధితులు ఎసిబి అధికారులకు ఉమామహేశ్వర్‌రావు చేతిలో మోసిన తంతు గురించి తమ గోడు వెల్లబోసుకున్నారు. గతంలో ఉమామహేశ్వర్‌రావు పలుమార్లు విధుల్లో అక్రమాలకు పాల్పడిన సందర్భంగా సస్పెండ్లకు గురయ్యాడు.అలాగే ఉమామహేశ్వర్‌రావుకు కొందరు ఉన్నతాధికారులు కూడా సహకరించినట్లు ఎసిబి విచారణలో తేలింది. ఈ విషయం పై కూడా ఎసిబి అధికారులు ఆరా తీస్తున్నారు.

## రాష్ట్రంలో మూడురోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. 23న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఉత్తర భారతంలో మండుతున్న ఎండలు 03

ఫోన్‌ట్యాపింగ్ కేసులో

## త్వరలో మరిన్ని అరెస్టులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబి డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్‌కుమార్, అదనపు ఎస్‌పిలు మేకల తిరుపతన్న, నాయిని భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి పి.రాధకిషన్‌రావులు అరెస్టై, చంచల్‌గూడ జైలులో ఉన్నారు. రాధకిషన్‌రావును దర్యాప్తు అధికారులు విచారణ చేసిన తరువాయి 2లో



ఎన్నికల కోడ్ ముగిసాక

## ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన

అవినీతి అధికారుల జాబితా సిద్ధం

త్వరలో భారీ బదిలీలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రొహిబీషన్, ఎక్సైజ్ శాఖను ప్రక్షాళ చేసే దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. ఎక్సైజ్ శాఖలో అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిగా పారదర్శకంగా కార్యక్రమాలు కొనసాగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎక్సైజ్ శాఖలో భారీ స్థాయిలో అధికారులు, సిబ్బంది బదిలీలు ఉంటాయి. ఈ మేరకు ఇప్పటికే అవినీతి అధికారులు, సిబ్బంది జాబితాను ఉన్నతాధికారులు సిద్ధం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను పూర్తిగా అవినీతి మయం చేశారని ఇటీవలే ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా మద్యం కొత్త పాలసీపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రొహిబీషన్ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు స్పష్టం చేశారు. మరోపక్క సోమవారం నమస్తె తెలంగాణ పత్రికలో "లిక్కర్ బ్రాండ్ల ప్రమోషన్..5 వేల కోట్ల కమీషన్..అనధికార మద్యం పాలసీకి ప్రభుత్వ పెద్దల స్కెచ్" అనే శీర్షికతో వచ్చిన వార్తను మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగదార్చే విధంగా రాసిన ఈ పత్రికపై రూ.100 కోట్ల పరువునష్టం కేసు వేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. నమస్తే తెలంగాణ పేపర్ వాళ్ళు కావాలని తరువాయి 2లో

## నాలుగో ఏడాదిలోకి కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

2025 నవంబర్ 1 నాటికి పేదరికం సమూల నిర్మూలన

2.50 లక్షల ఉద్యోగాల భర్తీ, 30వేల కొత్త ఉద్యోగాల సృష్టి

భారత ప్రభుత్వం ఇబ్బంది పెట్టినా నిలబడ్డాం

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్




**తిరువనంతపురం :** కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) రెండవ సారి అధికారం చేపట్టి నాలుగవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. 2025 నవంబర్ 1 నాటికి రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీ (విజ్ఞాన ఆర్థికవ్యవస్థ)గా అభివృద్ధి చేసి, అత్యంత పేదరికాన్ని నిర్మూలిస్తామని ఈ సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. వరుసగా రెండవసారి అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాధించిన విజయాలను పేర్కొంటూ ఒక ప్రకటనను విడుదల చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో కనీస మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించిందని తెలిపారు. అనేక అంశాలలో వ్యత్యాసాలను, లోపాలను సరి చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేశంలోనే అతి తక్కువ పేదరిక రేటు ఉన్న రాష్ట్రంగా కేరళ నిలిచిందని, 2025 నవంబర్ 1 నాటికి అత్యంత పేదరిక రహిత రాష్ట్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. భారతీయ రైల్వే, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కాని కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దేశానికే ఆదర్శ నమూనాగా నిలిచిందన్నారు. 2016లో కెఎస్‌పిఎస్‌సి ఏర్పాడినప్పటి నుండి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిందని, 30 వేలకు పైగా పోస్టులను సృష్టించిందని, ప్రభుత్వ రంగ సంస్థలలో నియామకాల కోసం ప్రత్యేక నియామక సంస్థను ఏర్పాటు చేసిందని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా కేరళ ప్రభుత్వం ప్రశంసలు, గుర్తింపు తరువాయి 2లో

గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ పాలన

## వేయి రెట్లు నయం

ఇదీ తెలంగాణ రైతుల అభిప్రాయం

అన్నదాతలారా ఆలోచించండి... హామీలన్నీ ఖచ్చితంగా అమలు చేస్తాం : రాష్ట్ర ప్రజలకు మంత్రి తుమ్మల వాగ్ధానం

ప్రజాపక్షం/హైదరాబాద్



రైతులను నిండా ముంచిన గత ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణలో వేయిరెట్లు నయమని, ఇది యావత్తు తెలంగాణ రైతుల అభిప్రాయామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడంతోపాటు గత ఏడాది కంటే ఐకేపీ సెంటర్ల పెంచడం ద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేశామని వెల్లడించారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక ఐఎఎస్ అధికారిని నియమించి ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా తరుగు, తాలు పేరుతో ఏలాంటి కోతలు లేకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ చేసేవారని, ఈ దఫా మిల్లర్ల దోపిడీ పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపడంతో కోతలకు మిల్లర్ల పూర్తిగా స్వస్తి పలికారని, దీంతో ప్రతి క్వింటాపై రైతుకు రూ.150 నుంచి రూ.200ల వరకు అదనపు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులు పంట అమ్ముకున్న 45 రోజులు తర్వాత వారి ఖాతాల్లోకి నగదు జమ అయ్యేందని, దీంతో రైతు ఎంతో వడ్డీ నష్టపోయేవారన్నారు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతోందని, దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు కాని, వడ్డీలు కట్టాల్సిన అవసరం లేకుండా పోవడంతో ఇప్పుడు రైతు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని వెల్లడించారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన తరువాయి 2లో

# ఢిల్లీలో 'ఇండియా' కూటమి సమరోత్సాహం

## హ్యాట్రిక్ విజయాలపై బిజెపిలో సందేహం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. వరుసగా రెండు ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన బిజెపిని ఈసారి హ్యాట్రిక్ కొట్టకుండా అడ్డుకునేందుకు ఇండియా కూటమి కంకణం కట్టుకుంది. అందులో భాగంగా ఒకటి మినహా ఆరు స్థానాలలో సిట్టింగ్ ఎంపిలపై ఉన్న ప్రజా వ్యతిరేకతను తప్పించుకునేందుకు బిజెపి కొత్తవారికి టికెట్లు ఇచ్చింది. టికెట్లు కోలోయిన బిజెపి సిట్టింగ్ ఎంపిలలో క్రికెటర్ గౌతమ్ గంభీర్, కేంద్ర సహాయ మంత్రి మీనాక్షీ లేఖీ, కరోనా సమయంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసిన హర్షవర్ధన్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరందరూ రికార్డు స్థాయిలో లక్షల మెజారిటీతో గెలిచినప్పటికీ, ఈసారి బిజెపి టికెట్ నిరాకరించిందంటే ఎంత ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారో స్పష్టమవుతోంది. ఈసారి కూడా ఢిల్లీలో మొత్తం ఏడు ఎంపి స్థానాలను గెలుచుకునేందుకు అన్ని రకాల ఎత్తులు జిత్తులకు కేంద్రంలోని అధికార పార్టీ ఏడాది నుండే శ్రీకారం చుట్టింది. వరుసగా ఢిల్లీ ప్రభుత్వంలోని తరువాయి 8లో



ఇండియా కూటమి అభ్యర్థి కన్హయ్యకుమార్ ప్రచార కార్యాలయానికి వెళ్లి సిపిఐ తరపున మద్దతు ప్రకటిస్తున్న జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, డాక్టర్ బి.కె.కాంగో, నాయకులు దినేశ్ వర్షిణే

### ఆప్‌కు రాహుల్, కాంగ్రెస్‌కు కేజ్రీవాల్ ఓటు!

ఈసారి ఎన్నికల్లో విచిత్రం చోటు చేసుకోనుంది. రెండు జాతీయ పార్టీల నాయకులు తమ సొంత పార్టీ గుర్తుపై ఓటు వేసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ల ఓట్లు ఢిల్లీలోనే ఉన్నాయి. రాహల్ గాంధీ ఓటు ఉన్న నియోజకవర్గాన్ని సీట్ల సర్దుబాటులో భాగంగా ఆప్‌కు కేటాయించడంతో, ఆయన ఆ పార్టీ గుర్తు చీపురుకు ఓటు వేయనున్నారు. కేజ్రీవాల్ ఓటు ఉన్న నియోజకవర్గం కాంగ్రెస్‌కు కేటాయించడంతో ఆయన చేయి గుర్తు ఎదుట ఇవిఎం బటన్ నొక్కనున్నారు. ఢిల్లీలో ఈ నెల 25న పోలింగ్ జరగనుంది.

## తీన్మార్ మల్లన్నను గెలిపించండి

సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ప్రజాపక్షం/ఖమ్మం



శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన అంటూ నిరుద్యోగులను వంచించిందని ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరిని ప్రదర్శించిందన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లు గత పదేళ్ల పాలనలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందాయన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ పదేళ్లలో ఆ ఊసెత్తలేదన్నారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిర్వీర్యం అవుతుందని ప్రపంచంలో యువశక్తిని సద్వినియోగం చేసుకోలేని దేశంగా భారత్ ముందు వరుసలో ఉందన్నారు. మేధో వలసను నివారించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పాలకులు దృష్టి సారించాలన్నారు. శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడిన తీన్మార్ మల్లన్నకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు నిస్తుందని ప్రసాద్ తెలిపారు. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వంతో పోరాడేందుకు మల్లన్న గెలుపు అవసరం అన్నారు. ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చైనాలో తైవాన్ అంతర్భాగం : దానికే కట్టుబడ్డాం

### పాకిస్థాన్ అధ్యక్షుడు జర్దారీ ఉద్ఘాటన



**ఇస్లామాబాద్ :** 'ఒకే చైనా' విధానానికే పాకిస్థాన్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దేశ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ చెప్పారు. ఏ రూపేణా లోకూడా తైవాన్ సార్వమాధికారాన్ని తాము గుర్తించేదిలేదని ఆయన ఉద్ఘాటించారు. తైవాన్ ప్రాంతం చైనాలో ఒక అంతర్భాగమనీ, తైవాన్‌కు ఇక మరో మార్గం లేదనీ ఆయన అన్నారు. చైనా–పాకిస్థాన్ దేశాలమధ్య దౌత్యసంబంధాలు ప్రారంభమై మే 21వ తేదీ నాటికి 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జర్దారీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పాకిస్థాన్ ఎల్లప్పుడూ 'ఒకేచైనా' విధానానికే కట్టుబడి ఉందని అన్నారు. తైవాన్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించకుండా చైనాలో అంతర్భాగంగా చూడటమే 'ఒకే చైనా' విధానం. 1972 నుండీ తైవాన్ సార్వభౌమాధికారం విషయంపై పాశ్చాత్యదేశాలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల నేపథ్యంలో 'ఒన్ చైనా' విధానం పాపులారిటీ పొందింది. అమెరికా, బ్రిటన్ సహా కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు తైవాన్‌ను సార్వభౌధికారంగల స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నాయి. కొన్ని తటస్థంగా ఉన్నాయి. ఈ విషయంలో చైనా ఒన్ చైనా విధానాన్ని ముందుకు తెచ్చింది. తైవాన్ వేరు కాదనీ, చైనాలో అంతర్భాగమనీ చైనా ఉద్ఘాటించింది. అసిఫ్ అలీ జర్దారీ పాకిస్థాన్ అధ్యక్షుడుగా మొదటిసారి పనిచేసినప్పుడు తొమ్మిదిసార్లు చైనాలో పర్యటించారు. తర్వాత ఇటీవలే ఆయన మళ్ళీ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్నారు. చైనాను, తైవాన్‌ను వేరు వేరుగా పాకిస్థాన్ చూడదనీ, తమ రెండు దేశాలమధ్య సంబంధాలలో షరతులు ఏమీ లేవని జర్దారీ అన్నారు.

## మెక్సికోలో 12 మంది హత్య

**మెక్సికో సిటీ :** మెక్సికోలో బుధవారంనాడు కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే 12 మంది హత్యకు గురయ్యారు. మెక్సికో ఫసిఫిక్ అకపుల్కా కోస్తా రిసార్ట్‌లో ఈ హింసాకాండ చెలరేగినట్లు స్థానిక మీడియా తెలియజేసింది. జెనోవేసా కండోమినియం వద్ద అనేకసార్లు కాల్పులకు గురైన నలుగురు పురుషులు, ముగ్గురు మహిళల శరీరాలు లభ్యమైనట్లు మెక్సికో సిటీ సెక్యూరిటీ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలియజేసింది. మొత్తం అన్ని మృతదేహాలపై సగం సగం దుస్తులే ఉన్నాయి. పైగా వారందరినీ బాగా హింసించినట్లు మృతదేహాలపై ఉన్న ఆనవాళ్ళే చెబుతున్నాయి. ఈ మృతదేహాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం లేబొరేటరీకి తరలించారు. అదేవిధంగా అకపుల్కో శివారు ప్రాంతంలో నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరిని కూడా బాగా హింసించిన దాఖలాలు కనిపిస్తున్నాయి. రికార్డో ఫ్లోరెస్ మగోన్ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం జరిగిన హింసాకాండ తరహాలోనే ఈ హత్యలు కూడా ఉన్నాయి. ఈ ఘటనలన్నింటికీ ముందుగా పాపులర్ గోల్డెన్ జోన్ రిసార్ట్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దాడిలో ఒక వ్యక్తి మరణించాడు.15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో దాదాపు ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి.

## డిఆర్ కాంగో మృతులు డజన్లసంఖ్యలోనే

**ఐక్యరాజ్యసమితి :** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో గడచిన నెలరోజుల్లో జరిగిన అంతర్గత మత ఘర్షణల్లో డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారని ఐక్యరాజ్యసమితి బుధవారంనాడు తన నివేదికలో తెలియజేసింది. ఈశాన్య షోఫో రాష్ట్రంలో జరిగిన ప్రాణాంతకమైన ఘర్షణలలో గాయపడి, ఇళ్ళు వదిలి పారిపోయిన ప్రజలకు ఐక్యరాజ్యసమితి మానవ సహాయ వ్యవహారాల సమన్వయ కార్యాలయం సహాయ సహకారాలు అందిస్తున్నది. 2023 ఫిబ్రవరి నుండీ ఇప్పటివరకూ ఈ ఘర్షణల్లో షోపో రాష్ట్ర రాజధాని కిసంగనీలో 750 మంది మరణించారనీ, మరో 75,000 మంది ప్రజలు ఇళ్ళు వదిలి పారిపోయారనీ ఐక్యరాజ్యసమితి తన నివేదికలో తెలియజేసింది. ప్రాణభయంతో ఇళ్ళు వదిలి పారిపోయిన ప్రజలకు ఆహారం, నివాస సమస్యలు తీవ్రంగా ఉన్నాయనీ, వారికి ఆహారం సమకూర్చడం తక్షణ అవసరంగా ఉందనీ ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

# పాలస్తీనాకు నార్వే సహా పలు దేశాల గుర్తింపు

### ఈనెలాఖరు నాటికి అదే బాటలో మరికొన్ని దేశాలు కూడా..



**స్టాక్‌హోం :** యుద్ధంలో పడి అతలాకుతలమైన పాలస్తీనాకు కారుచీకటిలో కాతిరేఖ కనిపిస్తున్నది. పాలస్తీనా ప్రాంతాన్ని ఒక దేశంగా గుర్తించాలని నార్వేదేశ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఐక్యరాజ్యసమితిలో సభ్యులుగా ఉన్న 193 దేశాలలో ఇప్పటివరకకూ 143 దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించినట్లయింది. ఇలా గుర్తించిన దేశాల్లో రష్యా దేశం కూడా ఉంది. ఇంకా భావసారూప్యత గల పలు దేశాలు కూడా ఈ నెలాఖరునాటికి పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించడానికి సిద్ధంగా ఉన్నాయి. యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఉన్నతస్థాయీ దౌత్యవేత్త జోసెఫ్ బోరెల్ గడచిన ఏప్రిల్ నెలలోక ఒక ప్రకటన చేస్తూ మే నెలాఖరు నాటికి యూరప్‌లోని పలు దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించేందుకు సిద్ధంగా ఉన్నాయని చేసిన ప్రకటన ఈ సందర్భంగా గమనార్హం. యూరోపియన్ యూనియన్‌లోని బల్గేరియా, చెక్ రిపబ్లిక్, సైప్రస్, హంగరీ, మాల్టా, పోలండ్, రోమానియా, స్లోవేకియా, స్వీడన్ దేశాలు పాలస్తీనాను ఇప్పటికే ఒక దేశంగా గుర్తింపు ఇచ్చాయి. నార్వేజియన్ ప్రభుత్వ వెబ్‌సైట్ బుధవారంనాడు ఈ విషయం వెల్లడించింది. మే 28వ తేదీ నుండీ ఈ గుర్తింపు అమలులోకి వస్తుందని నార్వే ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా యూరప్‌లోని అనేక దేశాలు కూడా వీలు వెంబడి మా వెనుకే ఇదేవిధంగా పాలస్తీనాకు గుర్తింపును ప్రకటిస్తాయని నార్వే ప్రభుత్వం ప్రకటించింది. "పాలస్తీనాలో యుద్ధం ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో పాలస్తీనా భూభాగాన్ని ఒక దేశంగా గుర్తించాలని నార్వే ప్రభుత్వం నిర్ణయించింది. ఇజ్రాయిల్, పాలస్తీనా రెండింటినీ ఒకేవిధంగా చూడాలని మేం భావిస్తున్నాం, అందువల్ల పాలస్తీనాకు ఒక దేశంగా గుర్తింపు ఇస్తున్నాం. పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఈ సమస్యకు ఇదే ఒక తగిన రాజకీయ పరిష్కారంగా నార్వే ప్రభుత్వం భావిస్తున్నది. ఈ రెండు దేశాలకూ సమాన స్థాయిలో గుర్తింపు ఇస్తే రెండూ పక్కపక్కనే ఉంటూ శాంతియుతంగా జీవించే అవకాశాలు పెరుగుతాయి" అని నార్వే ప్రధానమంత్రి జోనస్ ఘర్ స్టోర్‌ను ఉటంకిస్తూ ఆ దేశ ప్రభుత్వ వెబ్‌సైట్ ప్రకటన చేసింది.

### గుర్తించేందుకు స్పెయిన్, ఐర్లాండ్ సిద్ధం

పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు ఐర్లాండ్ కూడా సిద్ధంగా ఉంది. బుధవారంనాడే అంటే మే 22వ తేదీనాడే ఈ మేరకు ఐర్లాండ్ ఒక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయన రాయిటర్స్ వార్తాసంస్థ వెల్లడించింది. ఐర్లాండ్ ప్రధానమంత్రి సైమన్ మోరిస్, విదేశాంగ, రక్షణశాఖల మంత్రి మైఖేల్ మార్టిన్ ఇద్దరూ నిర్ణీత ప్రకారం బుధవారం ఉదయమే పత్రికాగోష్ఠిలో పాలస్తీనాకు ఒక స్వతంత్రదేశంగా గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించాల్సి ఉందని రాయిటర్స్ తెలియజేసింది. అదేవిధంగా స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంఛెజ్ కూడా పాలస్తీనాకు గుర్తింపు ఇస్తామని ప్రకటించారు.

### పాలస్తీనా హర్షాతిరేకం

నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాలు తమను ఒక సర్వస్వతంత్ర దేశంగా గుర్తించడంపట్ల పాలస్తీనా ప్రెసిడెన్సీ బుధవారంనాడు హర్షం ప్రకటించింది. అధికారిక న్యూస్ ఏజన్సీ వాఫా ఈ ప్రకటన ప్రచురించింది. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సెక్రటరీ జనరల్ హుస్సేన్ అల్ షేక్ ఈ పరిణామాలపై స్పందిస్తూ, ఇది ఒక చరిత్రాత్మకమైన సందర్భమని అన్నారు. ఈ కష్టకాలంలో తమను ఒక దేశంగా గుర్తించినందుకు ఈ దేశాలకు తాము ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటామని అన్నారు.ఇంకా పలు దేశాలు తమకు గుర్తింపు ఇవ్వడానికి సిద్ధంగా ఉండటం ఎంతో శుభసందర్భమని అన్నారు. తూర్పు జెరూసలెం రాజధానిగా 1967 నాటికి ఉన్న పాలస్తీనా ప్రాంతాన్ని అప్పగించి ఒక దేశంగా తమను గుర్తించాలని పిఎల్ఓ, హమాస్, ఇతర సంస్థలు కోరుతున్నాయి.

## గాజాలో ఇజ్రాయిల్ దాడులు

### 62 మంది మృతి



ఒకవైపు పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తిస్తూ పలు యూరప్ దేశాలు ప్రకటనలు చేస్తుండగా మరోవైపు పాలస్తీనాలో ఇజ్రాయిల్ సైన్యం దారుణకాండ నిరాఘాటంగా కొనసాగుతున్నది. బుధవారంనాడు ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 62 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. మరో 138 మంది గాయపడ్డారు. కాగా ఉత్తర గాజాలో సమర్థవంతంగా పనిచేస్తున్న అల్ అవ్దా, కమల్ అద్వాన్ ఆసుపత్రులను ఇజ్రాయిల్ సైన్యం చుట్టుముట్టిందనీ, ఈ ఆసుపత్రులలో 200 మంది రోగులు చిక్కుకున్నారనీ, వారంతా వైద్య సేవలు లేక ఆర్తనాదాలు చేస్తున్నారనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అదేవిధంగా గాజాలో అమెరికా తాత్కాలికంగా నిర్మించిన కాజ్ వేకు సముద్రమార్గంలో చేరుకున్న 569 టన్నుల ఆహార పదార్థాల సహాయంలలో ఒక్క బస్తాను కూడా ఇప్పటివరకూ ఆకలిబాధలతతో ఉన్న ప్రజలకు సరఫరాచేయలేదని పెంటగాన్ వర్గాలు బుధవారంనాడు ప్రకటించాయి. గాజాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత నుండీ ఇప్పటివరకూ 35,709 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 79,990 మంది గాయపడ్డారు.

# 6 వేల అడుగులు కిందికి జారిన బోయింగ్ విమానం

### పౌర విమానయాన చరిత్రలో భయంకర ఘటన

### ఒకరు మృతి : 30 మందికి గాయాలు



**సింగపూర్ :** లండన్ నుండి సింగపూర్ వెళుతున్న బోయింగ్ 777 విమానం భయంకరమైన అనుభవాన్ని చవిచూసింది. మూడు నిమిషాల వ్యవధిలో ఆరు వేల అడుగులు కిందకి జారిపోయింది. తర్వాత పైలట్ తేరుకుని మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి బ్యాంకాక్‌లో ఆకస్మికంగా ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో సింగపూర్‌కు చెందిన ఒక పాపులర్ మ్యూజికల్ థియేటర్ డైరెక్టర్ బ్రిట్ జఫరీ కిచెన్ (73) మరణించారు. ఆయన ఈ ఆకస్మిక ఘటనతో గుండె ఆగి మరణించారని భావిస్తున్నారు. కనీసం 30 మందిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. కిచెన్ భార్యను థాయ్‌లాండ్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ బోయింగ్‌లో 211 మంది ప్రయాణిస్తుండగా 47 బ్రిటిష్ పౌరులు, 80 మంది ఆస్ట్రేలియా వాసులు, 18 మంది సిబ్బంది ఉన్నారు. బోయింగ్ విమానం లోపల అంతా రక్తం చారికలు ఏర్పడ్డాయి. ఈ ఘటనతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఐతే ఈ ఘటన ఎందుకు జరిగిందనే విషయాన్ని పైలట్ ఖచ్చితంగా అంచనా వేయలేకపోయారు. ఐతే వాతావరణ మార్పులే ఈ ఘటనకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మయన్మార్ వద్ద ఐరావడ్డీ నదీ బేసిన్ పైనుండి 37,000 అడుగుల ఎత్తులో విమానం ప్రయాణం చేస్తూ ఉండగా ఆకస్మికంగా ఈ ఘటన జరిగింది. ఉత్తరార్థ గోళం, దక్షిణార్థ గోళం నుండి వీచే గాలులు భూగోళం మధ్య రేఖకు చేరుకున్నప్పుడు ఢీ కుంటాయి. దీనిని ఇంటర్ ట్రోపికల్ కన్వర్జన్స్ జోన్ అంటారు. ఈ ప్రభావం వల్ల విమానం ఆరు వేల అడుగుల ఎత్తునుండి కిందకు జారి పోయిందని ఒక అంచనా వేస్తున్నారు.





భవిష్యత్‌లో ఇలాంటి దారుణ ఘటనలు చాలా జరిగే అవకాశం ఉందని కూడా కొందరు అప్పుడే అంచనా వేశారు. మంగళవారంనాడు ఈ బోయింగ్ విమానానికి ఈ విధమైన భయంకరమైన అనుభవం ఎదురైంది. ఈ విమానంలో 80 మంది ఆస్ట్రేలియా జాతీయులు ప్రయాణం చేస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో ప్రయాణ రాకపోకలు సాగించే విమానాలు చాలా ఎత్తులో మేఘాల పై నుడి వెళుతూ ఉంటాయి. ఈ విధమైన అనుభవాలు చాలా చాలా అరుదుగా జరుగుతాయి. జరిగే అవకాశం లేదు కూడా. కాగా 2000 సంవత్సరం అక్టోబరు 31 తర్వాత మళ్ళీ ఈనాటి వరకూ సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు ఎలాంటి ప్రమాదాలు వాటిల్లలేదు. 24 ఏళ్ళ క్రితం చాంకైషేక్ విమానాశ్రయంలో రన్‌వే పై జరిగిన ప్రమాదంలో 83 మంది మరణించారు. ఆ తర్వాత మళ్ళీ జరిగిన ప్రమాదం ఇదే.

## జూన్ 2న రాష్ట్రానికి సోనియా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవసతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఎఐసిసి అగ్ర నాయకురాలు సోనియాగాంధీ రాష్ట్రానికి రానున్నారు. యుపిఎ ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం, రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చింది. పైగా రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని,ఈ వేడుకలకు సోనియా గాంధీని ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా సోనియాగాంధీ చేతుల మీదుగా తెలంగాణ గీతాన్ని ఆవిష్కరించనున్నారు.

## ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం (మొదటి పేజీ తరువాయి)

పొందుతున్నప్పటికీ, భారత ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కేరళలో యుడిఎఫ్ ప్రభుత్వం 2016లో అధికారం నుండి దిగిపోయే సమయానికి కేరళ రాష్ట్ర మొత్తం రెవెన్యూలో స్వంత రాబడి 26 శాతమేనని, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దానిని 73 శాతానికి గణనీయంగా పెంచిందని వెల్లడించారు. పన్ను రాబడిలో రూ.30వేల కోట్లు పెరుగుదల సాధించామని, ఇటీవల కాలంలో కేరళ ప్రభుత్వం ఖర్చులలో అధిక భాగం స్వంత ఆదాయ వనరుల ద్వారానే సమకూర్చుకుంటున్నదని తెలిపారు. కొవిడ్19 మహమ్మారి విసిరిన సవాలును సైతం అధిగమించి ఈ ఘనత సాధించామన్నారు. యుడిఎఫ్ హయాంలో విధ్వంసమైన సాధారణ విద్యావ్యవస్థను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దిందని విజయన్ తెలిపారు.

## సంస్థ ఫ్రాడ్ !? (మొదటి పేజీ తరువాయి)

ఆదానీ సంస్థ బొగ్గును కొనుగోలు చేసిందని, అదే బొగ్గును తమిళనాడు ప్రభుత్వ రంగ సంస్థకు అత్యధిక నాణ్యత కలిగిన బొగ్గుగా మళ్ళించిందని పేర్కొంది. ప్రతి ఏడాది 20 లక్షలకు పైగా భారతీయులు వాయు కాలుష్యంతో మరణిస్తున్నారని 2022 లాన్సెట్‌లో ప్రచురితమైన అధ్యయనంలో తేలిందని, ఇతర అధ్యయనాలలో సైతం బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల చుట్టూ వందల కిలోమీటర్ల మేరకు శిశు మరణాలు కూడా గణనీయంగా పెరిగనట్లు వెల్లడైందని ఎఫ్‌టి పేర్కొంది. గతంలో ఆదానీ సంస్థపై తమ పత్రికలో ప్రచురితమైన కథనం ప్రకారం 2021 నుండి 2023 వరకు భారత్‌కు మార్కెట్ ధరకంటే ఎక్కువ రేటుకు బొగ్గును ఎగుమతి చేసేందుకు ఆదానీ సంస్థ మధ్యవర్తులకే 3వంద కోట్ల డాలర్లు చెల్లించినట్లు ప్రచురితమైనట్లు ఎఫ్‌టి పేర్కొంది.

## స్కామ్‌పై జెపిసి (మొదటి పేజీ తరువాయి)

పేరుతో తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును సరఫరా చేసినట్లు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌లో కథనం ప్రచురితమైంది. దీనిపై రాహుల్ గాంధీస్పందిస్తూ తన 'ఎక్స్' ఖాతాలో హిందీలో ట్వీట్ చేశారు. 'ఇంతటి బహిరంగ అవినీతిపై ఇడి, సిబిఐ, ఐటి మౌనంగా ఉండేందుకు ఎన్ని టెంపోలు వాడారో ప్రధాన మంత్రి చెబుతారా? జూన్ 4 తరువాత ఇండియా కూటమి ప్రభుత్వం ఈ మెగా స్కామ్‌పై దర్యాప్తు చేస్తుందనిది. లూటీ అయిన ప్రతి పైసా ప్రజాధనంపై ఆరా తీస్తుంద'ని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి ఊపు చూసి ఇలాంటి 'మోదానీ మెగా స్కామ్'లు బైటపడే వేగం పుంజుకున్నదని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండోనేషియా నుండి 2014లో చౌక ధరకే కొనుగోలు చేసిన తక్కువ నాణ్యత కలిగిన , ఎక్కువ మసి కలిగిన బొగ్గును ఆదానీ సంస్థ డజన్‌ల కొలది షిప్పులలో తరలించి తమిళనాడు ప్రభుత్వ రంగసంస్థ టెన్‌జెడ్‌కోకు మోసపూరితంగా మూడింతల ధరకు అమ్ముకున్నదని విమర్శించారు. భారతదేశంలో ఆదానీపై జరుగుతున్న అన్ని రకాల విచారణలను ప్రధాన మంత్రి సహాయంతో స్తంభింపజేశారని, కాని ఇండోనేషియా నుండి సమాచారం ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. తన భాగస్వామని ప్రధాని బైటపడేసే లోపే ఇతర దేశాలలో జరుగుతున్న దర్యాప్తులు వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తున్నాయని అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మోదానీ మెగా కుంభకోణంపై జెపిసి ఏర్పాటు చేస్తామన్నారు.

# 'నకిలీ'లదందా

### లైసెన్సులు లేకుండానే 'క్లినిక్'లు

### అధిక ధరలకు మందుల విక్రయాలు

### 'డ్రగ్స్ కంట్రోల్' దాడుల్లో వెలుగు చూస్తున్న మోసాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల అనారోగ్యాన్ని కొందరు కాసుల పంటగా మార్చుకుంటున్నారు. అనారోగ్యానికి గురైనవారిపైన 'అధిక ధరల'తో దాడికి పాల్పడుతున్నారు. మందుల నుంచి మొదలు ఫీజుల వరకు సామాన్యలను పీల్చి పిప్పి చేస్తున్నారు. క్లినికుల ఏర్పాటు నుంచి మందుల వరకు నకిలీల బెడద తప్పడం లేదు. కొందరు లైసెన్సులు పొందకుండానే క్లినికులను ఏర్పాటు చేస్తే, మరి కొందరు ఇతర కంపెనీలకు చెందిన మందులను యథేచ్ఛగా తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక మొత్తంలో మందులను విక్రయిస్తున్నారు. అనారోగ్యానికి గురైన వ్యక్తి కేంద్రంగా 'నకిలీ'ల దందా కొనసాగుతోంది. ఇటీవల డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 'నకిలీ'ల భాగోతం భయపడింది. ఒక కంపెనికి చెందిన మందులను తయారు చేయడం, అధిక ధరలకు మందులను విక్రయించడం లాంటి అనేక ఫిర్యాదులు డిసిఎ బృందానికి వస్తున్నాయి. దీంతో గత కొంత కాలంగా వరసుగా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తుంది. రెండు రోజుల క్రితమే భుపాలపల్లి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జీడిమెట్ల ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. రూ.24.77లకు విక్రయించాల్సిన ఇట్‌జోక్యాప్200 క్యాప్సల్స్‌ను రూ. 51.30కి విక్రయిస్తున్నట్టు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో ఆయుర్వేదిక్ పేరుతో తప్పుడు ప్రకటనలతో సామాన్యులను మోసం చేస్తున్నారు. సరైన అర్హత లేకుండానే తమకు తాముగా ఆర్‌ఎంపి వైద్యునిగా చెలామని అవుతున్నట్టుగా డ్రగ్స్ కంట్రోల్ దాడుల్లో తేలింది. మరో ప్రాంతంలో ఒక కంపెనీకి సంబంధించిన 'మందు'ను స్వల్ప మార్పులతో తయారు చేశారు. ఇటువంటి పరిస్థితులు రాష్ట్రంలో మరిన్ని ప్రాంతాల్లో ఉన్నదని అధికారులు గుర్తించారు. ఈ నకిలీ దందాలు గత కొంత కాలంగా కొనసాగుతున్నప్పటికీ తాజాగా వెలుగులోనికి వస్తున్నాయి.

### 'లైసెన్స్' లేని వారికి మందులు సరఫరా చేసినా చర్యలే

డ్రగ్స్ లైసెన్స్ లేని వారికి మందులను సరఫరా చేసే హోల్‌సెల్లర్లకు, డీలర్ల పైన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. మందులను సరఫరా చేసేముందే డ్రగ్స్ లైసెన్స్‌ను పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ లైసెన్స్ లేకుండా మందులను విక్రయిస్తే ఐదు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదారి పట్టించినా, అధిక ధరలకు మందులను విక్రియించిన చట్ట ప్రకరం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నకిలీ సర్టిఫికెట్లు, అధిక ధరలు వసూలు చేసినా టోల్ ఫ్రీ నంబర్ 18005996969 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కమలాసన్ రెడ్డి తెలిపారు.

# హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దశ దిశలు వ్యాపించేలా కృషి

### జిహెచ్ఎంసి కమిషనర్ కమిషనర్ రోనాల్ రోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాక్సర్ నిఖత్ జరీన్ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డా కప్ పోటీల్లో 52 కెజిల విభాగంలో విజేతగా నిలిచి బంగారు పథకం సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్‌ను బుధవారం తన ఛాంబర్‌లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. విజేతగా నిలిచి బంగారు పథకం సాధించినందుకు అభినందించారు. ముమ్మందు హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దిశ, దిశల వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా బాక్సింగ్ క్రీడలో మరింత రాణించాలని కమిషనర్ అభిలాషించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, క్రీడారంగ అభివృద్ధికి జిహెచ్ఎంసి కూడా కృషి చేస్తున్నది. బాల బాలికల క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక సమ్మర్ కోచింగ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, మాజీ ట్రెజరర్ కె. మహేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబు రావు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వేయి రెట్లు నయం

(మొదటి పేజీ తరువాయి)

లేదని, ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేదని, అయినప్పటికీ కాంగ్రెస్, రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అందిస్తోందని చెప్పారు. ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా, ప్రభుత్వమే రూ. 3వేల కోట్లలను వెచ్చించి రైతుల ప్రీమియం చెల్లించి పంట భీమా పథకాన్ని వానాకాలం నుండి అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో తడిసిన ధాన్యాన్ని చూసి కల్లాల్లో వరికుప్పల మీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కాని తమ ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరకు సేకరిస్తుందని భరోసా ఇవ్వడంతో నేడు రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారన్నారు.

**తెలంగాణలో దొడ్డు వడ్ల అన్నం తిన్నడం చాల తగ్గిపోయింది :** తెలంగాణలో తెలంగాణలో దొడ్డు వడ్ల అన్నం తినడం చాలా తగ్గిపోయిందని, అందుకే సన్న వడ్ల సాగును పెంచేందుకు రూ.500 బోనస్ ప్రభుత్వం ప్రకటించదని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరు తోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారని, అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుందని చెప్పారు. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియ్యాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని, అందుకే మనం దొడ్డు వడ్లు అమ్ముకుని,, సన్న వడ్లు కొనుక్కోవడం ఎందుకు అని మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుండడంతో యుద్ధ ప్రాతిపదికన ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని, భవిష్యత్తులో దీనిని దొడ్డు వడ్లకు కూడా వర్తింప చేస్తామని, మంత్రి చెప్పారు. ప్రస్తుతందొడ్డు వడ్లకు బోనస్ ఇప్పుడు ఇవ్వలేకపోయినా 3 నుంచి5 రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడడం ద్వారా ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందన్నారు. అది తెలుసు కనుకనే తెలంగాణ రైతులంతా నిశ్చింతగా ఉన్నారని తెలిపారు.

**గతంలో రైతులను కాల్చుకు తిన్న బిఆర్ఎస్ అగ్రనాయకులు :** రైతులను కాల్చుకుతిన్న గతంలో రైతులను కాల్చుకుతిన్న బిఆర్ఎస్ అగ్ర నాయకులు ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఎద్దేవా చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో ప్రకటించిన కెసిఆర్ ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదని, అందుకే కేసిఆర్‌ను ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రకటనలు ఆపాలని మంత్రి హితవు పలికారు.

**అన్నదాతలార ఆలోచించండి :** అన్నదాతలార ఆలోచించండి..ఇది ప్రజా ప్రభుత్వం...ఎక్కడ దుబార చేయకుండా.. కెసిఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. త్వరలో అన్ని హామీలను నిలబెట్టుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పిన విధంగానే చేసి చూపించామని, వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతామని, లేకుంటే ఓట్లే అడగబోమని మంత్రి ప్రజలకు వాగ్దానం చేశారు.

## త్వరలో మరిన్ని అరెస్టులు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వానికి తాను ఎన్నికల్లో ఎలా సహాయం చేశాననే విషయంపై కూలంకశంగా చెప్పాడు. ఎన్నికల సమయంలో నగదు ఒకచోటి నుంచి మరోచోటికి తరలిస్తున్న సమయంలో ప్రతిపక్ష నేతల డబ్బులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారని, ఇదంతా తాము ప్రతిపక్ష నేతల ఫోన్‌లు ట్యాపింగ్ చేస్తున్న సమయంలో వచ్చిన సమాచారం ఆధారంగా డబ్బులు తరలిస్తున్న వారిపై దాడులు చేశామన్నారు.మరోపక్క ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు స్వయంగా టాస్క్‌ఫోర్స్ వాహనాలలో హైదరాబాద్ నుంచి జిల్లాలకు పెద్ద మొత్తంలో డబ్బులను తరలించామని కూడా రాధాకిషన్‌రావు దర్యాప్తు అధికారులకు వెల్లడించాడు. ఈ డబ్బులను తరలించేందుకు సహకరించిన మాజీ పోలీసు అధికారులు, ఇతర అధికారులను కూడా అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతల డబ్బులను సీజ్ చేసిన పలువురు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు, ఎసిపిలను దర్యాప్తు అధికారులు పిలిచి వారి నుంచి వాంగ్మూలాలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు ఇచ్చిన సమాచారం మేరకే తాము ప్రతిపక్ష నేతలకు తరలివెళ్తున్న నగదును సీజ్ చేశామని వారు చెప్పారు. ఇంత వరకు బాగానే ఉంది అయితే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా నగదును తరలించిన ఒక మాజీ డిసిపి, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను కూడా ప్రశ్నించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిసింది. ఇక ఈ మొత్తం వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐబి చీఫ్ ప్రభాకరరావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడు. ఇప్పటికే ఇతనిపై లుక్‌ఔట్ నోటీసులు దర్యాప్తు అధికారులు జారీ చేశారు. దీంతో అతను జూన్ 26న హైదరాబాద్‌కు వచ్చేందుకు విమానాటికెట్లు కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ప్రభాకర్‌రావును విచారించిన తరువాత ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ పార్టీ పెద్దల వ్యవహారం బట్టబయలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

మా ప్రభుత్వం మీద బట్ట కాల్చి మీద వేస్తున్నారని జూపల్లి ఆరోపించారు.. ప్రభుత్వం గనుక మద్యంపై కొత్తగా ఏదైనా పాలసీ తెస్తే దాన్ని ముందుగా మంత్రివర్గంలో నిర్ణయిస్తారని చెప్పారు. 19 మద్యం డిపోలలో అన్ని రకాల బ్రాండ్ల నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖకు రూ.2356 కోట్లు బకాయిలు పెట్టిందని వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న బకాయిలను ఒక్కొక్కటిగా చెల్లింపులు చేస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే బకాయిలు పేరుకుపోయాయన్నారు. మద్యం అమ్మకాల సెల్స్ తగ్గితే బిఆర్ఎస్ నాయకులకు వచ్చిన నష్టం ఏమిటో చెప్పండి..మద్యం అమ్మకాలు తగ్గడం వలన ప్రజలకు ఏమైనా నష్టం ఉందా చెప్పండి అని ఆయన ఎదరు ప్రశ్నించారు. గతంలో అబ్కారీ శాఖ లో పైరవీలు చేస్తేనే బదిలీలు, ప్రమోషన్ లు ఉండేవి.. కానీ మా ప్రభుత్వంలో పైరవీలకు స్థానం ఉండదని, అన్ని పనులు పారదర్శకంగా చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేస్తామన్నారు. జూపల్లి మంత్రిగా ఉన్న శాఖలో అవకతవకలు, అవినీతి అనేది ఉండదని మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠ ను భంగం కలిగించే విధంగా బిఆర్ఎస్‌కు బాక ఉదే పేపర్ ఈ వార్త రాసిందన్నారు. కొత్త బ్రాండ్ల తయారీ కోసం ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదన్నారు.కొంత బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి కాబట్టి బీర్ల కొరత వచ్చిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ మనుగడ కష్టంగా ఉంది కనుక మా ప్రభుత్వం పై తప్పుడు వార్తలు రాస్తున్నారని విమర్శించారు.ప్రోహిబిషన్,అబ్కారీ శాఖ లో ఏండ్ల తరబడి పని చేస్తున్న వారిని స్థాన చలనం చేస్తామన్నారు.రాష్ట్ర ఆదాయానికి ఎవరు గండి కొట్టిన సహించబోమన్నారు. మద్యం తయారీ కేంద్రాలలో సిసికెమెరాలను సైతం ఏర్పాటు చేశామని, వాటిని హైదరాబాద్‌లోని ట్విన్‌టవర్స్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశామన్నారు. గత ప్రభుత్వం టెండర్లు లేకుండానే ఇష్టం వచ్చినట్లు హోలీగ్రామ్ ముద్రణకు కాంట్రాక్టు పనులు అప్పగించడం సిగ్గుచేటన్నారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా టెండర్లు వేసి పనులు అప్పగిస్తుందన్నారు. రానున్న రోజుల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు బార్లు, వైన్‌షాప్‌లు, రెస్టారెంట్లలో సైతం సిసి కెమెరాలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## యుపిలో ఖాతా తెరవనున్న మమతాబెనర్జీ



**ఉత్తర్‌ప్రదేశ్ :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక లోక్‌సభ స్థానం గెలిచే అవకాశం కనిపిస్తోంది. ఆ పార్టీ తరుపున భదోహి నియోజకవర్గం నుండి లలితేశ్‌పతి త్రిపాఠి పోటీ చేస్తున్నారు. ఆయన ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమలాపతి త్రిపాఠి మునిమనవడు. లలితేశ్ త్రిపాఠి ఇండియా కూటమి మద్దతుతో భదోహి నుండి టిఎంసి టికెట్‌ఎన్నికల్లో నిల్చున్నారు. వాస్తవానికి ఆయన కాంగ్రెస్‌లో ఉన్నారు. 2021లో టిపిసిసి ఉపాధ్యక్ష పదవిని వీడారు. మమతాబెనర్జీతో ఉన్న సత్సంబంధాలతో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఇండియా కూటమిలో తన కోటా నుండి టిఎంసికి ఒక సీటు కేటాయించారు. ఆ పార్టీ టికెట్‌పైన పోటీ చేస్తున్న లలితేశ్‌పతి త్రిపాఠి గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

## ప్రాతిపదికలపై కుల - మత ప్రచారం మానుకోండి




**న్యూఢిల్లీ :** కులం, మతం, సమూహం, భాష ఆధారంగా ప్రచారం చేయడాన్ని మానుకోవాలని బిజెపి, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల కమిషన్ కోరింది. భారత సామాజిక, సాంస్కృతిక జీవన వాతావరణాన్ని ఎన్నికలతో దెబ్బతీయవద్దని విజ్ఞప్తి చేసింది. రాజస్తాన్‌లోని బన్స్‌వారాలో నెల రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ చేసిన రెచ్చగొట్టే ప్రసంగంపై జారీ చేసిన నోటీసుకు బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డా ఇచ్చిన సమాధానాన్ని ఇసి తిరస్కరించింది. బిజెపి స్టార్ క్యాంపెయినర్లు కుల , మత ఆధారిత ప్రచారాలను విరమించుకోవాలని సూచించింది. సమాజాన్ని విభజించే ప్రచార ప్రసంగాలను బిజెపి నిలిపివేయాలని కోరింది. అలాగే మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీల ప్రసంగాలపై బిజెపి నేతల ఇచ్చిన ఫిర్యాదులపై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు కూడా గతంలో ఇసి నోటీసు ఇచ్చింది. దానికి ఖర్గే ఇచ్చిన సమాధానాన్ని సైతం ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. రాజ్యాంగాన్ని రద్దు చేస్తారనో లేదా అమ్ముతారో అనే తప్పుడు భావం కలిగించే ప్రసంగాలను కాంగ్రెస్ నేతలు మానుకోవాలని సూచించింది. రెండు జాతీయ పార్టీల స్టార్ క్యాంపెయినర్‌లు తమ ప్రసంగాలను సరి చేసుకొని, మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

# 'సెంటిమెంట్' రాహుల్‌కు అదనపు బలం

రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్న రాహుల్ గాంధీకి కాంగ్రెస్‌లో కీలక నేతగా మంచి పేరు ఉంది. 'భారత్ జోడో యాత్ర', 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'తో ప్రజలకు మరింత దగ్గరయ్యారు. బిజెపి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ రాహుల్‌కు కలిసొచ్చే అంశాలే. అయితే, 'సెంటిమెంట్' ఆయనకు అదనపు బలాన్ని ఇవ్వనుంది. ఈ నియోజకవర్గానికి గత ఎన్నికల్లో ప్రాతినిథ్యం వహించిన రాహుల్ తల్లి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈసారి లోక్‌సభకు పోటీ చేయని విషయం తెలిసందే. ఆమె గత నెలలోనే రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణం చేశారు. గాంధీ కుటుంబానికి అండగా నిలిచిన రాయ్‌బరేలీ నుంచి దూరం కావడం తనను ఎంతో బాధిస్తున్నదని, అయినప్పటికీ, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఇది వరకే వీడియో ద్వారా తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మూడు రోజుల ముందు, ఈనెల 17న ఆమె రాయ్‌బరేలీ ప్రతినిధిగా చివరి కార్యక్రమంలో పాల్గొన్నారు. 'నా కుమారుడ్ని మీకు అప్పగిస్తున్నాను. ఆశీర్వదించండి' అంటూ ఎంతో భావోద్వేగంతో ఆమె ప్రజలు ఉద్దేశించి చెప్పిన మాటలు అందరి హృదయాల్లోకి చొచ్చుకెళ్లాయనడంలో అనుమానం లేదు. 'రాయ్‌బరేలీ నా కుటుంబం. అమేథీ కూడా నా ఇల్లే. గత వందేళ్లుగా నా కుటుంబ మూలాలు ఈ మట్టిలో ముడిపడి ఉన్నాయి' అంటూ, గాంధీ కుటుంబం తరఫున అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 'పరివార్' (కుటుంబం)కు, పరివార్వాద్ (బంధుప్రీతి)కు ఎంతో తేడా ఉందన్నారు. దేశంలో బంధుప్రీతి ప్రబలంగా ఉందని, రాజకీయాల్లో ఇది విమర్శలకు గురవుతున్నదని అన్నారు. ఆ సమయంలోనే తన అత్త ఇందిరా గాంధీ, తన భర్త రాజీవ్ గాంధీ దేశ సేవలోనే ఎలా అమరులయ్యారన్నది కూడా ఆమె ప్రస్తావించి, ప్రజల మనసులు గెల్చుకున్నారు. మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ వరకు తమ కుటుంబం మొత్తం దేశం కోసం పోరాడిందని, తనతోపాటు తన పిల్లలు రాహుల్, ప్రియాంక గాంధీ సైతం అదే పంథాలో నడుస్తూ సేవ చేస్తున్నామని సోనియా వివరించారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ, మరింతగా సేవలు అందించేందుకు రాహుల్‌ను దీవించాలని ఆమె కోరారు. సోనియా ప్రసంగం తప్పనిసరిగా సానుభూతి తరంగాలను సృష్టించి ఉంటుంది. ఆ సెంటిమెంట్ రాహుల్ విజయానికి తోడ్పడడం ఖాయంగా కనిపిస్తున్నది. విజయావకాశాలు ఎక్కువగా ఉన్న ఆయనకు తల్లి సెంటిమెంట్ కూడా తోడుకావడం లాభించే అంశమే.



# కాంగ్రెస్, హిందూ - ముస్లింల గురించే 60 సార్లకు పైగా ప్రస్తావన

### ప్రధాని మోదీ 111 ప్రసంగాలపై పరిశీలన

**న్యూఢిల్లీ :** ఎన్నికల ప్రచారం మొదలైనప్పటి నుండి మే 15 వ తేదీ వరకు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 111 ప్రసంగాలలో కాంగ్రెస్ గురించి 63 సార్లు, హిందూముస్లింల గురించి 60 సార్లు ప్రస్తావించారు. ఈ మేరకు మంగళవారం నాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ఒక కథనం ప్రచురితమైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మార్చి 16 నుండి బిజెపి ప్రధాన ఎన్నికల ప్రచార కర్త నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలలో వికాస్, విశ్వగురు, 2047 నాటికి వికసిత భారత్ అనే పదాలు క్రమంగా ప్రాధాన్యతను కోల్పోయినట్లు అందులో పేర్కొంది. ఏప్రిల్ 17 నుండి మే 15 వ తేదీ వరకు నరేంద్ర మోదీ చేసిన 111 ఎన్నికల ప్రసంగాలపై చేసిన పరిశీలనలో ఈ విషయం తేలినట్లు తెలిపింది. ఏప్రిల్ 5 వరకు చేసిన 10 ప్రసంగాలలో అత్యధికంగా కాంగ్రెస్, అవినీతిపై పదిసార్లు, పథకాలు, అభివృద్ధిపై కూడా అదే స్థాయిలో ప్రధాని ప్రస్తావించారు. విశ్వగురు అంశాన్ని 8 సార్లు, మోదీ గ్యారంటీ గురించి 7 సార్లు, రామ మందిరం గురించి ఆరు సార్లు ప్రస్తావించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో విడుదలైన మరుసటి రోజు అంటే ఏప్రిల్ 6 నుండి 20 వరకు ప్రధాని ప్రసంగంలో ప్రాధామ్యాలు మారిపోయాయి. ఈ సమయంలో 34 ప్రసంగాలు చేయగా, అందులో కాంగ్రెస్, అభివృద్ధి గురించి 32 సార్లు, రామ మందిరం గురించి 26 సార్లు ప్రస్తావించారు. ఏప్రిల్ 21 నుండి ప్రసంగ ధోరణిని మార్చి, హిందూముస్లింపైనే మోదీ ఎక్కువగా గురిపెట్టారు. రాజస్థాన్‌లో మొదలైన హిందూ ఆస్తులు, మంగళసూత్రాలు లాక్కొని ముస్లింలకు, చొరబాటు దారులకు ఇచ్చేస్తారనే ప్రస్తావన ఆ తరువాత పదే పదే వల్లె వేశారు. ఏప్రిల్ 21 నుండి మే 15వ తేదీ వరకు చేసిన 67 ప్రసంగాలలో మోదీ... కాంగ్రెస్ గురించి 63 సార్లు, హిందూ ముస్లింల గురించి 60, పథకాలు, అభివృద్ధి గురించి 60 సార్లు పేర్కొన్నారు. రామ మందిరం, విశ్వగురు వంటి అంశాల ప్రస్తావన తగ్గిపోయింది.



## కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు



**ఉత్తర్‌ప్రదేశ్ :** కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్తాన్ సానుభూతిపరులు అని, ఈ పార్టీలు పాకిస్తాన్ వద్ద అణాయుధాలు ఉన్నాయంటూ దేశాన్ని భయపెడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బస్తీ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సిఎం యోగీ ఆదిత్యనాథ్‌లో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ 2017లో జరిగిన ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్ పార్టీల పొత్తు విఫలమైందని, ఈసారి కూడా అదే జరగబోతుందన్నారు. ఇద్దరు యువరాజుల ఫ్లాప్ సినిమాను రీరిలీజ్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదంతో మనకు సవాలు విసిరిన దేశంలో ప్రజలు ఇప్పుడు ఆహార ధాన్యాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, పాకిస్తాన్ సమాప్తమైనప్పటికీ, దాని మద్దతుదారులైన కాంగ్రెస్ , ఎస్‌పిలు మాత్రం దేశాన్ని ఆ పేరుతో భయపెడుతున్నారని అన్నారు. పాకిస్తాన్ వద్ద ఆటంబాంబు ఉందని, కాబట్టి భయపడాలని వారు అంటున్నారని, వారికి 56 అంగుళాల (చప్పన్ ఇంచ్) ఛాతి గురించి తెలియదా? ఇప్పుడు ఉన్నది బలహీనమైన కాంగ్రెస్ ప్రభుత్వం కాదని మోదీ అన్నారు. భారతదేశాన్ని భయపెట్టాలని ప్రయత్నించేవాళ్ళని వదిలిపెట్టేది లేదని, వాళ్ళను వారి ఇంట్లోనే కొడుతున్నామని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇండియాకూటమి 79 స్థానాలను గెలవబోతున్నదని అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఎస్‌పి, కాంగ్రెస్‌లను మొద్దు నిద్ర నుండి జూన్ 4న ఉత్తర్ ప్రదేశ్ ప్రజలు మేల్కొలుపుతారని అన్నారు. అప్పుడు వారు ఇవిఎంలను తిడతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని, దళితులు, బిసిల రిజర్వేషన్‌కు అంతం పలుకుతుందని మోదీ అన్నారు.

## కౌంటింగ్‌కు ముందు ఉపవాసం ఉండండి!

### కార్యకర్తలకు అరుణాచల్‌ప్రదేశ్ బిజెపి ఆదేశం

**ఈటానగర్ :** శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరగుతున్న ఆరుణాచల్ ప్ర దేశ్‌లోని లాంగ్‌డింగ్‌పుమావో నియోజకవర్గ బిజెపి కార్యకర్తలు ఫలితాలకు ముం దు రోజు ఉపవాసం ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు జూన్ 1న అంద రూ ఉపవాసం ఉండాలని సర్క్యులర్ జారీ అయింది. ఆ రోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పూజలు చేస్తూ నిరాహారంగా ఉండాలని భావిస్తున్నారు.

## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది : కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను ఏ విధంగా మోసం చేసిందో ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు సైతం అదే తరహాలో వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి. అమలు చేయకుండా రైతాంగాన్ని దగా చేసిన కాంగ్రెస్ ఇప్పుడు కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ అంటూ మరో మోసానికి పాల్పడిందన్నారు. .గతంలో ఇచ్చిన హామీలను మరిచి, పార్లమెంటు ఎన్నికల సమయంలోనూ అనేక కొత్త హామీలు ఇవ్వడమే కాకుండ. కాంగ్రెస్ నాయకులు దేవుడు, దేవతల పేరుతో ఒట్లు పెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం సరఫరా చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని, . కాని రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు 2023 24 కు రబీ సీజన్ కు సంబంధించి 33 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని మాత్రమే సేకరించిందన్నారు. రైతుల నుంచి సకాలంలో వరిధాన్యాన్ని సేకరించకుండా, అకాల వర్షాలకు ధాన్యం నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వం నోరెళ్లబెట్టి చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. వెంటనే ఇచ్చినా హామీలను నేరవేర్చడంతో పాటు రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డి నుంచి మా భూములు మాకు అప్పగించండి :

### బాధిత రైతుల ఆవేదన



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మేడ్చల్ జిల్లా సుచిత్ర పరిధిలోని తన భూమిని కబ్జా చేస్తున్నారంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి చేస్తున్న ఆరోపణలను బాధితులు ఖండించారు. సర్వే నెంబరు.82 లోని 2.5 ఎకరాల భూమి తమదేనని, ఇందుకు సంబంధించిన నిజమైన పత్రాలు, డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని వారు అన్నారు. ఈ మేరకు బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో భూ యజమానులు, బాధితులు శేరి సుభాష్‌రెడ్డి, రాకేష్, మహ్మద్ బషీర్‌లు మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ భూమిపై మల్లారెడ్డికి కన్నుపడిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూమిని వదులుకొనే ప్రసక్తే లేదన్నారు. గత పదేళ్లుగా ఆ భూమి ఎవరెవరి నుండి మారుతూ వచ్చిందో వారిని కూడా తీసుకువచ్చి మీడియాకు చూపించారు. మల్లారెడ్డి మాదిరిగా తమకు భూకబ్జాలు చేయడం తెలియదన్నారు. ఆరుగాలం కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో ఆ భూమిని కొన్నామని, దురదృష్టవశాత్తూ మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా తమ భూమి సమీపంలోని భూమిని కొనిగోలు చేశాక, అధికార మదంతో సమీపంలోని తమ భూమిపై పడి సొంతం చేసుకునేందుకు యత్నించారన్నారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించామని వారు తెలిపారు. మా పొజీషన్ మాకు అప్పగించాలని కోర్టును, రాష్ట్ర ప్రభుత్వాన్ని రెవెన్యూశాఖను కోరుతున్నామన్నారు. తమకు భూమిని విక్రయిస్తు వచ్చిన వివిధ వ్యక్తులను మాజీ మంత్రి మల్లా రెడ్డి బెదిరిస్తూ రావడంతోనే తాము కోర్టును ఆశ్రయించామని, ఈ క్రమంలో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడంతో మంత్రిగా ఉన్న మల్లారెడ్డి ఆ భూమి జోలికి రాకుండా కొన్నాళ్లు నిలిచి పోయారన్నారు. మళ్లీ ఇంతలోనే మరోసారి ఆ భూమి తనదేనంటూ తమకు భూమి అమ్మిన వారికి ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ విషయం న్యాయస్థానం, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని వారు అన్నారు.

# ఉత్తర భారతంలో మండుతున్న ఎండలు



**న్యూఢిల్లీ:** దక్షిణ భారతానికి ఎండల నుంచి కొద్దిపాటి ఉపశమనం లభించగా, ఉత్తర భారతంలో మాత్రం ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మండుతున్న ఎండలు అల్లాడిస్తున్నాయి. రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. మరో ఐదు రోజుల పాటు ఈ ప్రభావం ఉంటుందని ఒక ప్రకటిస్తూ, రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్‌ను అధిగమించే అవకాశం ఉందని తెలిపింది. సాధారణం కంటే ఇది చాలా ఎక్కువ. రాజస్థాన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45 డిగ్రీల సెల్సియస్ నుంచి 47 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా హీట్‌వేవ్‌తో ఆ రాష్ట్రం అల్లాడిపోతున్నది. పంజాబ్, హర్యానాలోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అక్కడ కూడా పగటిపూట ఉష్ణోగ్రతలు సగటున 45 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. మరో రెండు రోజుల్లో పరిస్థితి తీవ్రమవుతుందని పేర్కొన్న ఐఎండి, రెడ్ అలర్ట్ జారీ చేస్తామని తెలిపింది. ఎండల తీవ్రత వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపింది. సాధ్యమైనంత వరకూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచించింది. మొత్తం మీద ఉత్తర భారతం ఎడతెగని వేసవి ఎండలో మండుతుండగా, దక్షిణాదిలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఈసారి రుతుపవనాలు, సాధారణం కంటే మూడు రోజులు ముందుగానే, అంటే జూన్ ఒకటో తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండి ప్రకటించింది.

**దేశంలో మంగళవారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు**

సిర్సా (హర్యానా): 47.8 డిగ్రీల సెల్సియస్
నజాఫ్‌గఢ్ (ఢిల్లీ): 47.4 డిగ్రీల సెల్సియస్
పిలానీ (రాజస్థాన్): 47.2 డిగ్రీల సెల్సియస్
భటిండా విమానాశ్రయం) (పంజాబ్): 46.6డిగ్రీల సెల్సియస్
ఆగ్రా తాజ్ (ఉత్తర ప్రదేశ్): 46.6 డిగ్రీల సెల్సియస్
రత్లాం (మధ్యప్రదేశ్): 45.6 డిగ్రీల సెల్సియస్
సురేంద్రనగర్ (గుజరాత్): 45.4 డిగ్రీల సెల్సియస్
అకోలా (మహారాష్ట్ర): 44.0 డిగ్రీల సెల్సియస్
దుర్గ్ (ఛత్తీస్గఢ్): 43.6 డిగ్రీల సెల్సియస్

## ఆదర్శప్రాయుడు మందడపు నాగేశ్వరరావు

### మూడవ వర్ధంతి సభలో కూనంనేని



**ప్రజాపక్షం / మధిర :** నేటి రాజకీయ, విద్యార్థి నాయకులకు కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు ఆదర్శప్రాయుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మల్లారం గ్రామంలో మందడపు నాగేశ్వరరావు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి మందడపు నాగేశ్వరరావు విగ్రహం వద్ద నాయకులు పార్టీ జెండా ను ఆవిష్కరించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మడుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ఎర్రజెండాతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అదే ఒరవడిని మం దడపు నాగేవ్వరరావు అనుసరించి అందరికి మార్గదర్శకులు అయ్యారన్నారు. పేదల పక్షాన నిలబడి మల్లారం గ్రామ ఎంపిటిసిగా గెలుపొంది విశేష సేవలందించారన్నారు. అలాగే సిపిఐ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈరోజు గ్రామంలో వందలాది మంది ప్రజలు వర్ధంతి సభకు హాజరయ్యారంటే నాగేశ్వరరావు పట్ల మీకున్న అభిమానం ఏమిటో అర్ధమవుతుందని అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మల్లారం గ్రామ పంచాయతీ స్థానాన్ని సిపిఐ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటమే మందడపు నాగేశ్వరరావుకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, నాగేశ్వరరావు సతీమణి మందడపు రాణి, బెజవాడ రవిబాబు, సిపిఐ మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, సిపిఐ మండల, గ్రామశాఖ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మోసపోయి.. గోసపడాల్సి వస్తోంది

### బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గారంటీలతో ప్రజలను మోసం చేసిందని, ఇప్పుడు ప్రజలు గోసపడాల్సి వస్తోందని, ఎన్నికల్లు వచ్చినప్పుడుల్లా కాంగ్రెస్‌పార్టీ అరచేతలో వైకుంఠం చూపించి పబ్బం గడుపుతోందని , ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరైన గుణపాఠం కాంగ్రెస్ పార్టీకి చెప్పాలని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఏనుగుల రాకేష్‌రెడ్డకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించాలని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ నర్సంపేట పట్టణంలోని పద్మశాలీ గార్డెన్‌లో నర్సంపేట మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని వినూత్న కార్యక్రమాలు చేసినియోజకవర్గ అభివృద్ధి చేసి మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఓడిపోవడం దురదృష్టకరమన్నారు. కిందటి ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో మీటింగ్‌లు పెట్టి ప్రజలు మోసపోవద్దని చెప్పామని, కాని కాంగ్రెస్ చెప్పి మోస పూరితమైన హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో భాగంగా డిసెంబర్ 09న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చాడన్నారు. ముఖ్యమంత్రి అయిన మొదటి రోజు రుణమాఫీ మీద సంతకం పెడతాని చెప్పారని, ఇప్పటికే ఆరునెలలు గడుస్తున్న పట్టించుకోవడంలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు రూ. 10వేల రైతుబంధు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ. 15వేలు రైతు భరోసా ఇస్తామని హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. నేటికి ఆరు నెలలైనా ఇంత వరకు ఏ గ్యారంటీని అమలు చేయని నిస్సహాయక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు నాట్లు వేసే ముందు రైతుబంధు పడేదని, కాంగ్రెస్ హయంలో మాత్రం ఓట్లు వేసే ముందు మాత్రమే రైతు బంధు పడుతుందన్నారు. రైతులకు, ఉద్యోగులకు, గ్యాడ్యుయేట్లను, సమస్త ప్రజానీకాన్ని హామీలతో మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రేవంత్‌రెడ్డి ఎలక్షన్‌లో హామీలలో భాగంగా వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇప్పిస్తాని చెబుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 2లక్షల ప్రభుత్వ ఉద్యోగుఇచ్చిందన్నారు. కాని ఇచ్చిన ఉద్యోగాలను ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యామన్నారు. పదేళ్ల కాలంలో అధిక గవర్నమెంట్ ఉద్యోగాలను తీసుకువచ్చింది భారతదేశంలో కేవలం తెలంగాణలో భిఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. 73.శాతం జీతాలు పెంచిన మొదటి తేదిన జీతాలు వేయలేదని ఉద్యోగులు మాకు ఓటువేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక గ్యారెంటీ కూడా అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తుందన్నారు. నోటిషికేషన్ ఇవ్వకుండా ఇంటర్వ్యూ పెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నార్నారు. గ్రాడ్యుయేట్స్ ఓటర్లు మీ అమూల్యమైన ఓటును బిఆర్‌ఎస్ పార్టీ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్, సమన్వయ కర్త రవీందర్, నాయక్,మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం దళిత సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



**ప్రజాపక్ష / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి కార్పొరేషన్ పథకాలు, నిధులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిహెచ్‌పిఎస్ డిమాండ్ చేసింది. దళితుల ఇండ్ల స్థలాల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని డిహెచ్‌పిఎస్ పిలుపునిచ్చింది. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం కందుకూరి రాజారత్నం అధ్యక్షతన బుధవారం హైదరాబాదులోని మగ్ధూంభవన్‌లో జరిగింది. ఇటీవల మరణించిన డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బందెల నర్సయ్య సమావేశం సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. నర్సయ్య చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు సంక్షేమం, అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలు నిర్వీర్యం అవుతున్నాయని, 2018 నుండి ఇప్పటివరకు ఎస్‌సి కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఒక్కరికి కూడా కార్పొరేషన్ ద్వారా న్యాయం జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వం దళితబంధుపై గురించి మాట్లాడడంలేదని విమర్శించారు. దేశంలో దళితులపై మతోన్మాద శక్తులు దాడులు నిత్యం పెరిగిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రాజకీయ శిక్షణ శిబిరాన్ని జూన్ 18–20 తేదీలలో భువనగిరి యాదాద్రి జిల్లాలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.ఏసురత్నం, నాయకులు తాళ్లపల్లి లక్ష్మ ణ్‌తో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జె.కుమార్, డి.రాములు, లింగస్వామి, మహేష్, కాంతారావు, మద్దిల దినేష్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం

గురువారం, మే 23

# తెలుగు రాష్ట్రాలమధ్య సహకారం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం కుటుంబసమేతంగా తిరుమలలో దైవదర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహ–సహకారాలను ఆకాంక్షించారు. తెలంగాణ నుంచి వచ్చే భక్తుల నిమిత్తం తిరుమలపై కాటేజీలు నిర్మించే విషయం తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడే ప్రభుత్వంతో తాము మాట్లాడుతామని ఆయన చెప్పారు. ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉండనేదానితో నిమిత్తంలేకుండా ప్రజల విస్తృత ప్రయోజనాలరీత్యా సత్సంబంధాలు అవసరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కూడా ఆ మధ్య ఒక టివి ఇంటర్వ్యూలో పృచ్ఛకుని ప్రశ్నకు సమాధానం, ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేదానితో తమకు సంబంధంలేదన్నారు. అయితే గుచ్చిగుచ్చి ప్రశ్నించగా జగన్ తిరిగి అధికారంలోకి వస్తారన్నది తమకున్న సమాచారమన్నారు. ఎపి మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారాచంద్రబాబు నాయుడుతో ఆయనకు సత్సంబంధాలు లేకపోవటం తెలిసిందే. ఐదేళ్లక్రితం వైసిపినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి అధికారంలోకి వచ్చాక కెసిఆర్ ఆయన్ను ఇంటికి స్వాగతించి విందు ఇవ్వటం, ఏకాంతంగా సంభాషించటం తెలిసిందే. అంతకుముందు ఎపి అసెంబ్లీ ఎన్నికల్లో (2019) జగన్‌రెడ్డికి కెసిఆర్ తోడ్పడ్డారనే వదంతులు ఉన్నాయి. అయితే ఆ వ్యక్తిగత స్నేహం ఉభయ రాష్ట్రాలమధ్యనున్న 'విభజన' సమస్యల పరిష్కారానికి తోడ్పడలేదు. రాష్ట్ర విభజనకు పూర్వం ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధ్యక్షుడిగా ఉన్న తెలుగుదేశం పార్టీలో రేవంత్‌రెడ్డి ముఖ్యనాయకుల్లో ఒకరిగా ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ శాసన సభ్యుని ఓటుకొరకు బేరంలో రేవంత్‌రెడ్డి పాత్రధారిగా ఉన్నట్లు 'ఓటుకు నోటు' కేసులో ముద్దాయిగా ఉన్నారు. ఎపిలో చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి అవుతారనే ఊహాగానాల మధ్య వారి స్నేహబంధాలుగుర్తు చేసుకొన్నాక్రితం రేవంత్‌రెడ్డిని విలేకరులు ప్రశ్నించినా వ్యక్తిగత సంబంధాలకు రాష్ట్ర ప్రయోజనాలను నిర్లయించబోవన్నారు. అదే నిజం. ఉదాహరణకు, రెండు రాష్ట్రాల మధ్య కీలకసమస్యల్లో నదీజలాల పునఃపంపిణీ ప్రధానమైంది. ఇదిప్పుడు ట్రిబ్యునల్‌కు నివేదించబడింది. ఆలోపు నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణను ఆయా నదుల మేనేజిమెంట్ బోర్డులకు అప్పగించాలన్న కేంద్రం తాఖీదుపంపితే ఎపి ప్రభుత్వం–తెలంగాణ అంగీకరిస్తే తమకు అభ్యంతరం లేదనే షరతుతో అంగీకారం తెలిపింది. కానీ నాటి కెసిఆర్ ప్రభుత్వం అనేక మినహాయింపులు వ్యక్తం చేసింది. అలాగే పదేళ్ల గడువున్నా (జూన్2 నాటికి) ఉద్యోగుల సమస్య పరిష్కారం కాలేదు. ఉమ్మడి ఆస్తుల విభజన సమస్య పరిష్కారంలో పురోగతిలేదు. చిక్కుముడిగా ఉన్న సమస్యలను విభజన చట్టం నిర్దేశించిన ప్రకారం పరిష్కరించేందుకు చొరవతీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం తూతూమంత్రం ప్రయత్నంతప్ప సీరియస్‌నెస్ ప్రదర్శించనందున ఎక్కడవేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. ప్రజల మధ్య విభజన నాటి భావోద్వేగాలు, భయాలు, అనుమానాలు గడచిన పదేళ్లకాలంలో సమసిపోవటం, సంబంధ బాంధవ్యాలు కొనసాగుతుండటం శుభపరిణామం. రాజకీయ శక్తులు కూడా తమ స్వార్థప్రయోజనాల కోసం భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించకపోవటం ఆహ్వానించదగింది. ఉభయ రాష్ట్రాల వ్యాపారవర్గాలు, రాజకీయ నాయకులు కలిసిమెలిసి ఎప్పటివలె వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. ఇవన్నీ ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య సాధారణ సంబంధాలకు, సుహృద్భావ వాతావరణానికి సూచనలు. ప్రభుత్వనేతల మధ్య వ్యక్తిగత సత్సంబంధాలు చట్ట పరిధిలోనే ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు వీలుకల్పిస్తాయి. ఇప్పటికే పదేళ్లు గడిచిపోయాయి. ఇంకా దీర్ఘకాలం ఉమ్మడి సమస్యలను నాన్చడం అభిలషణీయం కాదు. అసంతృప్తి రాజకీయనాయకులు అవసరమనుకున్నప్పుడు అగ్గిరాజేయటానికి అవి అవకాశమవ్వకూడదు. అప్పుడే తెలుగు ప్రజల మధ్య స్నేహసంబంధ బాంధవ్యాలు పరిఢవిల్లుతాయి.

# మోదీ వైఫల్యాలు పట్టించుకోని 'గోదీ'

ప్రధాని నరేంద్ర మోదీ గత పదేళ్లలో ఎన్నోకొన్ని విజయాలు సాధించి ఉండవచ్చు. కానీ, అంతకు మించిన వైఫల్యాలు ఉన్నాయి. కానీ, విచిత్రంగా జాతీయ మీడియాలో ఒక వర్గం ఈ కోణాన్ని ప్రస్తావించడం లేదు. కఠినమైన ప్రశ్నలు సంధించడం లేదు. ఒకవేళ ఒకటి రెండు ప్రశ్నలు దొర్లినా, వాటికి ప్రధాని సరైన సమాధానం ఇచ్చిన దాఖలాలు లేవు. రెట్టించి అడిగే సాహసం 'గోదీ మీడియా' ఎప్పటికీ చేయదు. ఎలక్టోరల్ బాండ్ల పథకం (ఇబిఎస్) రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీం కోర్టు వాటి జారీని రద్దు చేసినప్పుడు కూడా, మోదీ తన చర్యను సమర్థించుకున్నారు. పాత వాదననే మళ్లీమళ్లీ వినిపించారు. నిజానికి ఈ పథకం చాలా మంచిదని, దేశ రాజకీయాల్లో పారదర్శకత సాధ్యమవుతుందని నొక్కివక్కాణించారు. 'అయితే సుప్రీం కోర్టు నిర్ణయాన్ని అప్పంటారా?' అని ఏ ఒక్కరూ ప్రశ్నించకపోవడం విచిత్రం. ముస్లింలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినప్పుడు, ఆతర్వాత యూటర్న్ తీసుకున్నప్పుడు కూడా ఆయన 'వీరభక్త మీడియా' స్పందించలేదు. 'ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు' అంటూ మోదీ విమర్శించింది ఎవరినో అందరరికీ సులభంగానే అర్థమైనా, ఆ మీడియా ప్రతినిధులకు మాత్రం అర్థంకాదు. అలాంటి వారికి దేశ ఆదాయం, సంపదలో ఎక్కువ భాగం పోతుందని రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో చెప్పిన ప్రధాని, ఆ తర్వాత కూడా అదే ఒరవడిని కొనసాగించారు. హిందూ మహిళలు తమ మంగళ సూత్రాలను కూడా కోల్పోవాల్సి వస్తుందని కూడా అన్నారు. 'చొరబాటుదారులు' అంటూ ఘాటుగా విమర్శించారు. అయితే, ఒక చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఎక్కువ మంది పిల్లలు' అనే మాటలను ముస్లింలను ఉద్దేశించి అనేలేదని చెప్పారు. ఈ మాట అనగానే ముస్లింలు గుర్తుకురావడం దుర్మార్గమంటూ ప్రజల ఆలోచనే తప్పని తేల్చారు. ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాల్లోనే పేదరికం ఎక్కువగా ఉంటుందనేదే తన అభిప్రాయమని అన్నారు. ఆయన వాదన నిజమే అనుకుందాం. మరి చొరబాటుదారులు ఎవరు? ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారు? కానీ, ఆ ప్రశ్న అడిగింది ఎవరు? మార్చి 31వ తేదీ నుంచి ఈ నెల 14న వారణాసి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేసే వరకూ మోదీ ఏకంగా నాలుగు పదుల ఇంటర్వ్యూలు ఇచాఇ్చరు. కానీ, ఏ ఒక్కదానిలో కూడా ఆయనకు చిక్కు ప్రశ్నలు ఎదురుకాలేదు. పదేళ్ల పాలనలో చోటు చేసుకున్న వైఫల్యాలను ఇంటర్వ్యూ చేసిన వారిలో ఎవరూ ఎత్తిచూపలేదు. గతంలో ఇచ్చిన హామీలపై ప్రశ్నించలేదు. అవి ఎందుకు అమలు కాలేదని నిలదీయలేదు. ప్రజాస్వామ్య దేశంలో నాయకులను ప్రశ్నించే అధికారం ప్రజలకు ఉంది. మీడియానే ప్రజల గొంతుకగా మారాలి. కానీ, మీడియాలో సింహభాగం గాండ్రించడం ఎప్పుడో మానేసింది. పిల్లిలా మారిపోయింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకపోవడమే ఇందుకు నిదర్శనం. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పంటలకు గిట్టుబాటు ధరలు (ఎంఎస్‌పి) ఇవ్వడంతోపాటు చట్టబద్ధత కల్పించడం తదితర అత్యంత తీవ్రమైన సమస్యలను పక్కనపెట్టేశారు. దీనితో మోదీ ఆ ఇంటర్వ్యూలో ఎక్కువ భాగం మూడోసారి ప్రధానిగా ఎన్నిక కావడంపై ధీమా వ్యక్తం చేయడంలోనే సరిపోయింది. ఆ తర్వాత 2047లో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టాలన్న బిజెపి లక్ష్యాన్ని సుదీర్ఘంగా వివరించారు.




సంపద అతి కొద్ది మంది వద్ద కేంద్రీకృతమవుతున్న విషయాన్ని మీడియా ప్రతినిధులు అడిగిన పాపాన పోలేదు. పేద, ధనిక వర్గాల మధ్య పెరుగుతున్న అంతరాలను మాటపూర్వకంగానైనా అడగలేదు. ఉద్దేశపూర్వక ఎగవేతదారులను పూర్తిగా మరచిపోయింది. ప్రభుత్వ బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని, విదేశాలకు పారిపోయిన లేదా చెల్లించకుండా మొండికేసిన వారిపై మోదీ ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరించిన అంశం కూడా ప్రస్తావనకు రాలేదు. నిరర్థక ఆస్తుల పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయలను మాఫీ చేసిన కేంద్రాన్ని, ఈ మొత్తాలు ఎక్కడివని సూచన ప్రాయంగానైనా అడగలేదు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఏమయ్యాయి? 2023లోగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ ఎక్కడికెళ్లింది? స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న భారతీయుల నల్ల ధనాన్ని ఎందుకు వెనక్కు తెప్పించలేదు? ఇలాంటి సవాలక్ష ప్రశ్నలు ఎవరిని కదిలించినా అడుగుతారు. కానీ, ప్రజలకు ప్రతినిధులుగా ప్రకటించుకుంటున్న ఓ వర్గం మీడియా మాత్రం నిమ్మకునీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నది. దేశంలో ముస్లింలపై పెరుగుతున్న హింస కనిపించడం లేదు. మండుతున్న మణిపూర్ ఊసే లేదు. చైనా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలపై ప్రశ్నలు లేవు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యాలయంలో, ఆ పార్టీకే చెందిన రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలీవాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సన్నిహితుడు బిభవ్ కుమార్ దాడి చేసి, దారుణంగా కొట్టారంటూ మోదీసహా బిజెపి నేతలంతా విమర్శించారు. ఆప్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిభవ్‌ను అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ ఘటన నిజమే అయితే, బిభవ్ శిక్షార్హుడే. ఎవరూ కాదనరు. కానీ, కర్నాటకలో తన మిత్రపక్షమైన జనతాదళ్ (సెక్యూలర్) ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైగింక దాడుల ఆరోపణల గురించి ఎందుకు నోరు విప్పడం లేదు? పదులు, వందల సంఖ్యలో మహిళలను లైంగికంగా వేధించిన ప్రజ్వల్ చేసింది తప్పని ఎందుకు అంగీకరించరు? ప్రజ్వల్ తాత, భారత మాజీ ప్రధాని హెచ్‌డి దెవెగౌడ కూడా తన మనుమడు తప్పుచేస్తే, శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేసి, మర్యాద నిలబెట్టుకున్నారు. కానీ, 'నారీ శక్తి', 'బేటీ బచావో.. బేటీ పఢావో' వంటి నినాదాలిస్తూ, మహిళాభ్యుదయం గురించి మాట్లాడే మోదీ మాత్రం ఎందుకు పరోక్షంగా సమర్థించారు? 'జనతాదళ్ (సెక్యూలర్) పార్టీతో ఒకప్పుడు కాంగ్రెస్‌కు కూడా పొత్తు ఉంది' అంటూ ఎత్తిచూపారు. అప్పట్లో ఇలాంటి ఆరోపణలు రాలేదు కదా? వేరువేరు అంశాలను ఎందుకు ఒకచోట చేరుస్తున్నారు? అని ఇంటర్వ్యూ చేస్తున్న వారు ప్రశ్నించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ, ఎవరూ అడగనే లేదు. నిజానికి ఇలాంటి విషయాల్లో మీడియా నిలదీసినా పట్టించుకోని నాయకులు, అసలు అడగకుండానే సమాధానమిస్తారా? ఇంటర్వ్యూలలో ప్రజా సమస్యలపై మోదీ స్పందించకపోవడంలో అశ్చర్యం ఏముంది? బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం వేధిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. నిధులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నదని వివిధ రాష్ట్రాలు విమర్శిస్తున్నాయి. ఈ విషయంలో కర్నాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఇంతటి తీవ్రమైన పరిణామాలను కూడా 'గోదీ మీడియా' పరిగణలోకి తీసుకోలేదు. ప్రధానిని ప్రశ్నించలేదు. వివరణ కోరలేదు. సమాఖ్య దేశంలో యూనిటరీ విధానాలను కేంద్రం అమలు చేస్తున్నప్పటికీ, సమాధానం చెప్పాలని కోరలేదు. అగ్నిపథ్ పథకంపై సర్వత్రా అసంతృప్తి చెలరేగుతున్నది. ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లు (సిఎఎ)ను పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీలుగా ఉండి, భారత్‌కు వలస వచ్చిన వారికి ఇక్కడి పౌరసత్వం ఇవ్వాలన్న కేంద్ర నిర్ణయాన్ని తప్పుపడుతున్నాయి. ఎలాంటి పత్రాలు లేకుండానే భారత్‌లోకి ప్రవేశించడానికి సిఎఎ అనేది రాచమార్గాన్ని సృష్టిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. కానీ, వీటిలో ఏ ఒక్క అంశాన్నీ మోదీ అభిమాన మీడియా లేవనెత్తలేదు. అంత వరకూ ఎందుకు, బిజెపి గుజరాత్ రాష్ట్ర శాఖలో అంతర్గత కుమ్ములాటలను ప్రస్తావించే ధైర్యం కూడా ఈ మీడియా చేయలేకపోయింది. సూక్ష్మంగా చెప్పాలంటే, ఇంటర్వ్యూల పేరుతో ఈ చానెళ్లు, పత్రికలు ప్రధాని ఎన్నికల ప్రచారానికి సహకరించాయి. ఆయనకు ఎలాంటి ఇబ్బంది లేని ప్రశ్నలు వేశాయి. ఎలాంటి సమాధానం వస్తుందో తెలిసిమరీ, ప్రశ్నలను ఎంపిక చేసుకున్నాయి. కఠినమైన ప్రశ్నలు వేయడానికి సాహసించలేదు. వివాదాస్పదంగా మారిన ఎన్నో కీలక అంశాలను ప్రస్తావించలేదు. ఈ మీడియా ప్రజల గొంతుక పేరుతో బిజెపి గొంతుక వినిపించింది. ప్రధానితో వినిపింపచేసింది. సరైన ప్రశ్నలు లేవు... నిజాయితీగా సమాధానాలు లేవు. ప్రజలంటే భయం లేదు... సమస్యలపై బాధ లేదు. రిజర్వేషన్లు తదితర అంశాలపై రాజ్యాంగాన్ని మార్చడానికి 400 సీట్లతో అద్భుత విజయాన్ని అందించాలని ప్రజలను ఒకవైపు కోరుతూనే, దేశ రాజ్యాంగాన్ని ఏ శక్తీ మార్చలేదని ప్రకటించడం మోదీకి మాత్రమే సాధ్యమైంది. దేశంలో 90 కోట్ల మందికి ఉచిత ఆహార పథకాన్ని అమలు చేస్తున్నామని ఒకవైపు అంగీకరిస్తూనే, మరోవైపు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుదల గణాంకాలను చూపిస్తూ, దేశం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తున్నదని ప్రకటిస్తారు. ఆయన ఎన్ని మాటలు మార్చినా, గోదీ మీడియా పట్టించుకోలేదు. కేవలం ఆయన ఏది చెప్తే అది వినడానికి మాత్రమే అయితే, ఇంటర్వ్యూల పేరుతో ఆర్భాటాలు ఎందుకో? ఎన్నికల ప్రచారంలో ఇదీ ఒక భాగమని ప్రకటించుకుంటే సరిపోయేది కదా? బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి, దేశాన్ని నడిపిస్తున్న వ్యక్తి ఇంటర్వ్యూలను ఎన్నికల ప్రచార కార్యక్రమాలుగా మార్చిన ఘనత గోదీ మీడియాకే దక్కుతుంది. ప్రైవేటు సంస్థలుగా మారిపోయిన ఇలాంటి మీడియా కార్యాలయాల్లో ప్రజాహితం అందని ద్రాక్ష. నాయకుల నిలదీత ఓ ఎండమావి. 'ప్రధాని మోదీ నిజం చెప్పరు. సమస్యపై స్పందించరు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంపై ఉన్న శ్రద్ధ ప్రజల పట్ల లేదు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడం, ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు చేయడం వంటి లక్ష్యాలతో ఆయన పని చేస్తున్నారు' అంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలకు ఇటీవల ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలు బలం చేకూరుస్తున్నాయి. ఒక బలమైన జాతీయ మీడియా వర్గం ఆయనకు అనుకూలంగా పని చేస్తున్నదని మరోసారి రుజువైంది. పార్టీ శ్రేణులను ప్రోత్సహించడానికి, ప్రజలను మరోసారి మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవడానికి తప్ప ఈ విధమైన ఇంటర్వ్యూలు ఎందుకూ పనికిరావన్నది నిజం. మీడియా ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పుడు పరిస్థితి ఇదే తీరులో ఉంటుంది. ప్రజా సమస్యలు చర్చకు రావు. రాజకీయ నాయకుల చీకటి కోణాలు బయటపడవు. సామాన్యుడికి భద్రత ఉండదు. దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే భయం సామాన్యుడిని వెంటాడి వేధిస్తునే ఉంటుంది.

బిఎల్

# హిట్లర్ నుంచి కాపీ కొట్టిన ప్రచారరీతులు

ఎం కోటేశ్వరరావు

ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు జరిగిన లేదా జరిపిన ప్రచారంలో ఇండియా కూటమి పార్టీలు బిజెపి విధానాలపై విమర్శలతో పాటు ఆ కూటమిలోని పార్టీలు విడివిగా ప్రకటించిన మానిఫెస్టోలోని అంశాలను, అలాగే బిజెపి నాలుగువందల సీట్లు ఎందుకు కోరుతున్నదో, ఏం చేసేందుకు అన్నిసీట్లు కోరుతున్నదో స్పష్టంగానే ప్రచారం చేశాయి. బిజెపి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ఎత్తివేస్తుందన్నది ప్రధానమైన విమర్శ. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ఎంతసేపూ ఎన్నిమరుగుదొడ్లు కట్టించిందీ, ఎన్ని ఉజ్వల గాస్ కనెక్షన్లు ఇచ్చిందీ, రోడ్లు వేసిందీ చెప్పుకోవటం తప్ప జన జీవితాలను మెరుగుపరిచేందుకు చేసిందేమిటో పెద్దగా చెప్పలేదు. పచ్చి అవాస్తవాలను, ఆధారంలేని ఆరోపణలను ఎన్నింటినో స్వయంగా నరేంద్రమోడీ ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఇంతగా వక్రీకరణ, అవాస్తవాలు, అభూత కల్పనలు ప్రచారం చేసిన ప్రభుత్వ నేత మరొకరు లేరన్నది వేరే చెప్పనవసరం లేదు. మీడియాలో ఎన్ని టీవీ ఛానళ్లు వాటి గురించి చర్చలు పెట్టాయి, ఎన్ని పత్రికలు ప్రముఖంగా విశ్లేషణలు, వాస్తవాలను వెల్లడించాయి ? ఇదేం ప్రచారం అన్నట్లుగా కొందరు గొణగినట్లు విమర్శించటం తప్ప గట్టిగా బట్టబయలు చేసే ధైర్యం చేయటం లేదు. విదేశీ మీడియాలో కూడా ఇదే వ్యక్తమైంది.

నరేంద్రమోడీ ఇన్ని పచ్చి అబద్దాలను ప్రచారం చేయటం వెనుక ఉన్న మతలబు ఏమిటి ? పలుకుబడి దిగజారుతున్న పూర్వరంగంలో మైనారిటీ విద్వేషంతో లాభం లేదని గ్రహించి, కాబోలు ముందే చెప్పుకున్నట్లు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారంటూ హిందువులను రెచ్చగొట్టి లబ్దిపొందాలన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి మసీదులు, చర్చీలను కూల్చివేసిన చరిత్ర కాషాయ దళాలది తప్ప ఇతర పార్టీలది కాదు. రోడ్ల విస్తరణ పేరుతో నరేంద్రమోడీ సిఎంగా ఉండగా అహమ్మదాబాద్‌లో కొన్ని మందిరాలను కూడా తొలగించారన్న వార్తలు తెలిసిందే.హిట్లర్ నాయకత్వంలోని నాజీల ప్రచారం గురించి ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది. విశ్లేషణలు వెలువడుతూనే ఉన్నాయి. రాజకీయ,చరిత్ర,మతం, కులం, సాంస్కృతిక అంశం ఏదైనా సరే తమకు అనుకూలంగా ఉంటుందని ఎవరు భావించినా వాటిని వక్రీకరించి తమకు అనుకూలంగా మలుచుకోవటం వెనుక రెండు రెళ్లు నాలుగు అన్న విశ్వవ్యాప్త సూత్రం ఒకటే ప్రాతిపదిక. అదే '' పర్వతమంత అబద్ధం '' చెప్పటం, వాస్తవానికి వక్రీకరణ, వక్రభాష్యం చెప్పి జనాన్ని బురిడీ కొట్టించటం. ఒక అబద్దాన్ని పదే పదే చెబితే చివరికి నిజమై కూర్చుంటుంది. ఎంతైతే మాత్రం ఫలానావారు అంత నిస్సిగ్గుగా అబద్ధం అడతారంటే నేను నమ్మను అనే విశ్వాసాన్ని సొమ్ము చేసుకోవాలని తొలిసారిగా హిట్లర్ 1925లో మెయిన్ కాంఫ్ అనే గ్రంథంలో చెప్పాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయినపుడు జర్మనీలో చర్చ జరిగింది. జర్మనీ మిలిటరీలో లక్షమందికి పైగా యూదులు సైనికులుగా ఉన్నారు.యుద్ధరంగంలో యూదులు సరిగా పోరాడని కారణంగానే జర్మనీ ఓడిపోయిందని ఒక ప్రచారం జరిగింది.ఓటమి గురించి ప్రభుత్వం విచారణ జరిపింది. పేరు పెట్టి ఫలానా సామాజిక తరగతి అని చెప్పలేదు గానీ వెన్ను పోటు కారణంగానే జర్మనీ ఓడిపోయిందనే ప్రచారాన్ని నిజమే అని చాలామంది నమ్మారు. నిజానికి దానిలో ఎలాంటి వాస్తవం లేదు. దాన్ని హిట్లర్ వంటి జాతీయవాదులు భుజానవేసుకొని యూదులే వెన్నుపోటుదారులంటూ రెచ్చగొట్టారు. అప్పటికే మతరీత్యా యూదులపై ఉన్న అభిప్రాయాలు, అనుమానాలతో ఉన్న జనం నిజమని నమ్మారు. చివరకు అది ఎంతవరకు దారి తీసిందంటే జర్మనీ ఆత్మరక్షణకు యూదులను అంతమొందించటానికి జర్మన్లకు హక్కు ఉందన్నవరకు పోయి మారణకాండకు దారితీసిన సంగతి తెలిసిందే. తన పార్లమెంటు భవనాన్ని(రీచ్‌స్టాగ్) తానే తగులబెట్టించి ఆ నెపాన్ని కమ్యూనిస్టుల మీద మోపి అణచివేసిన దుర్మార్గం తెలిసిందే.

హిట్లర్ ప్రచార పద్దతులను ఎన్నికల్లో ఓడిన డోనాల్డ్ ట్రంప్ కూడా వినియోగించుకొనేందుకు చూశాడు.ఎన్నికల్లో డెమోక్రాట్లు అక్రమాలకు పాల్పడ్డారని, ఫలితాలను తారుమారు చేశారని, తాను ఓటమిని అంగీకరించనని చెప్పటమే కాదు, అమెరికా అధికార కేంద్రంపై తన అనుచరులతో దాడి చేయించిన దుండగాన్ని కూడా చూశాము. తాను నిజంగానే ఓడినట్లు ట్రంప్‌కు ముందే తెలిసినా కావాలని రెచ్చగొట్టినట్లు తరువాత వెల్లడైంది. అలాంటి ట్రంప్‌ను గెలిపించాలని పిలుపు ఇచ్చిన మోడీ గురించి తెలిసిందే. కొందరు పనిగట్టుకొని పదే పదే తప్పుడు సమాచారాన్ని మెదళ్లలోకి ఎక్కిస్తే జనం ఎందుకు నమ్ముతున్నారు అనేది ప్రశ్న. దీని గురించి భిన్న కోణాలు వెలువడుతున్నాయి. తమ ముందుకు వచ్చిన ఒక సమాచారం వాస్తవం కాదని తెలిసినప్పటికీ అది పదే పదే వేర్వేరు మార్గాల్లో చేరితే ఏమో నిజమేనేమో అనే సందేహంలో పడతారు.బ్రాహ్మణుడు మేకపిల్ల కథ తెలిసిందే. దానికి ప్రతిగా సమాచారం లేకపోతే చివరికి నిజమని నమ్ముతారు. ఉదాహరణకు వైరస్‌తో జలుబు చేస్తుంది. నిజానికి దానికి మందు లేదు. ఎందుకంటే ఎప్పటికప్పుడు మారిన వైరస్‌కు వెంటనే మందు కనుగొనటం సాధ్యం కాదు. ఏదైనా బిళ్ల వాడితే వారంలో వాడకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుందన్న లోకోక్తి తెలిసిందే. మనశరీరంలోని రోగనిరోధకశక్తి ఆ వైరస్‌ను ఎదుర్కొన్న తరువాత అదే తగ్గిపోతుంది కానీ అనేక మంది ఫలానా గోలీ వేసుకుంటే మాకు తగ్గింది అని చెప్పారనుకోండి, కొంతకాలానికి మిగతావారు పోయేదేముంది మనమూ చూద్దాం అని ఆ గోలీలనే వాడతారు. ఇది వ్యక్తులకు సంబంధించిన అంశం కనుక పెద్దగా నష్టం ఉండదు. పొట్టను తగ్గించాలంటే సూక్ష్మంలో మోక్షంలా ఫలానా మిషన్ వాడితే తగ్గిపోతుందనే ప్రచారం తెలిసిందే. ఒక సారి చూద్దాం పోయేదేముంది అనుకొని అనేక మంది కొనుగోలు చేయటం, ఆయిల్ పుల్లింగ్, మంచినీటి వైద్యాల వంటి వాటికి బుర్రలను అప్పగించటం చాలా మందికి తెలిసిందే. ఇలాంటి వాటి వలన వ్యక్తులు నష్టపోతారు. అదే ఒక ప్రతికూల భావజాలానికి చెవి అప్పగిస్తే యావత్ సమాజానికే ప్రమాదకరం. ప్రతి మనిషి సగటున రోజు 35వేల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు పరిశోధకులు చెప్పారు. ఒక షర్టు ఆరటానికి అర్ధగంట పడితే పది షర్టులు ఎంతసేపటిలో ఆరతాయంటే ఐదు గంటలు అనేవారు, ఒక కిలో దూది బరువా ఒక కిలో ఇనుము బరువా అంటే ఇనుము అని చెప్పేవారి గురించి తెలిసిందే.అంటే ప్రతి క్షణానికి మన మెదళ్లకు ఎంతో సమాచారం అందుతుంటుంది.బహుశా ఈకారణంగానే వెంటనే బుర్రకు తర్కం కూడా తట్టదు. మన బుర్రలో రెండు రకాల ఆలోచనా వ్యవస్థలుంటాయట. ఒకటి అదుపులేని స్పృహతో తక్షణమే స్పందించేది, రెండవది స్పృహతో దీర్ఘంగా, లోతుగా ఆలోచించి నిర్ణయించేది. జనాలు మొదటిదానికే ఎక్కువగా పనిపెడతారని,అందువలన లోతుగా ఆలోచించకుండా చేసే పద్ధతులు, సమాచారాన్ని కొన్ని శక్తులు మనబుర్రలకు చేరవేస్తాయని భావిస్తున్నందున హిట్లర్ వంటి నియంతలు, మార్కెటింగ్ నిపుణులు, రంగులు మార్చే రాజకీయవేత్తలు ప్రతి తరాన్ని ఏదో విధంగా మభ్యపెట్టగలుగుతూనే ఉన్నారు.

ఫేక్,వక్రీకరించిన సమాచారం ఈ రోజు సామాజిక మాధ్యమాన్ని ఊపివేస్తున్నది. ఇవి పెద్దగా జనానికి అందుబాటులో లేని రోజుల్లో వినాయకుడు పాలు తాగాడన్న వార్త ఎంత సంచలనంగా మారిందో తెలిసిందే. సైన్సు పత్రికలో ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం వాస్తవ కథనాలకంటే తప్పుడు వార్తలు జనాలకు ఆరు రెట్లు వేగంగా చేరతాయని తేలింది.సంఘపరివార్ వంటి సంస్థలకు చెందిన వారు తొలిసారిగా చెప్పిన అంశాలను అనేక మంది తొలిరోజుల్లో నమ్మలేదు. కానీ పదే పదే వాటిని ప్రచారం చేస్తుండటంతో అనేక భ్రమాత్మక అంశాలు నిజమై కూర్చున్నాయి. ఉదాహరణకు రాహుల్ గాంధీకి అసలు గాంధీ పేరు ఎలా వచ్చిందని ప్రశ్నించటం తెలిసిందే. రాహుల్ తాత ఫిరోజ్ గాంధీ, అతని తలిదండ్రులు జొరాస్ట్రియన్ మతానికి చెందిన వారు. వందల సంవత్సరాల క్రితం పర్షియాపై దండయాత్ర చేసిన ఇస్లాం పాలకులు జొరాస్ట్రియన్లను అణచేందుకు పూనుకున్నపుడు అనేక మంది అరేబియా సముద్ర మార్గం ద్వారా గుజరాత్‌కు వలస వచ్చిన పూర్వీకుల కుటుంబాలలో ఫిరోజ్ గాంధీది ఒకటి. పర్షియాకు మరో పేరు ఇరాన్, అక్కడి నుంచి వచ్చారు గనుక ఇరానీలు, పార్సీలయ్యారు.వారి సంఖ్య ప్రస్తుతం లక్షమందికి లోపే.గతంలో పర్షియాలో ఉన్నపుడే వాణిజ్యంలో ముందున్నారు గనుక మన దేశం వచ్చిన వారు కూడా దాన్ని అందిపుచ్చుకొని దేశంలో నేడు ప్రముఖ వాణిజ్య, పారిశ్రామికవేత్తలుగా ఉన్నారు. మహాత్మాగాంధీలో గాంధీ పేరుతో వారికి ఎలాంటి సంబంధం లేదు. పార్సీలలో గాందే పేరుతో ఉన్నవారు చివరికి గాంధీలుగా నామాంతరం చెందారు.ఫిరోజ్ అని ఉంది గనుక అతను మన వాడే అని అనేక మంది ముస్లింలు భావించారు.దీన్ని ఎంత మంది గూగుల్లో వెతికి నిర్ధారించుకుంటారు. వాట్సాప్ ద్వారా పనిగట్టుకు చేస్తున్న ప్రచారం కూడా అలాంటిదే. అనేక తప్పుడు ప్రచారాలు ప్రారంభిస్తే కొన్నాళ్లకవి నిజాలై కూర్చుంటాయి. మతోన్మాదశక్తులు ఇంతకాలం చేసింది అదే. వాటితో జనాలు ప్రభావితులౌతున్నారు. అఫ్‌కోర్సు పెరుగుట విరుగుట కొరకే. హిట్లర్‌ను ఆరాధించిన జర్మన్లే ఇప్పుడు ఆ పేరు ఎత్తటానికి కూడా ఇచ్చగించరు వాడొక కుక్క అంటారు.

# ముంచుకొస్తున్న కొత్త వ్యాధులు!

వేగంగా చోటు చేసుకుంటున్న పర్యావరణ మార్పులతో కొత్త వ్యాధులు ముంచుకొచ్చే ప్రమాదం ఉందన్న అనుమానాలు పెరుగుతున్నాయి. కరోనా మహమ్మారి సృష్టించిన విలయాన్ని ప్రపంచం ఇంకా మరచిపోలేదు. చాలా దేశాలు ఇప్పటికీ ఆ ప్రభావం నుంచి కోలుకోలేదు. అలాంటి భయంకరమైన వైరస్ ఏదైనా కొత్తగా పుట్టుకొస్తే పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్న చాలా మంది వైద్య ప్రముఖులను వేధిస్తున్నది. ఈ క్రమంలోనే మరో మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రపంచం సిద్ధం కావాలని చైనాకు చెందిన కొవిడ్, అంటువ్యాధుల నిపుణుడు జాంగ్ వెన్‌హాంగ్ హెచ్చరిస్తున్నాడు. వాతావరణ మార్పులను నిశితంగా గమనిస్తూ, సంభావ్య కొత్త వైరస్ నుంచి బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నాడు. భూమిపై ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, గ్రహం వేడెక్కుతున్నప్పుడు, బాక్టీరియా, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు పరిణామం చెందుతాయి. కొన్ని పరివర్తనం చెంది, మరింత బలాన్ని సంతరించుకొని విరుచుకుపడతాయి. అంతేగాక, కొత్త ఆవాసాలకు వ్యాపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా కొత్తకొత్త కొవిడ్19 వేరియంట్లు, సబ్‌వేరియంట్లు వెలుగు చూస్తునేఉన్నాయి. వీటిని ఇంకా పూర్తిగా అరికట్టలేకపోతున్నాం. ఈలోగా తదుపరి మహమ్మారి దాడి చేయడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఎదుర్కోవడానికి సన్నాహాలు కూడా మొదలు పెట్టారు. వాతావరణ మార్పు కారణంగా అంటు వ్యాధులు ఉత్పరివర్తనను, వ్యాప్తిని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయంలో నిపుణులు ఇప్పటికే పురోగతి సాధించారు. ఈ పరిస్థితుల్లో కొత్త వైరస్ వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. అయితే, రాబోయే వైరస్ తీరుతెన్నులపై ఎలాంటి అవగాహన లేదు కాబట్టి, దాని శక్తిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని నిపుణులు అంటున్నారు. చైనాలోని నేషనల్ మెడిక్ సెంటర్ ఫర్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్న జాంగ్ సైతం ఈ విషయంతో ఏకీభవిస్తున్నాడు. 2020లో, కొవిడ్19పై పరిశోధనలు, నియంత్రణకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన షాంఘై క్లినికల్ నిపుణుల బృందానికి నాయకుడిగా వ్యవహరించిన అతను, ఆ వైరస్‌పై పోరాటం చేస్తున్న ప్రముఖ వ్యక్తిగా పేరు సంపాదించాడు. ప్రజల ఆరోగ్యం, అంటు వ్యాధుల రంగంలో ఇప్పటికే వందలాది పరిశోధనా పత్రాలు ప్రచురించాడు. కొవిడ్ ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనూ పరిష్కారం లభిస్తుందన్న ధీమాతో ఉన్న జాంగ్, ఇప్పుడు రాబోయే ప్రమాదం తీవ్రంగా ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. వేడెక్కుతున్న వాతావరణం పరోక్ష ప్రభావంతో వ్యాధికారక వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని స్పష్టం చేస్తున్నాడు. ఉష్ణమండల విస్తరణతోసహా భూమి వాతావరణం మారుతున్న తరుణంలో, వ్యాధికారక పరిణామం, పరివర్తన చెందే విధానం కూడా మారుతోంది. 'ప్రీరివ్యూడ్ జర్నల్ ఆఫ్ జియోఫిజికల్ రీసెర్చ్: అట్మాస్పియర్స్ ఇన్ 2020'లో ప్రచురించిన ఒక అధ్యయనం, ఉపఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల వేడెక్కడాన్ని, దాని విస్తరణను కనుగొంది. 'భూమి వేడెక్కుతున్న కొద్దీ బ్యాక్టీరియా, వైరస్ విస్తరణ కూడా జరుగుతున్నదని నిర్ధారించింది. ఈ మార్పులు బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ల బారిన పడే జంతువుల సంఖ్యను పెంచుతున్నాయి. ఇదే విషయాన్ని జాంగ్ తన అధ్యయన పత్రంలో ప్రస్తావించాడు. అమెరికాలో పేల ద్వారా వ్యాపించే ఎన్సెఫొలిటిస్, లైమ్ వ్యాధి ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశాలు పెరుగుతున్నాయని జాంగ్ అన్నాడు. చైనాలో దోమల వల్ల వచ్చే డెంగ్యూ జ్వరం గతంలో ఎప్పుడూ విస్తరించని ప్రాంతాల్లోనూ ఇప్పుడు కనిపించడాన్ని ఆయన ప్రస్తావిస్తున్నాడు. ఇది మరింత ఉష్ణమండల ప్రాంతాల నుండి, అదే విధంగా ఉత్తరం వైపు నుండి విస్తరిస్తోందని, ఇప్పుడు అది యాంగ్జీ నది బేసిన్ వరకు ఈ విస్తరణను చూస్తున్నామని జాంగ్ చెప్తున్నాడు. ఆగ్నేయ ఆసియా, ఆఫ్రికా దేశాల్లో మలేరియాను ఇప్పటికీ నియంత్రించలేకపోతున్న విషయాన్ని కూడా జాంగ్ గుర్తుచేస్తున్నాడు. యాంటిబయాటిక్స్‌ను కూడా తట్టుకొని, విస్తరిచగల శక్తిని మలేరియా వైరస్ సంపాదించుకుందని, అదే రీతిలో కొన్ని వైరస్‌లు కొత్త రూపాల్లోనూ, మరికొన్ని కొత్తగానూ పుట్టుకొస్తాయన్నది జాంగ్ అభిప్రాయం. పర్యావరణ సమస్యే ఈ వైరస్‌ల విజృంభణకు కారణమవుతుందని, కాబట్టి యుద్ధ ప్రాతిపదిక నివారణ చర్యలు చేపట్టాలని జాంగ్ స్పష్టం చేస్తున్నాడు. భవిష్యత్ రోజుల్లో మలేరియా వంటి వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు విపరీతంగా పెరుగుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ఇప్పటికే హెచ్చరించింది. జాంగ్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. కరోనా మహమ్మారి గబ్బిలాల నుంచి మానవులకు వ్యాపించిందని ఒక పరికల్పన ఉంది. అప్పటితో పోలిస్తే, ఇప్పుడు వాటి నివాసాలు విస్తరిస్తున్నాయి. అలాస్కా వంటి ఉత్తర ప్రాంతాలు వేడెక్కుతున్నందున, ఇంతకు ముందు ఎన్నడూ కనిపించని కొన్ని జాతులు మానవ సమాజంలోకి ప్రవేశిస్తాయి. పురాతన జాతుల బాక్టీరియా, శిలీంధ్రాలను మాధ్యమంగా చేసుకొని విరుచుకుపడతాయి. ప్రస్తుతానికి ఇవన్నీ అనుమానాలు మాత్రమే. అయితే, వాస్తవ రూపం దాల్చే అవకాశాలే ఎక్కువ. పర్యావరణం, మానవ జీవన విధానాల్లో వస్తున్న అవాంఛనీయ మార్పులు కొత్త వైరస్‌లకు మార్గం సులభం చేస్తాయని జాంగ్ చెప్తున్నారు. కొవిడ్ ప్రపంచాన్ని దారుణంగా దెబ్బతీసిందని, సుమారు 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని అంటున్న జాంగ్, రాబోయే వైరస్‌లు ఇంతకు పది రెట్లు ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టడం తప్ప, మనిషి ముందు మరో మార్గం లేదని స్పష్టం చేస్తున్నాడు. జాంగ్ హెచ్చరికల్లోని వాస్తవాలను ప్రపంచ దేశాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

ఆరోగ్యం

## కేరళలో 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా'

**తిరువనంతపురం:** కేరళలో ఓ ఐదేళ్ల చిన్నారి బ్రెయిన్ ఈటింగ్ అమీబా కారణంగా మృతి చెందిన ఘటన ఆందోళన కలిగిస్తున్నది. కలుషితమైన నీటిలో ఎక్కువగా ఉండే ఈ అమీబా వల్ల అరుదైన 'అమీబిక్ మెనింగోన్సిఫాలిటీస్ (బ్రెయిన్ ఈటింగ్ అమీబా) ఇన్‌ఫెక్షన్ మెదడులోకి చేరుతుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారంమూన్నియూర్ గ్రామ పంచాయతీకి చెందిన ఐదేళ్ల బాలిక ఈనెల ఒకటో తేదీన సమీపంలోని ఓ చెరువులో స్నానం చేసింది. ఆ తర్వాత పదో తేదీ నాటికి ఆమెకు జ్వరం, తలనొప్పి, వాంతులు పెరగడంతో, కుటుంబ సభ్యులు కొజికోడ్ మెడికల్ కాలేజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. చెరువులో ఉన్న కలుషితమైన నీటిలో జీవించే నాన్ పారాసిటిక్ అమీబా ఆ బాలిక ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్లి, మెదడుపై ప్రభావం చూపినట్టు వైద్యులు గుర్తించారు. వ్యాధి తీవ్రతను కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించకపోవడంతో చికిత్స అందించడంలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. బాలికను రక్షించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదని ప్రకటించారు. కాగా,



ఈ ఘటన బ్రెయిన్ ఈటింగ్ అమీబా ఉనికపై ఆందోళనకు కారణమైంది. పరాన్నజీవి కానటువంటి బ్యాక్టీరియా వర్గానికి చెందిన ఒక రకమైన అమీబాతో ఈ వ్యాధి వస్తుంది. కలుషితమైన నీటిలో జీవించే ఈ జీవి ముక్కు లేదా నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడును చేరుతుంది. క్రమక్రమంగా మెదడు పనిచేయకుండా చేస్తుంది. అందుకే దీనిని మెదడును తినేసే అమీబా (బ్రెయిన్ ఈటింగ్ అమీబా) గా పిలుస్తారు. ఈ వ్యాధి సోకినవారిలో తొలుత తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే వైద్యం అందించకపోతే బాధితులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. 2017లో, తిరిగి 2023లో ఈ కేసులు కేరళలో నమోదయ్యాయి. ఈ ఏడాది ఇదే తొలి కేసు.

# పట్టభద్రుల ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



**ప్రజాపక్షం /నల్లగొండ :** నల్లగొండ,వరంగల్,ఖమ్మం శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కు తెలియజేశారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, దాసరి హరిచందన తోపాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు,ఏ ఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలు, మరో 5 ఆక్సిలరి పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 5 లక్షల బ్యాలెట్ పేపర్లు రాష్ట్రస్థాయి నుండి రావడం జరిగిందని ,వాటన్నిటిని సంబంధిత జిల్లాలకు పంపించామని, పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సైతం సిద్ధంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని, వీరందరికీ మొదటి విడత శిక్షణ కార్యక్రమాలను సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నామని, 96 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ చందన దీప్తి ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, నల్లగొండ , మిర్యాలగూడ ఆర్డిఓలు, ఏఆర్ఓలు రవికుమార్, శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరు కాగా, రాష్ట్రస్థాయి నుండి ఆదనపు సీఈవోలు సర్ఫరాజ్ , లోకేష్ కుమార్, డిప్యూటీ సి ఈవో ఎల్ సత్యవాణి తదితరులు హాజరయ్యారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.7,500 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సచివాలయంలో ఆర్థిక శాఖ పేచిలో వినతి పత్రం అందచేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షల మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు మాత్రం పూర్తి ఫీజు చెల్లిస్తేనే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు అందచేస్తామని చెప్పడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తిచేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ఎన్‌సిడి, టీబీ వంటి అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం వైద్యాధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు అధికంగా జరిగేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగిని, సౌమ్యశ్రీ,శ్రీనివాస్,సిహెచ్‌వో త్రినాథ్, శ్యాంసుందర్‌రెడ్డి, జయమ్మ,సిబ్బంది పాల్గొన్నారు.

## టిఎస్ ఇసెట్ ఫలితాల్లో సాగర్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/నందికొండ :** టిఎస్ ఈసెట్ ఫలితాల్లో నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి సాయి గణేష్ ట్రిపుల్ ఈ లో 20వ ర్యాంకు సాధించాడని కళాశాల హెచ్ ఓ డి బోనం ప్రతాప్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ ఐలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో చక్కని అలవాట్లను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో కూడా పరీక్షలకు చక్కగా సన్నద్ధమయి కళాశాలకు మంచి ఫలితాలు తీసుకొచ్చి అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని అన్నారు.అదేవిధంగా ట్రిపుల్‌ఈ లో సాయి గణేష్ తో పాటు హేమంత్ అనే విద్యార్థికి సివిల్ లో 142 వచ్చినట్టు ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి టిజెఎస్ మద్దతు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 27న జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు టిజెఎస్ మద్దతు ఇస్తున్నట్లు టిజెఎస్ జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుతో సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ వీరేష్ నాయక్, నాయకులు బచ్చలకూర గోపి, బొమ్మగాని వినయ్ గౌడ్, మన్సూర్ నాయక్, యాకోబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 24 నుండి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం , మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పి చందన దీప్తి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల సమీపంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

## 3.60 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ నుండి పిఏపల్లి మండలంలోని వద్దిపట్లకు బుధవారం తెల్లవారుజామున ఆటోలో తరలిస్తున్న 3.60 క్వింటాళ్ల నల్ల బెల్లం, 80 కేజీల పట్టిక, ఐడి లిక్కర్‌కు ఉపయోగించే 80 కేజీల పట్టికను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. ఈ తనిఖీలో పోలీసు సిబ్బంది భాస్కర్, రాము, ఐడి పార్టీ హేమునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో శిథిలావస్థ భవనాలను గుర్తించాలి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** వర్షాకాలం సమీపిస్తున్నందున నల్లగొండ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటికి మరమ్మత్తులు చేయించుకోవాలని యాజమాన్యాలకు సూచించాలని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సూచించారు. బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, వార్డ్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వాడు ఆఫీసర్లు తమ తమ వార్డులలో భవనాలను గుర్తించి చిన్న చిన్న రిపేర్లు ఉన్నట్లయితే యాజమాన్యాలు రిపేర్లను చేయించుకునే విధంగా సూచనలు చేయాలని, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలను తొలగించియాలని సూచించారు. పట్టణ ప్రజలు కూడా శిథిలావస్థ భవనాలను గుర్తించి మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం వల్ల ప్రాణ ఆస్తి నష్టాన్ని నివారించవచని తెలిపారు.ఈ సమావేశంలో ఏసీబీ నాగిరెడ్డి, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకే దివ్యాంగ పట్టభద్రుల మద్దతు



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న 12 వేల వికలాంగ పట్టభద్రుల ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకేనని వికలాంగుల సంక్షేమ శాఖ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా వికలాంగ పట్టభద్రుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వికలాంగ పట్టభద్రులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గత పది ఏళ్లుగా బిఆర్ఎస్ పాలనలో వికలాంగుల ఉద్యోగాలతో పాటు ఎలాంటి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. 9 వికలాంగుల జాతీయ సంస్థలలో ఒక్క ఉద్యోగం కూడా గడిచిన 10 ఏళ్లలో భర్తీ చేయలేదని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో నల్లగొండ మార్కెట్ కమిటీ జూకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్సా రవి, విహెచ్పిపిఎస్ అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్, సి.హెచ్ మత్స్యగిరి, వి.ముత్తయ్య, డి. శంకర్, ఎం.నాగరాజు, మాధవరెడ్డి,మధు, డి.సైదులు, సైదిరెడ్డి,బుచ్చి రాములు ,ఎం. నగేష్ పాల్గొన్నారు.

## పాలక వర్గాలు లేక ప్రజల ఇబ్బందులు

అవి పంచాయితీలా... మున్సిపాలిటీలా...
త్రిశంకు స్వర్గంలో భద్రాచలం, సారపాక

**ప్రజాపక్షం/ఖమ్మం :** అవి గ్రామ పంచాయితీలో లేక మున్సిపాలిటీలో అర్థం కాని పరిస్థితి. సజావుగా పాలన సాగుతున్న వేళ ప్రభుత్వం గ్రామ పంచాయితీల స్థాయి నుంచి పట్టణాలుగా ఎదిగాయని మున్సిపాలిటీలుగా మార్చింది. కాదు కాదు మున్సిపాలిటీలుగా మార్చడం కంటే భద్రాచలాన్ని మూడు గ్రామ పంచాయితీలుగా విడగొడితే మంచిదని తదనుగుణంగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయితీలుగా వీడగొట్టింది. దానిపైన కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పంచాయితీల విభజన అడుగు ముందుకు పడలేదు. సారపాక ది అదే పరిస్థితి. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకను మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు ప్రకటించి గత పంచాయితీ ఎన్నికల సందర్భంగా జీవో విడుదల చేశారు. కాని ఇంత వరకు సారపాక పంచాయితీయో, మున్సిపాలిటీయో తేల్చలేదు. పారిశ్రామిక ప్రాంతమైన సారపాక, భద్రాచలం లు స్థానిక పాలక వర్గాలు లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఖమ్మం జిల్లా ఏజెన్సీకి పట్టుగొమ్మల్లా ఉన్న భద్రాచలం, సారపాక పట్టణాలను ప్రభుత్వ పెద్దలే తమ నిర్ణయాలతో ఇబ్బందులు పెడుతున్నారు. భద్రాచలం పట్టణం గ్రామ పంచాయితీగా ఉండేది. దానికి కాదని మున్సిపాలిటీగా మారుస్తున్నట్లు ప్రకటించి పంచాయితీ ఎన్నికలను నిలిపివేశారు. భద్రాచలాన్ని మున్సిపాలిటీగా మార్చడానికి ఏజెన్సీ చట్టాలతో పాటు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బ్రేక్ పడింది. ఆ తర్వాత మొత్తం భద్రాచలం పట్టణాన్ని మూడు గ్రామ పంచాయితీలుగా విడగొడుతున్నట్లు జీవోను విడుదల చేశారు. అది కూడా బాలారిష్టాలు దాట లేదు. ఇప్పుడు భద్రాచలం పట్టణానికి పాలక వర్గాలు లేక అధికారుల స్వయం నిర్ణయాలతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం పట్టణం మినహా మిగిలిన ప్రాంతమంతా ఆంధ్రాలో విలీనం కావడంతో ఇక్కడ మండల పరిషత్ ఏర్పాటు సాధ్యం కాలేదు. మండల పరిషత్ లేక, ఇటు స్థానిక పాలన లేక భద్రాచలం పట్టణంలో నివసిస్తున్న వారు సమస్యల పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతుండగా సారపాక గ్రామ పంచాయితీది అదే పరిస్థితి. బూర్గంపాడు మండలంలో మేజర్ గ్రామ పంచాయితీగా ఉన్న సారపాకలో సమీప గ్రామ పంచాయితీలతో కలిపి మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాల్వంచ, మణుగూరు మాదిరే సారపాక కూడా ఆ వరుసలో కలిసిపోయింది. మున్సిపాలిటీగా మార్చి ఎన్నికలు నిర్వహించలేక పోయారు. అటు పంచాయితీ కాకుండా ఇటు మున్సిపాలిటీ కాకుండా సారపాక త్రిశంకు స్వర్గంలో ఉంది. స్థానిక సమస్యలు ఏ అధికారికి చెప్పాలో అర్థం కాక పారిశ్రామిక పట్టణమైన సారపాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల్లో గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం భద్రాచలం, సారపాక పట్టణాల స్థానిక పాలన గురించి నిర్ణయం తీసుకుని పాలక వర్గాలు ఏర్పడేవిధంగా కృషి చేయాలని కోరుతున్నారు.

## ఆదరాభిమానాలను పంచిన నల్లగొండను మరువలేను

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం
ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా అభివృద్ధి పదంలో నడిపి పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డికి సిబ్బంది కళాశాలల యాజమాన్యాలు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో జరిగిన వీడ్కోల సమావేశంలో సిబ్బంది కళాశాలల యాజమాన్యాలు ఆచార్య గోపాల్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వారి సేవలను కొనియాడారు. అనంతరం గోపాల్ రెడ్డి దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండతో తన అనుభవాన్ని పంచుకున్నారు, పీజీ సెంటర్ అధ్యాపకుడిగా ప్రారంభించిన తన ప్రస్థానం అత్యున్నత అకాడమిక్ పదవైన ఉపకులపతి సైతం నల్లగొండతోనే ముడి పడటం యాదృచ్ఛికం అత్యంత అదృష్టంగా భావిస్తా అన్నారు. కర్మభూమి నల్లగొండ జిల్లా ఆదరణ ప్రేమాభిమానాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అన్ని సానుకూలతలు ఉన్నట్లు, సిబ్బంది కొరత అధిగమించి కొత్త కోర్సులను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోనే ఉన్నత విద్యలో అగ్రగామిగా నిలవచ్చునన్నారు. త న ప్రస్థానంలో జరిగిన నాక్ ర్యాంకు అక్రిడేషన్ , నూతన భవనాల ప్రారంభం, స్నాతకోత్సవం, అధ్యాపకుల కెరీర్ అడ్వాన్స్మెంట్ తదితర నిర్ణయాల్లో సిబ్బంది పాలకమండలి సభ్యుల చొరవ సహాయ సహకారాలు మరువలేని అన్నారు. రాబోవు రోజుల్లో ఉష మరియు రూస నిధులతో నూతన హాస్టల్స్ భవనాలు మరియు పరిపాలన భవనాలకు సైతం అనుమతులు పొందినట్లు తెలిపారు. వ్యవస్థ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ శ్రద్ధాశక్తులతో సంస్థ ఉన్నతికి తోడ్పడాలని సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వక అనుబంధం ఎన్నో గుణాత్మకమైన మార్పులకు బాట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈ మూడేళ్ల పదవి కాలంలో తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఓ ఎస్ డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, ఎంవి గోన రెడ్డి, కృష్ణారెడ్డి, కంట్రోలర్ డా జి ఉపేందర్ రెడ్డి, దోమల రమేష్, ప్రేమ్ సాగర్ మద్దిలేటి, అరుణప్రియ, సుధారాణి, మిరియాల రమేష్, డా వై ప్రశాంతి, ఆకుల రవి, సూర్యనారాయణ రెడ్డి, రేఖ, అన్నపూర్ణ, తదితర అధ్యాపకులు, విద్యార్థులు, నేషనల్ ఎలక్షన్ వాచ్ ప్రెసిడెంట్ డా బొమ్మరబోయిన కేశవులు పాల్గొన్నారు.

## ఫసల్‌బీమాపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. పంటల బీమాతో రైతులకు ఎంతో ధీమా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని కెడిసిసి బ్యాంకు సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, ఉద్యానవన అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా పంటల వివరాలను వ్యవసాయ అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు నష్టం జరిగినప్పుడు దీని ద్వార పరిహారం అందుతుందని పేర్కొన్నారు. రైతులు బీమా చెల్లించే అవసరం లేదని, ప్రీమియాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చెల్లిస్తాయని వివరించారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఫసల్‌బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని చెప్పారు. పంట దిగుబడి ఆధారంగా వాతావరణ పరిస్థితులకనుగుణంగా బీమా నిర్ణయిస్తారని తెలిపారు. దీంతో మన జిల్లాలో ఎక్కువగా సన్న కారు, చిన్న కారు రైతుల ఉన్నారని, క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు ఉన్నారని, క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు లాభపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జేడిఏ బాలు నాయక్ ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు మమతా, ప్రతిభ, భూంరెడ్డి ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపివోలు కొమురయ్య, పిబి శ్రీనివాస్ పూర్ణచంద్రావు, షబానా సుల్తానా, ఉద్యానశాఖాధికారులు బి.శ్రీనివాస్, జ్యోతి, ప్రతాప్ సింగ్, జగన్మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు బత్తుల శ్రీనివాస్, ఆదిరెడ్డి, భాస్కర్ , వాణి, ఏడిఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**కెడిసిసి బ్యాంకు సందర్శన**

కరీంనగర్‌లోని కెడిసిసి బ్యాంకును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. సీఈవో సత్యనారాయణ రావు బ్యాంకు అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. సీఈవో బ్యాంకు అధికారులతో మాట్లాడారు. కెడిసిసి బ్యాంకు , పిఏసిఎస్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా మారిందని, దీంతో అనేక అవార్డులు వచ్చాయని సీఈవో జిల్లా కలెక్టర్‌కు వివరించారు. చొప్పదండి పిఏసిఎస్ దేశంలోనే అత్యుత్తమంగా నిలిచిందని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లు ప్రభాకర్ రెడ్డి, ఉషశ్రీ, పిఏసిఎస్ దెవలప్‌మెంట్ సెంటర్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, డీజీఎం, ఏజిఎంలు పాల్గొన్నారు.

## దేవాలయాలను ప్రభుత్వపరంగా అభివృద్ధి చేస్తాం



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/పెగడపల్లి :** దేవాలయాలను ప్రభుత్వపరంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, నంచర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న బీరయ్య స్వామి వారి పట్నాల మహోత్సవంలో భాగంగా బుధవారం నిర్వహించిన బీరయ్య స్వామి వారి కళ్యాణోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటపాటలతో బీరయ్య స్వామి కళ్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చాట్ల విజయభాస్కర్, ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, మద్దులపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సురకంటి సత్తిరెడ్డి, బోడపట్ల బీరయ్య, అరికట్ల సంజీవ్, వెల్మ బలరాం రెడ్డి, కడారి తిరుపతి, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, పూసాల తిరుపతి, చెట్ల కిషన్, కుంచె రాజేందర్, పవన్ రెడ్డి, కార్యకర్తలు తదితరులున్నారు.

## రోడ్డు లేక ప్రయాణికుల అవస్థలు

**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం తేల్దేవరపల్లి, కంబాలపల్లి, పొగిళ్ల వెళ్లే రహదారి కొన్ని నెలల క్రితం కొత్త రోడ్డు వేసేందుకు పాత రోడ్డును మొత్తం తవ్వి మట్టి కంకరతో కొత్త రోడ్డుపై పరిచారు. పనులు జరిగి నెల గడుస్తున్నా కొత్త రోడ్డు వెయ్యకుండా కాంట్రాక్టర్ మరిచారని ప్రతి రోజు రహదారిపై వందలాది వాహనాలు ప్రయాణిస్తున్న తరుణంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయేది వర్షాకాలం కావడంతో రోడ్డు మొత్తం బురద మయం అన్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతమైన తండాలకు ప్రతి రోజు రాత్రి పగలు తేడా లేకుండా ప్రజలు ప్రయాణిస్తారని రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రజలకు ఆపద వస్తే ఎటువెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు తండాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రోడ్డు పూర్తి చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

## కామ్రేడ్ నర్సమ్మ మృతి సిపిఐకు తీరని లోటు



**ప్రజాపక్షం/నూతనకల్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ పేరం లచ్చయ్య సతీమణి పేరం నర్సమ్మ (90) మంగళవారం రాత్రి మృతి చెందారు. మండల కేంద్రంలో ఆమె పార్థివదేహంపై రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మురగుండ్ల లక్ష్మయ్య, మండల కార్యదర్శి తోట ప్రభాకర్‌లు అరుణ పతాకం కప్పి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పోన్నం శేషయ్య, వెంకయ్య, సమ్మెటలాలు, సత్తయ్య, వీకస్వామి, చంద్రయ్య, కొమరయ్యలతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో నర్సమ్మ ఎంతో సహకరించేవారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కౌన్సిలర్ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, మండల నాయకులు మద్దెల రాంమూర్తి, పొన్నం ఎల్లయ్య, అబ్బయ్య, వెంకన్న, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## నేడు బుద్ధవనంలో బుద్ధపూర్ణిమ ఉత్సవాలు

**ప్రజాపక్షం/నందికొండ :** నేడు బుద్ధవనంలో జరిగే బుద్ధ పూర్ణిమ ఉత్సవాలకు బుద్ధవనం అందంగా ముస్తాబయింది. రంగురంగుల విద్యుత్తు దీపాలతో బుద్ధవనాన్ని అలంకరించారు. ఈ ఉత్సవాలను తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నాగార్జునసాగర్ లోని బుద్ధ వనంలో జరిగే బుద్ధ పూర్ణిమ ఉత్సవాలు ప్రతీ సంవత్సరం ఎంతో వైభవోపేతంగా జరుగుతాయి.ఈ వైశాఖ పూర్ణిమ బౌద్ధులకు పెద్ద పండుగ. విశ్వ గురు, శాంతిదూత బౌద్ధ మత స్థాపకులు బుద్ధుడి జన్మదినం సందర్భంగా బుద్ధ పూర్ణిమ ఉత్సవాలను నిర్వహిస్తారు .బౌద్ధులు బుద్ధుడు చూపిన శాంతి మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని అయన చూపిన శాంతి మార్గంలో నడుచుకుంటూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.ఈ వైశాఖమాస పూర్ణిమనే బుద్ధ పూర్ణిమ అంటారు అదే బౌద్ధ మతాన్ని నెలకొల్పిన బుద్ధ భగవానుడి పుట్టినరోజు బౌద్ధమత సిద్ధాంతం ప్రకారం దేనిని ఇష్టంగా కానీ అయిష్టంగా తీసుకోకూడదు కనుక బౌద్ధులు ఈ బుద్ధ పూర్ణిమ ఉత్సవాలు చాలా శాంతంగా వేడుక చేసుకుంటారు. అయితే ఈ బుద్ధ పూర్ణి మ సందర్భంగా నేడు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా బుద్ధవనాన్ని సందర్శించవచ్చు.

## రైతులకు ఉచిత పంటభీమా పథకం అమలు

**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా ఈ వానా కాలం పంట నుండే రైతులకు ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి అన్నారు. ఉచిత పంట బీమా పథకం పై నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తి, టమాట, కందులు పంటలకు యాసంగిలో వరి, వేరుశనగ పంటలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఉచిత పంట బీమా పథకం వర్తిస్తుంది అన్నారు. దీని కోసం రైతులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తాము వేసిన పంటలు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకున్న పంటకు మాత్రమే ఇది వర్తిస్తుంది. రైతు ఒక పంట పండించి మరో పంట నమోదు చేసుకుంటే ఇది వర్తించదు. దురదృష్టవశాత్తు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినా, అడవి జంతువుల వల్ల పంట నష్టం జరిగినా ఈ బీమా వర్తిస్తుంది అన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ బాబు, నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ట్రైనర్ సుమన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/ఆత్మకూరు : హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని పెంచికల్ పేట పరిధిలో గల నీరుకుల్లలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ సొసైటి సిబ్బందిని వరి కోతలు ఆలస్యం ఎందుకు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే మాయిచ్చర్ చూసిరైస్ మిల్లులకు పంపించాలని సూచించారు.ఈ తనిఖీలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పనులు పూర్తి చేయండి



ప్రజాపక్షం/సంగెం: పాఠశాలలు పునర్ ప్రారంభయ్యే లోపు పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉండాలని వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి డి. వాసంతి అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లి ఎంపీయూపీఎస్, వీఆర్ఎన్‌తండా, వీఎన్‌తండా, ఎంపీపీఎస్ రంగంపేట, ఎంపీపీఎస్ తిమ్మాపురం పాఠశాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను డీఈఓ వాసంతి పరిశీలించారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్న మౌళిక వసతులు, మరమ్మతులను వేగవంతంగా పూర్తిచేసి విద్యా సంవత్సరానికి ముందే పాఠశాలను సిద్ధం చేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ రాజ్ డీఈ జ్ఞానేశ్వర్, పీఆర్ ఏఈ రమేశ్, ఎంఎన్ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు స్పందన



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : గీసుగొండ 16వ డివిజన్ ధర్మారంలోని ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఆపోలో ఫార్మసి జాబ్ మేళాకుకు హాజరైన నిరుద్యోగ యువతి, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపిక అయిన వారికి కళాశాల దూరవిద్యా కేంద్రం కో ఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్, ఆపోలో ఫార్మసి హెచ్ ఆర్ రఘుపతి నియామక పత్రాలు అందజేశారు. అధ్యాపకులు ప్రణయ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సప్లమెంటరీ పరీక్షలు విద్యార్థులకు వరం



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులకు వరం లాంటివని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజనేయరాజు అన్నారు. బుదవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24 నుండి ఇంటర్మీడియల్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం అవుతాయన్రానారు. జిల్లాలో మొదటి సంవత్సరం 2వేల 384 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా అందులో జనరల్ విద్యార్థులు 1879 మంది, ఒకేషనరల్ విద్యార్థులు 505 మంది, ఉన్నట్లు తెలిపారు. వీరికి ఉదయం 9 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందనానరు. రెండవ సంవత్సరం విద్యార్థులు 1606 మంది పరీక్షలు వ్రాయనుండగా 376 మంది వృత్తి విద్యాకోర్సులకు వారు ఉన్నారన్నారు. జిల్లాలో పరీక్షల కోసం 11 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుండి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



ప్రజాపక్షం/గోవిందరావుపేటః గోవిందరావుపేట మండల పరిధిలో ఉన్న అన్ని విత్తన, పురుగు మందుల వ్యాపారులతో బుధవారం పస్రా పోలీస్‌స్టేషన్ నందు సమావేశాన్ని ఎస్ఐ ఎ కమలాకర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సిఐ శంకర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని గోవిందరావుపేట మండలంలోని అన్ని విత్తన, పురుగు మందుల వ్యాపారులకు తగు సూచనలు ఇస్తూ ఖరీఫ్‌లో రైతులు అధిక మొత్తంలో సాగు చేయడంను దృష్టిలో ఉంచుకొని విత్తన వ్యాపారులు మేలైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, అమ్మిన ప్రతి ప్యాకెట్‌కు సరిపడ బిల్లులు ఉండాలని చెప్పారు. తప్పకుండా తమ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ మెయింటెన్స్ చేయాలని, నాసిరకం విత్తనాలను, గడువు తీరిన మందులను రైతులకు అమ్మితే ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన కంపెనీలు అమ్మే విత్తనాలను మాత్రమే మార్కెట్‌లోకి తేవాలన్నారు.

## కాళేశ్వరంలో కొనసాగుతున్న కేంద్ర అధికారుల బృందం శిక్షణ



ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కొనసాగుతున్న కేంద్ర సర్వీస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు శిక్షణ అధికారుల బృందం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రూరల్ వాటర్ సప్లై స్కీం లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర శిక్షణ అధికారుల బృందం, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యం

ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యమైన సంఘటన బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని రాయరావు చెరువు వెనకాల అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నర్సాపూర్ రాయరావు చెరువు వెనకాల రెండు మృతదేహాలు ఉన్నాయని, అటువైపు వెళ్లిన కొందరు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గుర్తు తెలియని మహిళ, పురుషుడి మృతదేహాలను గుర్తించామని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి మృతదేహాలను తగలబెట్టి నర్సాపూర్‌కు తెచ్చి పారవేసి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరివయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందంటున్నారు. సుమారు ఐదు రోజుల క్రితం పారవేసి వెళ్లినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# తేమ, తరుగులతో మోసం చేయొద్దు

ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాపక్షం/చిట్యాల: రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యములో తేమ, తరుగు పేరుతో రైతులను మోసం చేయొద్దని అలాగే రైతులు కూడ దాన్యములో తేమ పరిమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం చిట్యాల మండలంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేస్ మిశ్రా కైలాపూర్ గ్రామంలోని లక్ష్మీ నరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ పారా బాయిల్డ్ రైస్ మిల్లు, పాశిగడ్డతండా, లక్ష్మీపురం తండాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మత్తు పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పారాబైల్డ్ రైస్ మిల్ కు చిట్యాల, మొగుళ్ళపల్లి, టేగుళ్ళపల్లి, రేగొండ మండలాల్లోని 26 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఓపిఎంఎస్ ద్వారా కేటాయింపులు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ మిల్లుకు రవాణా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం తేమశాతాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి రోజు మిల్లులో 58 టన్నుల బియ్యం వస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం సిఎంఆర్ ఇంకా 200 మెట్రిక్ టన్నులు పూర్తి కావాల్సి ఉందని, త్వరగా పూర్తి చేయాలని మిల్లు యాజమాన్యానికి ఆదేశించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి దాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత, తేమ శాతం పాటించాలని 17 శాతం కంటే అధికంగా తేమ శాతం ఉంటే బియ్యం తక్కువ వస్తాయని తక్కువ ధరకు దాన్యం విక్రమించొద్దని సూచించారు. రైతులందరికి రైతుబంధు నిధులు వచ్చాయ అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ వర్షాకాలపు పంట నుండి రైతు భీమా ద్వారా పంట నష్టం వాటిల్లితే ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా 2.50 లక్షలతో పాశిగడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను, లక్ష్మీపురం తండాలో 2.25 లక్షల రూపాయలతో చేపట్టిన మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ మొత్తం పరిశీలించిన ఆయన పాఠశాల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటాలని సూచించారు. ఎత్తు పల్లాలు లేకుండా పాఠశాల అవరణను ఉపాధి హామీ పథకం పనులు చేపట్టి మట్టితో నింపాలని అన్నారు. విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి వీలుగా వాషింగ్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. పనులు వేగంగా జరగాలని పాఠశాల పునః ప్రారంభం నాటికి అన్ని పనులను పూర్తి చేసి పాఠశాలలను ఆహ్లాదకరంగా తయారు చేయాలనిపేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీలత, ఎంపీఓ రామకృష్ణ, పిఆర్ డిఈ వెంకటేశ్వర్లు, విఓ అధ్యక్షురాలు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఎంలో తనిఖీలు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి: మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం విద్యుత్ అంతరాయం కావడంపై జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఎంజిఎం ఆసుపత్రిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని జనరేటర్లు, అనుసంధానంలో ఉన్న వార్డులను పరిశీలించారు. విద్యుత్ అంతరాయంకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం జరిగిన సమయంలో ఎలాంటి వైద్య చికిత్సలను ఆపడం జరగలేదని కలెక్టర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6:15గంటలకు ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడగా ఎన్‌పిడిసిఎల్ అధికారులను సంప్రదించగా తక్షణమే వారు స్పందించి విద్యుత్ జంపర్లు సరిచేసి ఆదే రోజు రాత్రి 8:45 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. డయాలసిస్ విభాగానికితప్ప ఎమర్జెన్సీ వార్డులతో సహా అన్ని వార్డులకువిద్యుత్‌సరఫరా చేయడం జరిగిందని, డయాలసిస్ వార్డులో రిపేరులో ఉన్న జనరేటర్‌కు మరమ్మత్తులు చేశామని కలెక్టరుకు సూపరింటెండెంట్ వివరించారు. భవిష్యత్తు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన నిపుణుల కమిటీ



కుంగిన పిల్లర్ల పరిశీలన

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/ మహాదేవపూర్ : మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మత్తుల చేసే పనిలో దృష్టి సాధించిన నేపథ్యంలో బుధవారం పూణే నుంచి వచ్చిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంట్రల్ సీడబ్ల్యూ పీఆర్ఎస్ కు చెందిన నిపుణులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకొని కుంగిన తీరును రాబోయే వర్షాకాలంలో రైతులకు మరమ్మత్తులు చేసే సాగు నీరు అందించే విధంగా మేడిగడ్డ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పియర్స్ నిపుణుల బృందం పరిశీలించారు. జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ కోసం సైంటిస్ట్ జెఎస్ఎడ్లబద్కర్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ కోసం సైంటిస్ట్ సీ డాక్టర్ ధనుంజయ నాయుడు, నాన్ డిస్ట్రక్టివ్ టెస్ట్ కోసం సైంటిస్ట్ సీ డాక్టర్ ప్రకాశ్ పాలే లు ఏడవ బ్లాక్‌లోని 19,20,31 కుంగిన పియర్స్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గేట్లను మరమ్మత్తు చేసి ఎత్తివేయడానికి ఏర్పా ట్లు గురించి ఇరిగేషన్ అధికారులతో పూర్తి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. నేడు జల సౌధ లో ఇరిగేషన్ సెక్రటరీ, ఈఎన్ సీలు అధికారులతో సమావేశం కానున్నట్లు నిపుణుల బృందం తెలిపారు.



## ఎమ్మెల్సీ ఎన్నికకు 16 పోలింగ్ కేంద్రాలు

జయశంకర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణలో భాగంగా కోసం ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాన్ని ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శాసనమండలి పోలింగ్ ప్రక్రియపై బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి కార్యాలయం నుండి పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 12535 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగానికి 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 19 మంది పిఓలు 19 మంది ఏపిఓలు, 38 మంది ఓపిఓలు, 16 మంది మైక్రో అబ్జర్వర్స్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ నెల 26న ఎన్నికల మెటీరియల్ పంపిణీ, 27న రిసెప్షన్ సెంటర్ ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పకడ్బందీగా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేయాలని, అలాగే 27న స్వీకరించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా పరిశీలన చేయాలని సంబందిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 26వ తేదీన మెటీరియల్ తీసుకున్న సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుని పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ శ్రీనివాస్,మత్స్య శాఖ అధికారి అవినాష్, డిపిఓ నారాయణ రావు, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై ఆరా

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రాలలో రైతులకు టార్పాలిన్‌లు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు ఉన్నాయా, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా అనే అంశాలను స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఏ ఒక్క రైతు కూడా అధైర్యపడద్దని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ప్రతి కేం ద్రంలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉండాలని ధాన్యం కొనుగోలు నిర్వాహకులకు సూచించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఆ దిశగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సివిల్ సప్లయి మేనేజర్ బి రాంపతి, డిసిఓ సర్దార్‌సింగ్, గోవిందరావుపేట తహసీల్దారు సృజన్‌కుమార్, ఎంపిడిఓ, ఉన్నారు.



ములుగు ప్రతినిధిః రైతుల నుండి ఎలాంటి తరుగు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం వెంకటాపూర్ మండలం లింగాపూర్ సమీపంలోని ఆదిత్య ఆగ్రో ఇండస్ట్రీ ధాన్యం మిల్లును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని ధాన్యం దిగుమతులు ఎగుమతులు సంబంధించిన రికార్డ్స్ పరిశీలించి మిల్లింగ్ ప్రక్రియ జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తరుగు విధించకుండా, డబ్బులు చెల్లించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రైతులెవ్వరూ అధైర్యపడొద్దు

ప్రజాపక్షం/శివ్వంపేట : అకాల వర్షాలకు తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరు అధైర్యపడవద్దని మండల తహశీల్దార్ శ్రీనివాస్‌చారీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతినిత్యం దాన్యం తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. వడ్లు తడిసియాని రైతులు దిగులు పడొద్దని, తడిసిన దాన్యాన్ని కూడా మద్దతు ధర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. మండలంలోని పాంబండ, బిజిలీపూర్ గ్రామాలలో వందశాతం వడ్లు కొనుగోలు చేశామని, మిగతా గ్రామాలలో కూడా త్వరితగతిన కొనుగోలు పూర్తి చేస్తామని ఆయన అన్నారు. వర్షాభావ సూచనలు ఉన్నప్పుడు రైతులు కొంచెం జాగ్రత్త పాటించాలని సూచించారు. వడ్లు కొనుగోలు గురించి ఇలాంటి అపోహాలు గానీ, దిగులు గానీ చెందొద్దని రైతులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

## ఘనంగా జీవవైవిద్య దినోత్సవం



సుజాత పాఠశాల విద్యార్థులకు బహుమతులు

ప్రజాపక్షం/హసన్‌పర్తి: ఈనెల 22న ప్రణాళికలో భాగస్వాములు అవుదాం పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించి ఆర్ట్ కాంపిటీషన్‌లో హసన్‌పర్తిలోని సుజాత విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు లక్ష్మీ చందన ప్రథమ బహుమతి, హరిచందన మూడో బహుమతి సాధించారు. కాగా హన్మకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాగణంలో వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ స్టేషన్ దూషర్ల సత్యనారాయణ పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహుమతులు అందుకున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. శాంతారాం కర్ణ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా నిర్వహిస్తున్న పర్యావరణహిత కార్యక్రమంలో అనేక అవార్డులు సాధించడం జరిగిందని అందులో భాగంగా ఈ అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం సందర్భంగా మరొకరసారి ఈ అవార్డులు సాధించడం చాలా సంతోషంగా ఉందని ఇక ముందు కూడా పాఠశాలలో గ్రీన్ బ్రిగేడియర్‌ను ఏర్పాటుచేసి పర్యావరణ హిత పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : ప్రావీణ్య



ప్రజాపక్షం/వరంగల్‌ప్రతినిధి : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రావీణ్య అన్నారు. శాసనమండలి పోలింగ్ ప్రక్రియపై బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగానికి 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 26న ఎన్నికల మెటీరియల్ పంపిణీ, 27న రిసెప్షన్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మెటీరియల్ పంపిణీ, స్వీకరణకు నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పక్కాగా, పకడ్బంధీగా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేయాలని, అలాగే 27న స్వీకరించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా.. లేదా పరిశీలన చేయాలని సంబంధిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 26న మెటీరియల్ తీసుకున్న సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకొని పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి రవిందర్, ట్రైని ఐపిఎస్ శుభం, కలెక్టరేట్ పర్యవేక్షకులు రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆధ్యాత్మిక జీవితానికి ఆలయాలు అవసరం’



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:ఆధ్యాత్మిక జీవితంలో ప్రజలందరూ సుఖ శాంతులతో తులతూగాలంటే ఆలయాలు అవసరం అని ఉమ్మడి మద్దూరు మండల జడ్పిటీసీ గిరి కొండల్ రెడ్డి, జనగామ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులుచెట్కూరికమలాకర్ అన్నారు. ధూల్మిట్ట మండలకేంద్రంలో గౌడ సంఘం ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ పండుగలో పూజలు నిర్వహించారు.ఎల్లమ్మ గుడికి 10వేల రూపాయలను చందాను జనగామ నియోజకవర్గం కాం గ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్, గౌడ సంఘం ప్రతినిధులకు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామం, మండలం సుభిక్షంగా ఉండాలని, ప్రతిఒక్క ఇంటిల్లి పాదిని చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరిని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ రేణు కా ఎల్లమ్మ తల్లిని కోరుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెప్యాల అనిల్, గునుకుల జగన్‌మోహన్ రెడ్డి, రేణుకా ఎల్లమ్మ గౌడ ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాచగోని గణేష్, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి కనుకయ్య, కోశాధికారి నాచగోని కిష్టయ్య, నాయిబ్రాహ్మణ ధూల్మిట్ట మండల అధ్యక్షులు కొండూరి అరవిండ్, నాయకులు నారోజు బ్రహ్మచారి, వివిధ కులసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః రెవెన్యూ పౌర సరఫరా శాఖల అధికారులు ,డిఆర్‌డిఓ అధికారులతో మంగళవారం సాయంత్రం టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దరఖాస్తుల పరిశీలనపై రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ధరణి పోర్టల్ పెండింగ్లో ఉన్న దరఖాస్తులను గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే పీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా పైల్స్ రూపంలో కూడా నిర్వమించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టుల ను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తి స్థాయిలోకలెక్టరేట్‌కుసమర్పించాలన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని,వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

**వేగంగా ధాన్యం సేకరణ**

కొనుగోలు కేంద్రాల్లో దాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ రోజు అందోల్ డివిజన్లలోని మాన్‌సాన్ పల్లి ,కంసాని పల్లి, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు పరిశీలించడం జరగిందని కొన్ని సెంటర్‌లలో మాయిశ్చర్ వచ్చినా కూడా ఎందుకు తూకం వేయడం లేదని ప్రశ్నించారు. మాయిశ్చర్ వచ్చిన దాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అందోల్ మండలం అన్నారం జిన్నారం ఐకెపి పుల్కకల్ కల్టెర్ పిఏసిఎస్‌డి.సిఎంఎస్‌లలో పెండింగ్ ఉన్న ధాన్యం సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః జూన్ 4న జరుగు ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అదికారులను ఆదేశించారు. బుదవారం స్థానిక పిఎస్ ఆర్ గార్డెన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లకు సహాయకులకు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నా ఓట్ల లెక్కింపు ఎలా చేయాలనే అంశంపై మాస్టర్ ట్రైనర్ ద్వారా శిక్షణా ఏర్పాటు చేశారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో పాటు స్థానిక అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోన ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా జూన్ 4న జరుగు ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధమైనాయని తెలిపారు. కౌటింగ్ సూపర్ వైజర్లు 153,సహాయకులు , 173 మంది సిబ్బంది మొత్తంగా 326 మందికి బుదవారం శిక్షణా కార్యక్రమము నిర్వహించడం జరిగిందని తెలిపారు. మొత్తం 14 ఉంటాయని అందుకనుగుణంగా రెండవ శిక్షణా కార్యక్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సిబ్బందిని కేటాయించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఆర్‌డిఓలు ,రాజు, పాండు, అశోక్ చక్రవర్తి, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్గా, సంగారెడ్డి,కామారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల సందడి

ఊహాలోకంలో ఆశావహులు

ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం




**ప్రజాపక్షం/ముత్తారం :** మొన్నటి వరకు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల హడావిడిలో మునిగితేలిన నాయకులకు, ఇక పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. జనవరి 31తో సర్పంచుల పదవీకాలం ముగిసిపోగా.. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే పల్లెలు కాలం వెల్లదీస్తున్నాయి. జూన్, జూలైలోనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని వార్తలు గుప్పుమనడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించిందన్న వార్తలు గ్రామాల్లో కోడై కూస్తున్నాయి. ఐదు నెలల క్రితమే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను టీ పోల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటివరకు గ్రామ పంచాయతీల వారీగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారిగా విభజించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల్లో సర్పంచ్ కావాలనే ఆశతో ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో బిజీ బిజీగా ఉన్న నాయకులు ఇక నుంచి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కాక తప్పడంలేదు. ఎన్నికల సమయం రోజు రోజుకూ దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లో ఎక్కువశాతం బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొందరు బిఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకుంటున్నారు. ఏమవ్వా బాగున్నావా? ఏం తాత బాగున్నావా? అంటూ ఆప్యాయతతో పలకరింపులు మొదలయ్యాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఓటుకు రూ.1నుంచి 3వేలు కూడా ఖర్చు చేయడానికి నేతలు తగిన వనరులను సమకూర్చుకుంటున్నారు. అన్ని ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు సర్పంచ్ పదవికి నేనంటే నేనే పోటీలో ఉంటానంటూ ఎవరి క్యాడర్ వాళ్లే చూసుకుంటూ ప్రచారాలు మొదలుపెట్టారు.

## సింగరేణి గనుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుచండి

వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి వ్యాప్తంగా అన్నిగనులలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌కె–5 గని వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి సీతారామయ్య హాజరై మాట్లాడారు. సింగరేణిలో ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో యువ కార్మికులే ఉన్నారని, ఉన్నత చదువులు అభ్యసించి సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి రెస్ట్ హాల్స్, సైకిల్ షెడ్లు, భోజనశాల ఏర్పాటుతో పాటు నాణ్యమైన పనిముట్లు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సిఎంపిఎఫ్ లోన్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, కాలం చెల్లిన ఎస్‌డిఎల్ యంత్రాల స్థానంలో నూతన యంత్రాలను తీసుకురావాలని, ఎస్‌డిఎల్ యంత్రాలలో నాసిరకం ఆయిల్ వాడడం వల్ల యంత్రాలు చెడిపోతున్నాయని, నాణ్యమైన ఆయిల్స్ వాడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు గుణిగంటి నర్సింగరావు, మురళి చౌదరి, సంఘం సదానందం, రామచందర్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, లక్కిరెడ్డి, సత్తిరెడ్డి, విజయ్, విశ్వనాథ రెడ్డి, భోగ మధునయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ, దేశ సమైక్యత, మతసామరస్యం కమ్యూనిస్టుల లక్ష్యం

సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** రాజ్యాంగ పరిరక్షణ, దేశ సమైక్యత, మత సామరస్యం కమ్యూనిస్టుల లక్ష్యమని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం జనగామలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జువారి రమేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మత రాజకీయాలను రెచ్చగొడుతూ దేశ సంపద, కార్మిక రైతుల సొత్తును తన అనుకూలమైన వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. పెట్టిబడిదారులు శాసించే విధంగా రాజకీయాలను వ్యాపారంగా మార్చి నోట్లు ఇచ్చి ఓట్లు కొని చట్టసభల్లో పేదవాడికి స్థానం దక్కె అవకాశం లేకుండా రాజ్యాధికారం అందకుండా చేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిపిఐ నాయకత్వానికి, కార్యకర్తలకు ప్రజలకు ఉపయోగపడే స్పష్టమైన రాజకీయాల అవగాహన కల్పించడానికి దేశ సంపద ప్రజలందరి బాగుకోసం ఉపయోగపడే విధంగా కమ్యూనిస్టు కార్యకర్తలను చైతన్యం పరచడం కోసం ఈనెల 30,31 తేదీల్లో జఫర్‌గడ్ మండల కేంద్రంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిందన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొని నేటి రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు వ్యూహాలపై అవగాహన పొందాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్, కావటి యాదగిరి, రావుల సదానందం పాల్గొన్నారు.

## ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌టిసి విశ్రాంత కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నికను జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్‌టిసి రీజనల్ గౌరవ అధ్యక్షుడిగా కలవేన శంకర్, అధ్యక్షుడిగా గుండె చంద్ర మాణిక్యం, కార్యదర్శిగా కెఎంఎస్ రెడ్డి, కోశాధికారిగా ఎబి ముభారక్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికుల సమస్యలు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, వారికి రావలసిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలన్నారు. చాలీచాలని పెన్షన్‌లతో బతుకు వెల్లదీస్తున్న ఆర్‌టిసి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్‌తో పాటు ఆర్‌టిసి రాష్ట్ర కమిటీ నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ

ధనుంజయనాయుడు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నప్పటికి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే చోట ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లు , ఫస్ట్ ఎయిడ్ బాక్సు అందు బాటులో ఉంచాలన్నారు. కూలీలకు తట్ట, గడ్డపార వంటి పనిముట్లను ప్రభుత్వమే మంజూరు చేయాలన్నారు. పనిచేచోట రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి జాబ్ కార్డుదారుడికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు అయ్యేలా చూడాలన్నారు. చాలామంది కూలీలకు జాబ్‌కార్డు లేక పనిచేసిన డబ్బులు రావడలం లేదని నూతన జాబ్‌కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూలీల శ్రమ దోపిడీ చేస్తుందని ఆయన ఆరోపించారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు జక్కుల రమేష్, మామిడి నరసయ్య, కొట్టు బాబు, ఊదర వెంకన్న,రామయ్య,కోటయ్య, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిగింజనూ ప్రభుత్వమే కొంటుంది

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క రైతులకు భరోసా ఇచ్చారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఐకేపీ సెంటర్ల పెంచి సులువుగా రైతులు అమ్ముకునేలా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో మంత్రి సీతక్క పర్యటించారు. ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోళ్లు జరగినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నట్టు తెలిపారు. గతంలో మాదిరి తరుగు, తాలు పేరుతో కోతలు లేవన్నారు. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ ఉండేదని, ఈ దఫా మిల్లర్ల దోపిడీపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందన్నారు. దీంతో ప్రతి కింటాపై రైతుకు 150 నుంచి 200 రూపాయల వరకు అదనపు లబ్ధి చేకూరేలా పకడ్బందీగా ప్రభుత్వం పని చేస్తుంది. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వేస్తున్నామన్నారు. గతంలో 45 రోజులు పట్టేదన్నారు. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుందని, దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవని, వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదని దీంతో రైతు ఆత్మగౌరవంతో బతుకుతున్నాడన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ఫాసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేది. అయినప్పటికీ కాంగ్రెస్ రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందన్నరు. తడిచిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. గతంలో కల్లాల్లో వరికుప్పల మీద రైతులు గుండె పగిలి చనిపోయారన్నారు. మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారన్నారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయిందని, గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతో దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవాదరని, అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియ్యాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందనని, మనం దొడ్డు వడ్లు అమ్ముకొనుడెంది. సన్న వడ్లు కొనుక్కునుడేంది. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుంది కాబట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టామన్నారు. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తామన్నారు. దొడ్డు వడ్లకు 500 రూపాయలు ఇప్పుడు ఇవ్వలేకపోయినా...మూడు నుంచి ఐదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడుతూ, ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందన్నారు. రైతులను కాల్చుకుతిన్న బిఆర్‌ఎస్ అగ్ర నాయకులు, ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కెసిఆర్ ప్రకటించారు. ఆ తర్వాత మూడేళ్ల అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదని, అందుకే కెసిఆర్‌ను ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ఎక్కడ దుబారా చేయకుండా, కెసిఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభించామని, అన్ని హామీలను పూర్తి చేసి తీరుతామన్నారు. త్వరలో అన్ని హామీలను అమలు చేసి మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపిస్తామని మంత్రి సీతక్క అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో పాటు కాంగ్రెస్ బ్లాక్, మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్ ఆర్‌టిసి పేరు టిజిఎస్ ఆర్‌టిసిగా మార్పు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిఎస్ ఆర్‌టిసిని త్వరలోనే టిజిఎస్ ఆర్‌టిసి గా మార్చనున్నారు. ఇప్పటి వరకు టిఎస్ ఆర్‌టిసిగా కొనసాగిన విషయం తెల్సిందే. ప్రస్తుతం టిజిఎస్ ఆర్‌టిసిగా ప్రభుత్వం మార్చింది. ఇటీవల ప్రభుత్వం టిఎస్ స్థానంలో టిజిగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం టిఎస్ ఆర్‌టిసిగా పేరు మార్చింది. అయితే ఉద్యమం సమయంలో టిజిని తెలంగాణ వాదులు, ప్రజలు ఉపయోగించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చాక టిఎస్‌ను టిజిగా మార్చుతామని ప్రకటించింది. రాష్ట్రంలో టిజి అమలుకు కేంద్రం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. అన్ని ప్రభుత్వ సంస్థల్లో పేర్లలో టిఎస్‌కు బదులుగా టిజిని ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, లెటర్ హెడ్‌లపై టిఎస్‌కి బదులు టిజిగా పేర్కొనాలని ఆదేశించింది. మొదటగా మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి టిఎస్ తొలగించి టిజిగా మార్చింది. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మార్పులు చేయగా, తాజాగా ఆర్‌టిసి కూడా టిజిఎస్ ఆర్‌టిసిగా మార్పులు చేసింది. సంస్థ ఎం.డి. సజ్జనార్ ట్విట్టర్‌లో స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టిఎస్‌ఆర్‌టిసి పేరును టిజిఎస్ ఆర్‌టిసిగా మార్చడం జరిగిందని, ఈ మేరకు అధికారిక ఎక్స్ ఖాతాలు @tgsrtcmdoffice, @tgsrtchq గా మార్చినట్లు వెల్లడించారు. విలువైన సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులను మార్చిన ఈ ఖాతాల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## రైతులు అధైర్య పడొద్దు

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రైతులు అధైర్య పడొద్దని, తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు ముందస్తుగానే కురిసే అవకాశం ఉన్నందున సత్వరమే కోతల ప్రారంభించి ధాన్యం విక్రయాలు చేయాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్ చేసి కేటాయించిన మిల్లులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 35 శాతం ధాన్యం కొనుగోలు చేశామని జూన్ 15 నాటికి మొత్తం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రైతులు ఏదేని సమస్య ఉన్నా నేరుగా తనకు కానీ, అదనపు కలెక్టర్‌కు కానీ ఫోన్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, డిఎం రాఘవేందర్, జిల్లా సహకార అధికారి శైలజ, పిఎసిఎస్ చైర్మన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల కట్టడికి జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పోరేషన్, పోలీస్ బలగాలతో 21 జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసిన, దుకాణాల్లో ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినా తీవ్రమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలలో గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా ఉంటుందన్నారు. తరచూ కేసులు నమోదైతే పిడి యాక్ట్ అమలు చేస్తామన్నారు. ప్రధానంగా గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు. ఎవరైనా ప్రముఖ బ్రాండ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటకట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. నకిలీ విత్తనాల సమస్యలను నియంత్రించేందుకు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతా ల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి దుకాణదారు నుంచి రశీదు తీసుకోవాలన్నారు. నగరంతో పాటు మండలాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

## జూన్ 2 నాటికి విద్యార్థులకు అందించే దుస్తులు సిద్ధం : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే దుస్తులను జూన్ 2 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్,వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ కుట్టుతున్న తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 11,576 యూనిఫాంలు కుట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 వరకు నూరు శాతం పూర్తి చేసి విద్యార్థులకు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 41,427 మంది విద్యార్థులకు మొదటి జత పంపిణీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన ప్రొగ్రెస్ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళ సంఘాల సభ్యులు దుస్తుల కుట్టుతో పాటు ధాన్యం కొనుగోలులో బాగా పని చేశారని, ల్యాబ్ ఎంట్రీ బాగా చేసి తక్కువ సమయంలో రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా కృషి చేశారని అభినందించారు. సమావేశంలో డిఆర్‌డిఓ మధుసూదనరాజు, డిఇఓ అశోక్, అడిషన్ డిఆర్‌డిఓ సురేష్, డిపిఎంలు, ఎంపిఎంలు, స్కూల్ కోఆర్డీనేటర్లు, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జి మహిళ సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో 'ఇండియా' కూటమి సమరోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌ఏలను జైళ్లకు పంపిన బిజెపి ప్రభుత్వం ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే మార్చి 21న ఏకంగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను సైతం లిక్కర్ స్కామ్‌లో తిహాడ్ జైలుకు పంపింది. దీంతో ఒక్కసారి ఆప్ శ్రేణులు ఢీలా పడ్డాయి. అయినప్పటికీ అసాధారణ రీతిలో జైలు నుండి ముఖ్యమంత్రిగా విధులు నిర్వహించిన అరవింద్ కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసేందుకు వీలుగా చివరకు సుప్రీం కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దీంతో 50 రోజుల జైలు జీవితం నుండి మే 10న ఆయన బైటికి రావడంతో ఆప్‌కు కొత్త ఊపిరినిచ్చింది.

**తొలిసారిగా ఆప్‌తో జత కట్టిన కాంగ్రెస్...** ఢిల్లీలో మూడుసార్లు సిఎం షీలా దీక్షిత్ నేతృత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చారు. దీంతో కాంగ్రెస్, ఆప్‌లు ఉప్పు నిప్పులా ఉండేవి. కాని కాలక్రమేణా కాంగ్రెస్ ఢీలా పడి, బిజెపి రెండవ స్థానంలోకి ఎగబాకింది. శాసనసభ ఎన్నికల్లో మూడు సార్లు ఆప్ ఘన విజయం సాధించినప్పటికీ, ఢిల్లీ లోక్‌సభ ఎన్నికలలో విజయం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మారింది. పంజాబ్ నుండి ఆప్‌కు లోక్‌సభ ఎంపిలు ఉన్నప్పటికీ, ఢిల్లీ నుండి ఇప్పటి వరకు ఆ పార్టీ తరుపున ఒక్క లోక్‌సభ సభ్యుడూ ఎన్నిక కాకపోవడం గమనార్హం. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఏర్పాటు, ప్రతిపక్షాలపై బిజెపి దాడుల నేపథ్యంలో ఎట్టకేలకు బద్ధ శత్రువులుగా ఉన్న ఆప్, కాంగ్రెస్‌లు ఉమ్మడి శత్రువైన బిజెపిని ఓడించేందుకు ప్రస్తుత ఎన్నికల్లో ఒక్కతాటిపైకి వచ్చాయి. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలలో 4 స్థానాల నుండి ఆప్, 3స్థానాలలో కాంగ్రెస్ పోటీ చేసేలా సీట్ల సర్దుబాటు చేసుకున్నాయి. తొలుత పొత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీలో కొంత వ్యతిరేక వ్యక్తమైంది. ఏకంగా డిపిసిసి అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీ పార్టీకి గుడ్ బై చెప్పి బిజెపిలో చేరారు. ఒకరిద్దరు నాయకులు కూడా అదే బాట పట్టారు. దీంతో పరిస్థితి ఎటు దారితీస్తుందోనని రెండు పార్టీలో ఆందోళన వ్యక్తమైంది. అరవింద్ కేజ్రీవాల్ జైలు నుండి వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. ఆప్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఐక్యత రావడంతో అంతటా కలిసి మెలిసి పని చేస్తున్నారు. కింది వరకు కార్యకర్తల యంత్రాంగం కలిగి ఉన్న ఆప్ .. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తమ భుజాలపై ఎత్తుకొని ప్రచారం చేస్తున్నారు.

**అంతా పేరొందిన అభ్యర్థులే...**రాజధాని ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలలో స్థానికుల కంటే ఇతర రాష్ట్రాల నుండి స్థిరపడిన వారే వివిధ పార్టీల నుండి లోక్‌సభ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఈశాన్య ఢిల్లీ నుండి బిజెపి తరుపున పోటీచేస్తున్న మనోజ్ తివారీ ఒక్కడే ప్రస్తుతం పోటీ చేస్తున్న వారిలో సిట్టింగ్ ఎంపి. ఈ స్థానం నుండి జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మోదీ ప్రభుత్వ అణిచివేతను ఢీకొని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్హయ్య కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ బిహార్, యుపి నుండి వచ్చి స్థిరపడిన ఓటర్లు ఎక్కువ. అలాగే న్యూఢిల్లీ స్థానం నుండి కేంద్ర మాజీ మంత్రి, ఢిల్లీ మాజీ సిఎం సుష్మా స్వరాజ్ కుమార్తె బాసురి స్వరాజ్ బిజెపి తరుపున పోటీ చేయడం ద్వారా రాజకీయ ఆరంగేట్రం చేస్తున్నారు. ఆమెపై ఆప్ ఎంఎల్‌ఏ సోమనాథ్ భార్తీ రంగంలో ఉన్నారు. దేశంలోనే చిన్నదైన లోక్‌సభ స్థానం చాందినీ చౌక్ నుండి బిజెపి తరుపున ప్రముఖ వ్యాపారి ప్రవీణ్ ఖండేల్వాల్‌ను కాంగ్రెస్ పాతకాపు జైప్రకాశ్ అగర్వాల్ ఢీకొడుతున్నారు. వాయువ్య ఢిల్లీ స్థానం నుండి బిజెపి అభ్యర్థి యోగేంద్ర చండోలియాపై కాంగ్రెస్ తరుపున ప్రముఖ దళిత నేత, మాజీ ఐఎఎస్, బిజెపి మాజీఎంపి ఉదిత్ రాజ్ పోటీ చేస్తున్నారు. పశ్చిమ ఢిల్లీ స్థానం నుండి బిజెపి నుండి కమల్‌జీత్ సెహరావత్‌తోఆప్ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఏ మహాబల్ మిశ్రా తలపడుతున్నారు. ధనికులు అధికంగా ఉండే దక్షిణ ఢిల్లీ స్థానంలో ఆప్ ఎంఎల్‌ఏ సహీరామ్ పెహెల్వాన్ పోటీ చేస్తుండగా, బిజెపి నుండి రామ్‌వీర్ సింగ్ బిధూరీ రంగంలో ఉన్నారు. తూర్పు ఢిల్లీ స్థానంలో ఆప్ తరుపున ఎంఎల్‌ఏ కుల్దీప్ కుమార్‌తో బిజెపి అభ్యర్థి హర్ష్ మల్హోత్రా తలపడుతున్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆమ్ ఆద్మీపార్టీ తాము పోటీ చేస్తున్న నాలుగు ఎంపి స్థానాలలో ముగ్గురు సిట్టింగ్ ఎంఎల్‌ఏలు, ఒక మాజీ ఎంఎల్‌ఏను పోటీలో నిలిపింది.

**ఈసారైనా ప్రతిపక్షం వైపు మొగ్గుచూపేనా...** ఢిల్లీ ఓటర్లు గతంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో భిన్నమైన తీర్పులు ఇస్తూ విలక్షణతను చాటుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 56.9 శాతం ఓట్లు లభించగా, ఆప్‌కు 22.6 శాతం, కాంగ్రెస్‌కు 18.2 శాతం లభించాయి. కొన్ని మాసాల తరువాత 2020 ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పూర్తి భిన్నమైన ఫలితాలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో 70 ఎంఎల్‌ఏ స్థానాలలో 53.5 శాతం ఓట్లతో ఆమ్ ఆద్మీ పార్టీ 62 స్థానాలను కైవసం చేసుకుంది. బిజెపి 8 స్థానాలు, 38.51 శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 4.26 శాతం ఓట్లు మాత్రమే లభించగా, ఒక్క సీటు కూడా రాలేదు. ఈసారి కేజ్రీవాల్ జైలు నుండి బైటికి వస్తూనే ప్రచారరంగంలోకి దూకారు.బిజెపికి ఓటేస్తే తనను మళ్ళీ జైలుకు పంపుతారని, ఆప్‌కు ఓటేస్తే మళ్ళీ జైలుకు వెళ్ళాల్సిన అవసరం లేదని చేస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. ఆయన రోడ్ షోలకు కూడా విశేష ఆదరణ కనిపిస్తోంది. కేజ్రీవాల్ పంజాబ్, మహారాష్ట్రలో కూడా ప్రచారం చేశారు. ఢిల్లీలో బిజెపి మాత్రం పూర్తిగా ప్రధాని మోదీ ఛరిష్మాపైనే ఆధారపడి ప్రచారం చేస్తోంది.

### సిపిఐ మద్దతు

ఢిల్లీలో పోటీచేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులకు సిపిఐ మద్దతు ప్రకటించింది. ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కన్హయ్యకుమార్ ప్రచార కార్యాలయానికి బుధవారం సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, డాక్టర్ బికె కాంగో, ఢిల్లీ సిపిఐ నేత ప్రొఫెసర్ దినేశ్ వర్షణేలు వెళ్లారు. ఈ సందర్భంగా కన్హయ్యకుమార్‌కు సిపిఐ ఢిల్లీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, అలాగే ఇండియా అలయన్స్ తరపున ఢిల్లీలో పోటీచేస్తున్న ఏడుగురు అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. వీరి విజయం కోసం బిజెపి ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ గడపగడపకూ వెళ్లి సిపిఐ కార్యకర్తలు ప్రచారం చేస్తారని తెలిపారు. అలాగే ఇండియా కూటమి ప్రచారం కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతినిధి బృందంలో సిపిఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్ అహ్మద్, సంజీవ్‌కుమార్ రానా, బబ్బన్‌కుమార్ సింగ్, రాంప్రసాద్ అత్రి కూడా ఉన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## వర్షాలకు ముందే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షకాలం రాబోతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల లో జనరేటర్స్, పవర్ బ్యాకప్‌ల పనితీరును పరిశీలించి, యుద్ధప్రాతిపదికన అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన ప్రభుత్వ ఆస్పత్రులలో జనరేటర్ల పనితీరుపై వారం రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో రాజనర్సింహ బుధవారం సమీక్ష నిర్వహించారు. వరంగజల్ ఎంజిఎం హాస్పిటల్‌లో విద్యుత్ అంతరాయంపై ఆయన ఆరా తీశారు. 24గంటల్లో నివేదిక ఇవ్వాలని తెలంగాణ మెడికల్ సర్వీసెస్ , మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థను ఆదేశించారు. వానాకాలం వస్తున్నందున విద్యుత్‌కు సంబంధించి ఆస్పత్రుల్లో ఎటువంటి అంతరాయం రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వె ంటనే వాటిని పరిష్కరించాలన్నారు.

## పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికపై సిఎం నజర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఇన్‌చార్జులు క్రియాశీలకంగా వ్యవహరించాలని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఈనెల 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతీ ఎంఎల్‌ఎ తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించాలని ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్,ఖమ్మం ఉపఎన్నిక అంశంపైన సిఎం రేవంత్‌రెడ్డి బుధవారం జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి ఆయన గెలుపు ఉపయోగపడుతుందన్నారు. ఈఉపఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### ఆహార నాణ్యతా ప్రమాణాలు

## పాటించని బడా హోటళ్లు

ఫుడ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలలో విస్తుపోయే వాస్తవాలు వెల్లడి

పలు హోటళ్లు, రెస్టారెంట్‌లకు నోటీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని హోటళ్లలో ఆహార కల్తీ జరుగుతోంది. కనీస ప్రమాణాలు పాటించడం లేదనే జిహెచ్ఎంసి, రాష్ట్ర స్థాయి ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్లు టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలలో వెల్లడవుతున్నాయి. హోటళ్లలో ఆహారకల్తికి సంబంధించిన బుధవారం బృందాలు తనిఖీ లు జరిపాయి. సోమాజిగూడలోని క్రుతుంగ రెస్టారెంట్, రెస్ ఓ బార్, కెఎఫ్‌సిలలో పలు కల్తికి పాల్పడుతున్నట్లు వెలుగులోకి వచ్చాయి. ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సులేని సంస్థల పేరుతో తయారైన ఆహార పదార్థాలు, టిడిఎస్ తగిన మోతాదులోని తాగునీటి సీసాలు, దుర్గంధం వ్యాపించిన వంట గదులు, తదితర సమస్యలను అధికారులు గుర్తించారు. కెఎఫ్‌సిలో అసలైన ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సు లేకుండా ఆహారకేంద్రాన్ని నడిపిస్తున్నట్లు గుర్తించామని అధికారులు వెల్లడించారు. రెస్ట్ ఓబార్‌లో ప్యాకింగ్ సరిగా లేని 50 పిజ్జాలు, ఐదు ప్యాకెట్‌ల గార్లిక్ బ్రెడ్, ఐదు కిలోల న్యాడూల్స్‌తో పాటు పలు రకాల వస్తువులను ఫ్రిజ్‌లలో అడ్డదిడ్డంగా నిల్వ చేశారన్నారు.



శాఖాహారం, మాంసాహార పదార్థాలను ఒకే ఫ్రిడ్జ్‌లో కలిపి నిల్వ చేయడం, ఎక్కువ మోతాదులో సింథటిక్ ఫుడ్ కలర్ల వినియోగం వంటి లోపాలను గుర్తించామన్నారు. క్రుతుంగ రెస్టారెంట్‌లో ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్సులేని రూ.2,100 విలువైన ఆరు కిలోల గంగా గోల్డ్ పన్నీ ర్ ప్యాకెట్లు, ఏప్రిల్ 3, 2024న గడువు ముగిసిన రూ.1800 విలువైన ఆరు కిలోల మేతి మలాయ్ మిశ్రమం, టిడిఎస్ 4 పిపిఎంగా ఉన్న రూ.7,800 విలువైన 156 క్రుతుంగ బ్రాండ్ తాగునీటి బాటిళ్లు, నాసిరకం మసాలాలు, రిఫ్రిజిరేటర్లో ప్యాకింగ్ లేకుండా నిల్వ చేసిన వేర్వేరు మాంసం, ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. కుళ్లిపోయిన ఆహారపదార్థాలను గుర్తించి, చెత్తలో పడేశామని అధికారులు చెప్పారు. సంబంధిత హోటళ్ల నుంచి నమూనాలను సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపామని అధికారులు వెల్లడించారు. వంటగదుల్లో వడ్డించేవాళ్లు, వంట మనుషుల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడటం లేదన్నారు. సిబ్బంది వైద్య పరీక్షల సర్టిఫికెట్లు, వంట గదిలో బొద్దింకలు, ఇతర కీటకాలను నియంత్రించే వ్యవస్థ, ఎలాంటి నీటిని వంటకు ఉపయోగిస్తున్నారనే ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయిందన్నారు. సరైన ప్రమాణాలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పరాయి స్త్రీలతో సహజీవనం
## ఎస్ఐతో పాటు కానిస్టేబుల్ సస్పెండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరాయి స్త్రీతో సహజీవనం వ్యవహారంలో సిద్దిపేట కమిషనరేట్ కు చెందిన కొమురెల్లి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న యం. నాగరాజుతో పాటు, కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీపి శ్రీ ఎ. వి. రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... కొమురేల్లి ఎస్ఐ నాగరాజు, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇరువురు తమ భార్యలకు విడాకులు ఇవ్వకుండా పరాయి స్త్రీలతో సహజీవనం చేస్తున్నట్లుగాఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు ఎస్ఐ నాగరాజు భార్య తన పిల్లల కోసం కొమురెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసినట్లుగా వివిధ మీడియా మధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఈ సంఘటనపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ విచారణ జరిపి ఇచ్చిన నివేదికలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో పోలీస్ విభాగం కీర్తి ప్రతిష్ట భంగం కలిగించే విధంగా ఎస్ఐ, కానిస్టేబుల్‌ల ప్రవర్తన ఉండడంతో వారిని సస్పెండ్ చేస్తున్నట్లుగా మల్టీ జోన్ 1 ఐజిపి ఏవి రంగనాథ్ ఉత్తర్వులు జారీచేశారు.

## టిఎంఆర్ఐఐఎస్ విద్యార్థులకు
## తోషిబాలో టెక్నిషియన్లుగా ఉద్యోగాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ(టిఎంఆర్ఐఐఎస్) విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. టిఎంఆర్ఐఐఎస్ చెందిన 11 మంది విద్యార్థులు పటాన్ చెరులోని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ లో జరిగిన ఇంటర్వ్యూలో ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్‌గా ఉద్యోగాలు సాధించినట్లు టిఎంఆర్ఐఐఎస్ కార్యదర్శి అయోషా మసరత్ ఖానం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సిఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

## రాజేందర్‌రెడ్డి భూదాన భూఅక్రమణలపై
## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

శంకర్ నాయక్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూదాన యజ్ఞ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి భూదాన భూఅక్రమణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి కఠిన చర్యలు లు తీసుకోవాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. పేదలకు చెందాల్సిన వేలాది కోట్ల విలువైన భూదాన భూములను అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. హైదరాబాద్‌గాంధీ భవన్ టిఎస్ఎం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరి ప్రసాద్ అధ్యక్షతన తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శంకర్ నాయక్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల భూదాన భూ కుంభకోణానికి పాల్పడ్డ గున్న రాజేందర్ రెడ్డి అక్రమాలు, క్రిమినల్ చర్యలపై సిబిసిఐడి విచారణకు సిఫారసు చేస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన మాజీ ఐఎఎస్ అధికారి ఎస్‌కె సిన్హా టాస్క్ ఫోర్స్ కమిటీ సమర్పించిన నివేదికను బిఆర్ఎస్ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి గున్న రాజేందర్‌రెడ్డిపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకొని, అయన ఆక్రమించిన భూదానభూములను స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అకిరెడ్డి, వెంకట్ రామ్‌మోహన్‌రావు, చుండూరు గోపాల్‌రావు, లతక్కా, జోపాక రమేష్, యాదమ్మ, భాస్కర్, విజయ్ పాల్గొన్నారు.



## సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా
# ఆనంద్, సరస్వతి వివాహ వార్షికోత్సవ వేడుక



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆనంద్ జి, సరస్వతిల 50వ వివాహావార్షికోత్సవ వేడుకను సిఆర్ ఫౌండేషన్‌లో బుధ వారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశ్వర్‌రావు, గోరేటి వెంకన్నలు పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఆనంద్ జి భారత కమ్యూనిష్టు పార్టీ కోసం విశేషంగా కృషి చేసినమంచి మనస్సున్న వ్యక్తి అన్నారు, ఆయన తన 50వ వివాహ వేడుకలను సిఆర్ ఫౌండేషన్‌లో కమ్యూనిష్టు పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకుల మధ్యలో జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. పార్టీ కోసం ఏంతో కృషి చేసిన ఆనంద్ జి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి ఆనంద్ జి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పానుగంటి పర్వాతాలు, డాక్టర్ పద్మారావు, రజనీ, సిఆర్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ల కుంభకోణంలో
## 'చిత్రపురి' అధ్యక్షుడు అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రమ రిజిస్ట్రేషన్‌ల కుంభకోణం కేసులో తెలు గు ఎపి సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనీల్‌కుమార్‌ను బుధవారం రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. మణికొండలోని చిత్రపురి హిల్స్‌లో ఈ హౌసింగ్ సొసైటీకి 184 ఫ్లాట్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఇందులోని సభ్యులకు మాత్రమే ఫ్లాట్స్ ఇవ్వాల్సి ఉండ గా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, ఎస్.ఎన్.దొర తదితర కార్యవర్గ సభ్యులు సభ్యులకు తెలియకుండానే అక్రమంగా ఇతరుకు ఈ మొత్తం ఫ్లాట్స్ అమ్మేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత సభ్యుల్లో తోట పద్మ(55) తమకు జరిగిన అన్యాయంపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలు దోచుకున్నట్లు తేలింది. దీంతో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులు సత్యనారాయణ దొర, హరి అల్ల, రత్న పరారీలో ఉన్నారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఈ కుంభకోణం జరిగిందని బాధితులు పేర్కొన్నారు.

## జీవ వైవిధ్యంపై యాచారం
## బాలికకు రాష్ట్రస్థాయి బహుమతి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన పోలోజు ప్రవళికకు నగరంలో నిర్వహించిన ప్రపంచ జీవ వైవిధ్యంపై రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి ఫొటోగ్రఫీలో అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ లోని జుబ్లిహిల్స్ దగ్గరలో ఉన్న కె బిఆర్ పార్కులో బిఈ పార్టు అఫ్‌ది ప్లాన్ పై ఫోటో గ్రఫీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బైయో డైవర్‌సిటి అధికారులు శ్రీ కాళి చరణ్, ఎస్‌కాటేడి, ఐఎఫ్ఎస్ అధికారి మోహన్ చంద్ర, ప్రిన్సిపల్ సెక్రటరి వాణి ప్రసాద్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరిగింది.

## రైతులకు సబ్సిడీపై విత్తనాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఫరూక్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. ఈనెల 23వ తేది నుండి ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం2 కేశంపేట రోడ్డునందు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి విత్తనాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరం ఉన్న అన్నదాతలు పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని మండల రైతులకు పిలుపునిచ్చారు.

# మరమ్మతు పనులు షురూ..

గ్రామాల నుండి నగరాల వరకు విద్యుత్ శాఖ ఫోకస్

రాజధానిలో తీగలకు తగిలే చెట్ల కొమ్మల నరికివేత

ప్రతి రోజూ పలు లైన్లను సరి చేస్తున్న వైనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ శాఖలో మరమ్మతు పనులు షురూ అయ్యాయి. ఎండాకాలం ముగిసి వానా కాలం వస్తుండడంతో ఆ శాఖ అప్రమత్తం అవుతోంది. అటు గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి నిరంతరం కరెంటు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఎక్కడెక్కడ ఏవైనా మరమ్మతు పనులు చేసేదీ ఆయా జిల్లాల నుండి సమాచారాన్ని తెలుసుకుంటోంది. ఇటు రాజధాని హైదరాబాద్‌లోనూ ఇటీవల పలు ఫీడర్లలో మరమ్మతు పనులు చేపట్టింది. ఉదయం 6.00 గంటల నుండే పనులు ప్రారంభి 10.00 గంటల లోగానే మరమ్మతు పనులు చేస్తూ ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కొరత రానీయకుండా చూస్తోంది. మరీ ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థలో సబ్ స్టేషన్లు, వివిధ లైన్ల మరమ్మతులు, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ నిర్వహణపై ఆ శాఖ చర్యలు చేపట్టింది. సంవత్సరంలో కనీసం రెకండు సార్లు అయినా విద్యుత్ వ్యవస్థ మెయింటెనెన్స్‌పై దృష్టి పెట్టి వాటి మరమ్మతులు చేపడుతుంది. ఈ దిశగా చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తోంది. వర్షాలు కురిస్తే ఆయా చెట్ల కొమ్మలు మరింతగా పెరిగే అవకాశం ఉండడం తెలిసిందే. అటు విద్యుత్ తీగలకు తాకే ఈ చెట్ల కొమ్మలను గమనించకపోతే ప్రమాదాలు ఆ స్థాయిలోనే ఉండనున్నాయని, అందుకే వినియోగదారుల నుండి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి వెనువెంటనే చెట్ల కొమ్మలను కొట్టేయించాలని ట్రాన్స్‌కో జెన్‌కో సిఎండి రిజ్వీ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎక్కడైనా వదులుగా ఉన్నట్లు కనిపిస్తే ఆయా విద్యుత్ తీగలను సరి చేయాలని ఆదేశిస్తున్నారు. తీగలపైపడ్డ చెట్ల



కొమ్మలు, దారాలు, ఇతర వస్తువులు తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ సర్క్యూట్ , బ్రేక్ డౌన్‌లు, వాటి పనితీరు తనిఖీ వంటి పనులు చేయాలని ఆదేశాలు అందుతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ పరంగా విద్యుత్ అత్యధికంగా వినియోగిస్తుండగా ఇటు హైదరాబాద్ లాంటి మహా నగరాలు, మున్సిపాలిటీ ప్రాంతాల్లో పరిశ్రమలు, వాణిజ్య అవరాలు తదితరాలు విద్యుత్‌ను అధికంగా వాడుకుంటున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 70 ఎక్స్‌ట్రా హైటెన్షన్ 400 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లతో పాటు , 220 కెవి, 132 కెవి సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు సరిపడా 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు , నాలుగు వేలకు పైగా విద్యుత్ ఫీడర్లు , సుమారు 1.5 లక్షల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగదారులకు విద్యుత్ ను అందిస్తూన్నా అప్పుడప్పుడు మరమ్మతులు అవసరం అవుతున్నాయి. ఇలాంటి సమయాల్లో 11 కెవి లైన్ల నుండి విద్యుత్‌ను వాడుతూ సమస్యలు రాకుండా చూస్తున్నారు. అసలే వర్షాకాలం వస్తుండడంతో విద్యుత్ మరమ్మతులు తరుచూ అవసరం రావచ్చని, అయితే దీనినే అదునుగా తీసుకుని కొందరు (రాజకీయ పరంగా ) తప్పుదోవపట్టించేందుకు యత్నిస్తే నమ్మవద్దని విద్యుత్ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి

జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్



**ప్రజాపక్షం/యాచారం :** జాతీయ స్థాయిలో గిరిజనులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నానని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుసేన్ అన్నారు. బుధవారం యాచారం మండల భిజెపి నాయకులు హైద్రాబాద్‌లోని ఎస్టి కమిషన్ కార్యాలయంలో కలిసి మండంలో ఉన్న గిరిజనుల సమస్యలను వివరించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గిరిజనులకు అండగా ఉంటు వారి సమస్యలను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపాధికన పని చేస్తున్నానని అన్నారు. కమిషన్ ఏర్పాటుతో ఎంతో మంది గిరిజనులకు మేలు జరగుతుందని అన్నారు. అందరు సద్వినియోగం చేసుకొవాలని అన్నారు. కార్యక్రమంలో తాండ్ర రవిందర్, యాచారం మండల ఎస్టిమోర్చ మండల అధ్యక్షులు సపావట్ గణేశ్ నాయక్, మంథనిగౌరేల్లి భూత్ అధ్యక్షులు సపావట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 24న సిడ్ మేళా : సందీప్

**ప్రజాపక్షం/యాచారం :** ఈనెల 24న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాజేంద్రనగర్ హైద్రాబాద్‌లో సిడ్ మేళా నిర్వహిస్తున్నారని మండల వ్యవసాయధికారి సందీప్ తెలిపారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో అయన మాట్లాడుతూ ఈ సిడ్ మేళాలో రైతులందరు సిడ్ మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సబ్సిడిపై జనుము, జీలుగ విత్తనాలు

**ప్రజాపక్షం/షాబాద్:** సబ్సిడిపై జనుము, జీలుగ విత్తనాలు అంటుబాటులోకి ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవానకాలం సీజన్‌కు 60శాతం సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, జీలుగ విత్తనాలు ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జీరాక్స్ తెచ్చి విత్తనాలు పొందవచ్చిని సూచించారు.

## మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండలం భైర్‌ఖాన్‌పల్లిలోని పోసముద్రం చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చెరువులో టిప్పర్ల ద్వారా బీహార్‌కు చెందిన రాహుల్ కుమార్, అజయ్‌కుమార్ యాదవ్‌లు మట్టిని తరలిస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, ఇటాచ్చిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అధ్యయనోత్సవ సహిత, పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈబ్రహ్మోత్సవాలు అమిత ప్రాముఖ్యమైన ఉత్సవాలని తెలిపారు. కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్ రెడ్డి, మీర్పేట్ కార్పొరేటర్ సిద్దాల మౌనిక, బొక్క రాజేందర్, కర్మంఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ వెంకటేష్ గౌడ్, దేవాలయ ఇఒ వై.శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం

కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్, ఆగమయ్య నగర్‌కాలనీలో నర్సింహ్మారెడ్డి పర్యటించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవర్షాలకే విజయవాడ నేషనల్ హైవే రోడ్డు, అగమయ్య నగర్ కాలనీ నుండి గణేష్ నగర్ వరకు ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యుసి, హెచ్ఎండబ్ల్యూఎస్, అండ్ఎస్‌బి, ఆర్అండ్‌బిశాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ తమ పరిధి పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు తక్షణ చర్యలను ముమ్మరం చేయాలని నరసింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు ఆంజనేయులు, యాదయ్య, సతీష్ కుమార్ రెడ్డి, వెంకటచారి, చంద్రశేఖర్, గోవర్ధన్, వెంకటయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు వైద్య సేవలు అంధించాలన్నదే లక్ష్యమని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కనకమామిడి అంజయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల వారి సహకారంతో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు మెడికల్‌క్యాంపు వద్దకు చేరుకొని వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ముట్పూర్ గ్రామంలో పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు వచ్చి హెల్త్ క్యాంపు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు మెరుగైన వైద్యసేలు పొందలేరని, దాంతో క్యాంపుల ద్వారానైనా మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఆశించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హెల్త్ క్యాంపుకు ప్రజల నుండి విశేష స్పందన లభించినట్లు వివరించారు. ఉచితంగా చికిత్సలు చేయడంతోపాటు మందులను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి

అధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్
శశాంక ఆదేశం



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల అవసరాలకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మరమ్మత్తులను తిరిగి అవసరమైన వసతులను పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మొయినాబాద్ మండలంలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగిరెడ్డి గూడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఎన్నికల సమయంలో నిర్దేశించిన మరమ్మత్తు పనులను జూన్ 4వ తేదీ వరకు పూర్తి అయ్యేలా అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు సౌకర్యం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, తరగతి గదులలో చేపట్టవలసిన మరమ్మతులు, విద్యార్థులు ఆడుకునే ఆట స్థలములలో కావలసిన వసతులు కల్పించాలని తెలిపారు. పాఠశాలల్లో వసతులు చేపట్టడానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేస్తూ, పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్ వాడి కేంద్రాలలో కూడా అవసరమైన వసతులు చేపట్టాలని తెలిపారు.

అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా ఎంపికైన పాఠశాలల్లో కూడా అన్నీ వసతులతో కూడిన సౌకర్యాలను చేపట్టాలని, పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్నీ పనులు పూర్తి చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావీ ఇవ్వకుండా బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లతో సహా, కిచెన్, కిచెన్ పాత్ర లు, బ్లాక్ బోర్డ్ లు, పాఠశాలల పైకప్పులను పరిశీలించిన్న కలెక్టర్ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులకు మరమ్మతులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందరారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## దళిత వైతాళికులు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దళిత వైతాళికులు, సంఘం సంస్కర్త భాగ్య రెడ్డి వర్మ జయంతి వేడుకలు సమీకృత కలెక్టరేట్ లోని ఎన్.ఐ.సి కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం అధికారికంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శమైన ఆయన జీవితాన్ని, ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వి.వి.రవి కుమార్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పాండు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు సమయం పాటించాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/నర్వ :** అంగన్‌వాడి కార్యకర్తలు, సూపర్‌వైజర్లు సమయ పాలన పాటించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. చాలా మంది నిర్ణీత సమయానికి విధులకు హజరు కావడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని చెప్పారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లాలోని మూడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పనితీరుపై కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో పనిచేసే ఆయాలకు వయసు నిర్ధారణ పరీక్షల కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని, 65 సంవత్సరాలు పైబడిన ఆయాలకు జీవో ప్రకారం రిటైర్ మెంట్ ప్రకటించాలని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లల సంఖ్య తగ్గుతోందని, సంఖ్యను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నించాలని ఆయన సూచించారు. సూపర్‌వైజర్లు రోజుకు రెండు కేంద్రాలను చెక్ చేయాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు లెక్కల్లో తేడాలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. శ్యామ్ , మ్యాంను సక్రమంగా చేయాలన్నారు. కేంద్రాలకు బాలామృతం ప్లస్ సరఫరాత అవుతోందా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాలామృతం ప్లస్ కేంద్రాలకు సరఫరా కాకపోతే మీరేం చేస్తున్నారని డీడబ్లు నరసింహారావు ను ప్రశ్నించారు. పోషణ్ అభియాన్ అటెండెన్స్ ఎవరు వేస్తున్నారని, తప్పులు జరగకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున అంగన్‌వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ఆదేశించారు. నర్వ మండలంలో ఎన్ని కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి? ఎన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని నర్వసూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల నుంచి 10 వ తేదిలోపు అంగన్‌వాడి కేంద్రాలకు బియ్యం, గుడ్ల సరఫరా సక్రమంగా జరిగేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని డిడబ్ల్యూఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో నారాయణపేట, మక్తల్, మద్దూర్ సిడిపిఓలు, ఆయా ప్రాజెక్టుల పరిధిలోని సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



## ఇంటింటికీ రక్త పరీక్ష సర్వే

**ప్రజాపక్షం/మల్దకల్ :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో బుధవారం జాతీయ పౌష్టికాహార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి రక్తపరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పౌష్టికాహార సంస్థ కౌశిక్ మాట్లాడుతూ గద్వాల జిల్లా 13 మండలాలు ఒక్కో మండలంలో రెండు గ్రామాలని ఎంచుకుని ఆ గ్రామంలో రేషన్ బియ్యం తీసుకున్న ప్రతి ఒక్కరికి హిమోగ్లోబిన్ , ఆర్‌బిసి, డబ్ల్యూబిసి, ప్లాటిలెట్స్, బ్లడ్ టెస్ట్ హైట్ వెయిట్ నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా రేషన్ బియ్యాన్ని అన్నం వండేటప్పుడు ఆ బియ్యాన్ని కడిగేటప్పుడు అందులో తెల్లనీళ్లను పారిజల్లకుండా మళ్లీ అందులో పోసి ఉడికించాలి. రేషన్ బియ్యం తిన్నవారికి బ్లడ్ బాగా పెరుగుతాయని జాతీయ పౌష్టికాహారం సంస్థ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ , నవీన్, రాంబాబు, పాషా, శ్రీధర్, సరస్వతి, ఆశాకార్యకర్త కాంతమ్మ, జ్యోతి,భారతి తదితరులు పాల్గొన్నారు.

## పశువులు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి : తిమ్మారెడ్డి



**ప్రజాపక్షం/మల్దకల్ :** అకాల వర్షం కారణంగా పిడుగుపడి పశువులు కోల్పోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మల్దకల్ మండలం సింగిల్ విండో చైర్మన్ శేషంపల్లి తిమ్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పరిధిలోని బోయిలగూడెం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు ఉరుములతో కూడిన భారీ వర్షం కి ఆ గ్రామంలో చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. అదే గ్రామంలో వ్యవసాయ పొలం దగ్గర ఉన్న ఎద్దు పిడుగు పాటు మృతి చెందిందని ఆ రైతు కన్నీరు కారుస్తున్న పట్టించుకుని ప్రభుత్వం అలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు.

## అధైర్యపడొద్దు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పెద్ద కొత్తపల్లి మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రకాష్ గౌడ్ తల్లి శ్యామలమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్‌ఏ బీరంహర్షవర్దన్‌రెడ్డి బుధవారం నారాయణపల్లి గ్రామానికి వెళ్లి శ్యామలమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి అధైర్యపడొద్దు అండగా ఉంటామని మాజీ ఎంఎల్‌ఏ బీరం కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. పరామర్శించినవారిలో ఎంపిటిసి రేణుకనాగరాజు, కొల్లాపూర్ వ్యవసాయ మార్కెటింగ్ మాజీడైరెక్టర్ పరమేష్, టిఆర్ఎస్‌పార్టీ గ్రామ అధ్యక్షులు విష్ణువర్దన్‌యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింహ్మా పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డివర్మ ఆశయసాధన కోసం కృషి

### వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లా మాదారి భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి ఉత్సవాలను బుధవారం ఐడిఓసి ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున అధికారికంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ , అధనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ , అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ సంఘం నాయకులు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదారి భాగ్యరెడ్డి దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, విద్య ద్వారానే దళితులు ఆత్మగౌరవం, అభివృద్ధి సాధించగలరనే విశ్వాసంతో హైదరాబాద్‌లో దళితుల కొరకు 30 పాఠశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. హిందూ సమాజంలోని అస్పృశ్యత, అంటరానితనం పై అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. సమాజంలో ఉన్న జోగిని, దేవదాసి, వెట్టి చాకిరి వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించి సమాజంలో మార్పు కొరకు కృషి చేశారని తెలిపారు. ఆది ఆంధ్ర సభ నిర్వహించి దళితులను, అణగారిన వర్గాల ప్రజలను చైతన్య పరిచేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ సూచించిన బాటలో పయనించిన జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు రాజారాం, ప్రకాశ తన చక్కటి పాట ద్వారా భాగ్యరెడ్డి వర్మ జీవిత కథను వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుషిత, జిల్లా అధికారులు, సంఘం నాయకులు గంధం నాగరాజు, గిరిరాజాచారి, టి. వెంకటస్వామి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు



**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారం చేస్తూ ఫీజుల పేర్లతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని , సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడి అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి. రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలో పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని నిబంధనలు పాటించాలని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పక్షాన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు విద్యాశాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.



## క్రీడాకారులకు క్రికెట్ సామాగ్రి అందజేత

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలంలోని ముమల్లపల్లి గ్రామంలో యువకులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కొత్తకోట మండల బీజేపీ నాయకులు వాకిటి రాజమౌళి జూనియర్ క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ సామాగ్రిని అందజేశారు. గ్రామంలో యువకులు కలిసి మెలిసి క్రికెట్ అడి గ్రామానికి ఎన్నో బహుమతులు గెలిచి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం

ప్రజాపక్షం / కొత్తకోట : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలు కాని వాగ్దానాలు చేసి, ప్రజలను నమ్మించి ఓట్లు వేసుకొని అధికారంలోకి వచ్చిందని బీజేపీ కో కన్వీనర్ కొమ్ము భరత్ భూషణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అధ్న్ను అమలు చేస్తామని నమ్మబలికింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోతున్నా ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేకపోతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం పేరుతో కోట్లాది రూపాయలు ఆర్టీసీకి బకాయి పడ్డవైనం ఇప్పుడిప్పుడే బయటకు వస్తుందన్నారు. అభయ హస్తం పేరు మీద ప్రజల నుండి లక్షలాది దరఖాస్తులు తీసుకొని, అభయ హస్తం పథకంలో ప్రకటించిన ఏ ఒక్క పథకాన్ని అమలు చేయకపోవడం కాంగ్రెస్ నైజానికి నిదర్శనం అన్నారు.

## 30న ఉచిత కంటిచికిత్స శిబిరం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జిల్లా అంధత్వ నియంత్రణసంస్థ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో ఈనెల30న ఉచితకంటిచికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు. క్యాటరక్ట్‌కంటిపొరగలవారికి, దృష్టిలోపంగలవారికి ఈశిబిరంలో ప్రత్యేకంగా కంటిపరీక్షలు నిర్వహించి అందులో అవసరమైనవారిని ప్రత్యేక అంబులెన్స్‌ద్వారా మహబూబ్‌నగర్ ఏనుగొండలోని లయన్‌రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ఆపరేషన్‌నిమిత్తం పంపనున్నట్లు తెలిపారు. ఈశిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా బిపి, షుగర్‌పరీక్ష, కరోనపరీక్ష ఒకరోజు ముందుగానే చేయించుకోవాలని , రోగులుతమవెంట ఆధార్‌కార్డు జిరాక్సు, రేషన్‌కార్డుజిరాక్సుకాఫి తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9440454284 సంప్రదించాలన్నారు.

## అందుబాటులో జీలుగు విత్తనాలు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండలంలోని రైతు ఆగ్రో సేవ కేంద్రాలలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ తెలిపారు. 30 కేజీల జీలుగు విత్తనాలు 60 శాతం సబ్సిడితో రూ.1,116, రైతు వేదికలలో ఏఈఓలను సంప్రదించి ఆధార్ కార్డు పట్టా పాస్ బుక్ జిరాక్స్ లను తీసుకొని పర్మిట్ రాయించుకొని అగ్రో సేవా కేంద్రాలకు వెళ్లి జిలుగు విత్తనాలు తీసుకెళ్లాలని తెలిపారు.

## ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లా అకాల నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు వేగంగా మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ ఆదేశించారు. మంగళవారం వీపనగండ్ల మండలంలోని తూంకుంట, పాన్‌గల్ మండలంలోని వెంగలయాపల్లి, చిన్నంబావి మండలంలోని చిన్నంబావి, వెల్గొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వేగంగా ట్యాబు ఎంట్రి పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. మిగిలిన ధాన్యంపై టార్పలిన్‌లు కప్పి ఉంచాలని, ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## 25న జెడ్‌పి సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లా ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 25న జిల్లాకేంద్రంలోని ఎస్‌జేఆర్‌ఫంక్షన్‌హాలులో జిల్లా ప్రజాపరిషత్‌చైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దేవసహాయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తమశాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల పూర్తి సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## 23న సామూహిక వ్రతాలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పట్టణంలోని జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలోగల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల23న గురువారం ఉదయం 10.30గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తులచే నిర్వహిస్తున్నట్లు రామాలయప్రధాన అర్చకులు కందడైవరదరాజన్‌అయ్యంగార్ తెలిపారు. సత్యనారాయణస్వామివ్రతంలో పాల్గొన్న భక్తులందరికివారిపేరిట గోత్రనామాలతో సంకల్పం చెప్పనున్నట్లు తెలిపారు. పౌర్ణమిరోజు ప్రత్యేకంగా వ్రతాలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలతో పాటు రామాలయ అన్నప్రసాదకమిటివారిచే మధ్యాహ్నం ఒంటిగంటకుఅన్నప్రసాదవితరణ చేయనున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని దేవునికృపకు పాత్రులుకాగలరని కోరారు.

## మానవత్వంచాటుకున్న మేస్త్రీలు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ప్రధాన అనుచరులు వెన్నచర్ల గ్రామం వెంకటేశ్వరభవన నిర్మాణ తాపిమేస్త్రీలు మరణించిన మదనిశివుడు కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామానికిచెందిన మద్దనిశ్రీనివాసులు కుమారుడు మదనిశివుడు ఆకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న తాపీమేస్త్రీ యూనియన్ సభ్యులందరూ రూ.22వేలు ఆర్థికసాయం అందజేసి ఆకుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం అందజేసినవారిలో మద్దిలేటి, తిరుపతయ్య, కుర్మయ్య,రామకృష్ణ, శివ,సైదులు, శ్రీను,రాములు,చంద్రయ్య పాల్గొన్నారు.

# అర్బన్ రైస్ విల్లా వెంచర్‌పై చర్యలు తీసుకోండి







### అధికారులు స్పందించకపోతే ఆందోళనలు

ప్రజాపక్షం/బాలానగర్ : బాలానగర్ మండలం చెన్నంగుల గడ్డ గ్రామ పంచాయితీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ రైస్ విల్లా వెంచర్ యాజమాన్యం నిబంధనలను మొత్తం తుంగలో తొక్కి రోడ్డును ఆక్రమించి ఆర్చి నిర్మాణం చేస్తున్నారని, భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాలుగడ్డ తాండ తాజా మాజీ సర్పంచు గంగా భర్త రవి నాయక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ నిర్మాణ పనులను అపకపోతే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరిస్తున్నారు. బుధవారం ఈ మేరకు వెంచర్ నిర్వాహకులు నిర్మాణం చేస్తున్న ఆర్చి ప్రాంగాణాన్ని ప్రత్యక్షంగా చూయించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు బేఖాతరు చేస్తూ మాస్టర్ ప్లాన్ అంటూ మభ్యపెడుతూ వెంచర్ నిర్వాహకులు రోడ్డును కబ్జా చేస్తున్నారని, ప్రమాదాలకు నిలయంగా ఉన్న ఈ మలుపును మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుకు పక్కనే ఐటెన్షన్ వైర్లతో పాటు ఇతర విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికినీ విద్యుత్ వైర్ల కిందనే ఆర్చి నిర్మాణం చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హై టెన్షన్ వైర్‌లైన్ నుండి సుమారు 50 ఫీట్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడ పాటించడం లేదని, ఇది ప్రజల ప్రాణాలను బలి గొనడమే అవుతుందని వెంచర్ యాజమాన్యంపై మండిపడ్డారు. నిబంధనల ఉల్లంఘించారనేది అవాస్తవం. వెంచర్ సైట్ ఇంజనీర్ ప్రసాద్ వెల్లడి ప్రభుత్వం తయారు చేసిన మాస్టర్ మ్యాపు ప్రకారమే తమ వెంచర్ నిర్మాణ పనులు చేపట్టామని, కొంతమంది స్థానికులు ఆరోపిస్తున్నట్లు నిబంధనలను ఎక్కడ అతిక్రమించలేదని వెంచర్ సైట్ ఇంజనీర్ ప్రసాద్ తెలియజేశారు. వాస్తవానికి రోడ్డు పక్కనే హైటెన్షన్ వైర్లు ఉన్నాయని, అందువలన రోడ్డు అవతలి వైపున తమ భూమి ఉందని అందులో రోడ్డు విస్తరణకు స్థలం వదలడం జరిగిందని తెలిపారు. మీ వెంచర్ ఆర్చి నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్ల రోడ్డు మలుపు మరింత ప్రమాదకరంగా తయారయ్యే అవకాశం ఉంది కదా. మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. కదా అని ప్రశ్నించగా అది మాకు సంబంధం లేదు అర్‌అండ్‌బి అధికారులను, ముడ అధికారులను ప్రశ్నించాలని సమధానం ఇచ్చారు. గత ఆరు నెలల నుండి ఈ మలుపులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదని సైట్ ఇంజనీర్ ప్రసాద్ తెలిపారు. వెంచర్ని నిర్వాహకులు చెబుతున్న విధంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే అది అప్పట్లో అయ్యే పని కాదని అంతవరకు ఎంతమంది ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటారోనని, జరగబోయే ప్రమాదాలకు బాధ్యత వహిస్తామని వెంచర్ని ర్వాహకులు లిఖితపూర్వకంగా హామి ఇవ్వగలరా అని స్థానిక ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై స్థానిక పంచాయితీ కార్యదర్శి చంద్రలేఖను వివరణ కోరగా నిర్మాణ పనులను ఆపే అధికారం తనకు ఉందో లేదో పై అధికారులను అడిగి చెబుతానని సమాధానం ఇచ్చారు.

భూతగాదాలు, కుటుంబ కలహాలతో

## తల్లీకూతురు ఆత్మహత్య



**ప్రజాపక్షం / మానవపాడు :** భూతాగాదాలు, కుటుంబ కలహాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని ఏ బుడిదపాడు గ్రామంలో చోటుచేసుకుది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏ బుడిదపాడు గ్రామానికి చెందిన మాల నరసింహులు తన భార్య వరలక్ష్మి (39), కూతురు అనురాధ (18) భూతగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగారు. ఈ ఘటనలో వరలక్ష్మి , అనురాధ పరిస్థితి విషమించడంతో హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందేలోపే ఇద్దరు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మాల నరసింహులు మాత్రం ఆత్మహత్య చేసుకోవాలని భావించినా పురుగుల మందు తాగడానికి భయపడ్డారు. అయితే తన కళ్ళ ముందే భార్య, కుతురు చనిపోవడంతో కుప్ప కూలిపోయాడు, గత కొన్ని రోజులుగా అన్నదమ్ములకు మధ్య భూతగాదాలు ఉన్నాయి. ఎన్నో సార్లు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకోవడం గొడవలు చేసుకున్నట్లు తెలిసింది. అయితే కూతురు , కొడుకు చదువు కోసం పెళ్లి కోసం చాలా ఇబ్బందులు గురవుతున్నామని తమకు వారసత్వం కింద ఇచ్చిన భూములు సీలింగ్ ఉండడంతో ఎవరు కొనడం లేదని భావించి ఎన్నోసార్లు అన్నదమ్ములతో మాల నర్సింహులు ప్రాధేయపడ్డాడు. తన కుటుంబానికి ఎవరూ సహకరించడం లేదని భావించి మంగళవారం కుటుంబ సభ్యులు చనిపోవాలని పురుగుల మందు సేవించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో తల్లి కూతురు మృతి చెందారు. కొడుకు హైదరాబాద్‌లో చదువుకుంటున్నట్లు తెలిసింది. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## జిల్లాకు చేరిన యూనిఫాంలు

### మొత్తం 60,423మంది విద్యార్థులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాపరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాంకు సంబంధించిన వస్త్రాలు జిల్లాకు చేరాయి. మండలాలవారిగా వస్త్రాలను పంపిణీచేసి , ఎంపికచేసిన స్వయంసహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుట్టించేందుకు జిల్లావిద్యాశాఖ, డిఆర్‌డిఏశాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో ప్రస్తుతం ఒకటినుంచి 8తరగతులవరకు 46,529విద్యార్థులు కేజిబివి, మోడల్‌స్కూల్ , ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో బాలురు 22,796, బాలికలు 23,733మంది ఉన్నారు. 9,10తరగతుల్లో మొత్తం 12,418మంది విద్యార్థులున్నారు. వారిలో 6213 మంది బాలురు, 6205మంది బాలికలు ఉన్నారు. కేజిబివి మోడల్‌స్కూల్లో చదువుతున్న 11,12తరగతివరకు 1476మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 99మంది బాలురు, 1377బాలికలు ఉన్నారు.

**మహిళా సంఘాలకు బాధ్యతలు :** ఏకరూప దుస్తుల తయారీబాధ్యతను జిల్లాలోని మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు డిఇఓ తెలిపారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న సంఘాలను ఆహ్వానించి టెండర్లు ఖరారు చేయాల్సి ఉందన్నారు. అనంతరం మండలాలవారిగా యూనిఫామ్స్ తయారుచేసే బాధ్యతను డిఆర్‌డిఏ అధికారుల సహకారంతో ఎంఈవోల పర్యవేక్షణలో సిద్ధం చేయించనున్నారు.

**తొలిరోజే విద్యార్థులకు అందజేత :** జిల్లాలోని అన్ని ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం జూన్12నాడే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలవారితో ప్రత్యేకంగా చర్చించి యూనిఫామ్స్‌ను త్వరితగతిన సిద్దంచేస్తామన్నారు. విద్యార్థులకు ఒక జత దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



## రెడ్‌క్రాస్ సంచారవైద్యసేవలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** రెడ్‌క్రాస్‌సొసైటి నాగర్‌కర్నూల్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ యూనిట్‌ద్వారా మండలంలోని యాపట్ల, చంద్రకల్ గ్రామాల వృద్ధులకు ఉచిత సంచారవాహన వైద్యసేవలందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ ,తెలంగాణరాష్ట్ర రెడ్‌క్రాస్‌జనరల్ సెక్రటరీ మదన్‌మోహన్‌రావు హాజరై రెడ్‌క్రాస్ వైద్యసేవలను ప్రారంభించారు. ఈసందర్భంగా సుధాకర్‌లాల్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌సొసైటి ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం డిపార్టుమెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్‌పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో వృద్ధులకు ఇంటివద్దనే సేవలందించేందుకు ఈసంచార వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశాలమేరకు రెడ్‌క్రాస్ సంచార వాహన వైద్యసేవలు అందిస్తున్నామని బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 86మంది వృద్ధులకు పరీక్షలునిర్వహించి మందులను అందించామన్నారు.



## బస్సులు పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రంనుండి ఉమ్మాపూర్‌మీదుగా డిండివెళ్లే బస్సును పునరుద్దరించాలని బిసివిద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగుమహేష్ బుధవారం కల్వకుర్తిపట్టణంలోని ఆర్‌టిసిబస్సు డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ మహిపాల్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతోప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచితప్రయాణం మహిళలకు ఎంతోమేలు చేస్తుందని అన్నారు. మండలకేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వారెడ్డిపల్లినుండి వంగూరుమీదుగా తుమ్మలపల్లి, కొండారెడ్డిపల్లి, కల్వకుర్తివరకు అదేవిధంగా జాజాల రంగాపూర్ పోల్కంపల్లి మీదుగా వంగూరు మండలకేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్‌చేశారు. అధికారులు స్పందించి అదనపు బస్సులను ఏర్పాటుచేసి గ్రామాలలో బస్సుసౌకర్యం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో బిసిసంక్షేమసంఘం జిల్లాకార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులుయాదవ్,బిసి సంఘం నాయకులు అనిల్‌ప్రసాద్, వెంకటేష్, విష్ణు, సాయిబాబు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపాలిటీ ఉప్పర్‌పల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో మహిళలు తమ మొక్కులను సమర్పించారు. అనంతరం పెద్దమ్మ తల్లి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో దుర్గమ్మ అమ్మవారి బోనాలు



**పజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి చౌరస్తాలో గల దుర్గామాత బోనాల పండుగ పురస్కరించుకుని ఈనెల 25వతేదీ శనివారం రాత్రి బోనాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం వడి బియ్యం, వన భోజనాల కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి, పుకట్ నగర్, వెంకట్‌రెడ్డి నగర్, మధుసూదన్‌రెడ్డి నగర్, చిన్న చర్లపల్లి కాలనీవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని జిహెచ్‌ఎంసి ఎలక్ట్రికల్ అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ అధికారులు ఆలయ చుట్టూ పక్కన శుభ్రం చేయాలని వారు కోరారు.

## నేడు చర్లపల్లిలో విద్యుత్‌కు అంతరాయం

**పజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ రవీందర్ తెలిపారు. చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇందిరాగృహ కల్ప 11 కెవి ఫీడర్‌ను 11 గంటల నుండి 12.30 గంటల వరకు నిలిపి వేయడంతో ఇసీ నగర్,మింట్ కాలనీ,మహలక్ష్మి కాలనీలో,పెద్ద చర్లపల్లి 11 కెవి ఫీడర్‌ను మధ్యాహ్నం 3 గంటల నుండి 4.30 గంటల వరకు నిలిపివేయడంతో పెద్ద చర్లపల్లి,ఆఫీసర్స్ కాలనీ,పుకట్ నగర్,వెంకట్‌రెడ్డి నగర్,మధుసూదన్ రెడ్డి కాలనీలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

## ఘనంగా శ్రీబాలాజి రథోత్సవం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీబాలాజి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణం నుంచి స్వామివారి రథాన్ని భక్తులు నామఃస్మరణతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. గోవిందా గోవిందా అంటూ పెద్ద పెట్టున గోవిందా నామాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చిన్నారులు, వృద్ధులు, యువకులు రథోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం భక్తితో నిండిపోయింది. అనంతరం మాజీ సర్పంచ్ ఉడతల జ్యోతిబలరామ్‌గౌడ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, మాజీ చైర్మన్ మైసయ్య, పూజారి నందగిరి ఉపేందర్ రావు, ఏలురూ కొమురయ్య, మల్లేష, రామస్వామి, తప్పెట్ల రాములుగౌడ్, ముద్రగణం రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొంపల్లిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** గురువారం న 11 కెవి ఎన్‌సిఎల్ ఫీడర్ నిర్వహణ చెట్ల నరికివేత, రాజధాని పనుల కోసం కొంపల్లి సబ్‌స్టేషన్ నుండి ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కింది ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుంది. ఎన్‌సిఎల్ కాలనీ ప్రజయ్ అపార్ట్‌మెంట్స్ వెన్నసాయి అపార్ట్‌మెంట్స్, శ్రీకర హాస్పిటల్స్ క్రోమా రత్నదీప్ ప్రాంతాలు.
కొంపల్లి సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 03:00 నుండి 4:30 వరకు 11 కెవి జయభేరి ఫీడర్ కింది ప్రాంతాలపై ప్రభావం చూపుతుంది. జయభేరి పార్క్ ఏరియా కాసా ఉజ్జయిని పృథ్వీ వాటర్ మార్క్ అపార్ట్‌మెంట్స్, బ్యాంక్ కాలనీ, శివాలయం టెంపుల్, శ్రీనివాస కాలనీ
11 కెవి విఘ్నేశ్వర ఫీడర్ 33/11 కెవి నుండి 11:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సరఫరా 33/11 కెవి కొంపల్లి ఎస్ఎస్ సరఫరా ప్రభావిత ప్రాంతం రుద్ర కన్‌స్ట్రక్షన్స్, మోడీ బిల్డర్స్, మల్లా రెడ్డి ఎమ్మెల్యే ఇల్లు, దుర్గా హోటల్ ఏరియా హాస్టల్స్ దగ్గర వరకు విద్యుత్ ఉండదని ఏఇఓ ప్రకటనలో తెలిపారు.

## అన్నిరకాల వడ్లకు రూ 500ల బోనస్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల వడ్లకు రూ 500ల బోనస్ ఇవ్వాలని బిఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీధర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చే శారు. ఈ ఖరీఫ్‌లోనే రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ. 7500లను ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .వడ్ల అంశం లో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీన్‌వాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటనలు ఒక్కో తీరుగా ఉన్నాయని, ఇంతకు దశల వారీగా అన్ని రకాల వడ్లకు బోనస్ అంటే ఏమిటో అర్థం కాలేదని అన్నారు. రుణమాఫీ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని లీకులు ఇస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మాఫీ చేయడం అసాధ్యమన్నారు. మండలానికో ఇంటర్ నేషనల్ స్కూల్ అని ప్రకటించారని, దీనిపైన కార్యాచరణ ఏమిటన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు పూర్తి నిరాశాజనకంగా ఉన్నదని, కాంగ్రెస్ అభయ హస్తం అక్కరకు రాని నేస్తంగా మారిందని ఆరోపించారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టుగా కనిపించడం లేదని రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు.

## బిఎస్ఐ గెలాక్సీకి బెస్ట్ చాప్టర్ అవార్డు



Tollywood actress of Race Gurram and Salaar fame Kranthi Balivada (3rd from Left), flanked by (L-R) Dr G Satish Kumar, President; Srinivas Gupta, ST; Jyothi Katta, VP & Sanngittha Segu, BNI Galaxy Chapter;

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అత్యుత్తమ పనితీరు కనబరిచిన కనబరిచిన బిఎన్ఐ గెలాక్సీకి బెస్ట్ చాప్టర్ అవార్డును అందుకుంది. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని హోటర్ పార్క్ హయత్‌లో నిర్వహించిన వేడుకల్లో బిఎన్ఐ గెలాక్సి అధ్యక్షుడు డా.జి.సతీష్ కుమార్‌కు రేసు గుర్రం మూవీ ఫేం నటి క్రాంతి బలివాడ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎన్ఐ వేడుకల్లో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలా మీలో ప్రతి ఒక్కరూ ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా బిఎన్ఐ గెలాక్సీ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రూపు ఐకమత్యంతో ముందుకు వెల్లడానికి ఇది ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. గత నాలుగేళ్ల నుండి ఈ బిఎన్ఐ గెలాక్సీ నడుస్తోందన్నారు. అనంతరం బిఎన్ఐ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ ఈ అవార్డు సభ్యుల కృషి, సహకారానికి నిదర్శనమన్నారు.

## అండగా ఉంటా ఆధైర్య పడొద్దు

### నర్సింహారెడ్డి కుటుంబానికి భరోసా
### ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధి గాజీపూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి(సీనియర్ విలేకరి) ఆనారోగ్యంతో నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పరమార్శించారు. గత ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయినప్పటికి ఆయన ఆరోగ్యం మెరుగు కాక పోవడంతో నీమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి బుదవారంహైదరాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రికి చేరుకుని నర్సింహారెడ్డిని పరమార్శించడంతో పాటు ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, ఆధైర్య పడోద్దని సూచించారు.అక్కడి వైద్యులతో మాట్లాడి నర్సింహారెడ్డికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎంఎల్ఎ వెంటా రుద్రాం మహిపాల్‌రెడ్డి, మంబాపూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నిర్లక్ష్యం.. నిద్రమత్తు..

### గర్భిణీలకు కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ






**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడి గుడ్ల సరఫరా చేసేవారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనికి తోడు స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారుల నిద్రమత్తు కూడా ఇందుకు తోడవుతోంది. కుళ్ళిన, నాసిరకం కోడిగుడ్లును సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలతో పాటు పోషకాలు ఉన్న ఆహారాన్ని ఇస్తుంది. గుడ్డు నుంచి పోషకాలు బాగా అందాలంటే గుడ్డు బరువు 44 నుంచి 50 గ్రాముల బరువు ఉండాలని సూచించింది. ఒక్క ట్రేలో ఉన్న గుడ్ల బరువు దాదాపు కిలోన్నర ఉండాలి. కానీ కాంట్రాక్టర్లు 30గ్రాముల కన్నా తక్కువ బరువున్న నాసిరకం, కుళ్ళిన కోడిగుడ్లను సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడమే లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఉద్దేశంతో నెలలో 16 కోడి గుడ్లను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడి గుడ్ల సరఫరా చేసేవారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనికి తోడు స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారుల నిద్రమత్తు కూడా ఇందుకు తోడవుతోంది. గత 15 రోజుల క్రితం గర్భిణీలకు కుళ్ళిన కోడిగుడ్లను ఐసిడిఎస్ సిబ్బంది పంపిణీ చేశారు.

### అక్రమాలకు చెక్ కే..ప్రభుత్వ లోగో

అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వలోగోతో సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసిన, కాంట్రాక్టర్లు మాత్రం కుళ్ళిన అతి చిన్న సైజు గుడ్లను లోగో తో సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ తదితర కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గత నెల వచ్చిన నాసిరకం, కుళ్ళిన చిన్న కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేశారు. అంగన్‌వాడీ నిర్వాహకులుస్తీలకు ఇచ్చారు.

**ఈ గుడ్లు ఎలా తినాలి...?**

అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను తీసుకున్న కొందరు గర్భిణీలు, బాలింతలు ఇంటికి తీసుకెళ్ళి ఉడకబెట్టగా దుర్వాసన రావడంతో వాటిని పారవేశారు. కొందరు తిరిగి అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చారు. గర్భిణీలు, బాలింతలు కొం దరు ఈ కుళ్లిన గుడ్లు మాకు ఎందుకు. ఎలా తినాలి మీరు ఇవ్వే తింటారా? మాకు ఎం అయినా అయితే బాద్యులు ఎవ్వరు అని నిలదీస్తున్నారు. ఇకనైనా అధికారులు తమ సీట్లకే పరిమితం కాకుండా అంగన్వాడీ సెంటర్లను తనిఖీలు చేయాలని పలువురు గర్భిణీలు, బాలింతలు విజ్ఞప్తి చేశారు.

## పోటీ పరీక్షాకేంద్రాలవద్ద రహదార్లపై ఇబ్బందులు






**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మల్లాపూర్, మౌలాలి ప్రాంతాల్లోని పోటీ పరీక్షలు నిర్వహించే ఆయాన్ డిజిటల్ కేంద్రాల వద్ద సమీపంలోని రహదార్లపై తీవ్రమైన రద్దీ, వాహనాలతో ప్రజలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద వదిలి పెట్టి తిరిగి తీసుకొని వెళ్లే సమయంలో రోడ్ల పక్కనే ఇష్టారీతిలో తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలకు దారితీస్తోంది. మల్లాపూర్‌లోని నోమా ఫంక్షన్ హాలు సమీపాన, మౌలాలి హౌజింగ్ బోర్డు, జడ్‌ఆర్‌టి సమీపంలో టిసిఎస్ సంస్థ ఆయాన్ డిజిటల్ జోన్ పేరిట కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో పరీక్షా కేంద్రంలో 2000 మంది విద్యార్థులు హాజరయ్యే వీలుగా కంప్యూటర్లతో ఉన్న ఈ కేంద్రాల్లో టిసిఎస్ సంస్థతో పాటు పలు సాఫ్ట్ వేర్ సంస్థలకు సంబంధించిన ఉద్యోగ నియామకాలకుగాను పరీక్షలు జరుగుతుంటాయి. తమ సంస్థ ఉద్యోగ నియామకాలకే కాక ఇతర ప్రయివేట్ సంస్థలు, రైల్వే, బ్యాంకింగ్ ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ పరంగా జరిగే పబ్లిక్ సర్వీసెస్, టెట్, ఎంసెట్ లాంటి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, పోటీ పరీక్షలకు ఈ డిజిటల్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ విధంగా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు షిప్టుల్లో ప్రతి నెలా కనీసం 15 నుండి 20 రోజులు ఇక్కడ పోటీ పరీక్షలు జరుగుతుంటాయి. ఈ పరీక్షలకు గాను హాజరయ్యే అభ్యర్థులు గ్రేటర్ మహానగరంలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా తెలంగాణా, సమీప ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుండి వస్తుంటారు.ఈ రెండు పరీక్షా కేంద్రాలు నిత్యం వాహనాల రాకపోకలతో తీవ్రమైన రద్దీగా ఉండే ప్రధాన రహదార్లపైనే ఉండటం, మల్లాపూర్ పరీక్షా కేంద్రం పక్కనే నోమా సినిమా థియేటర్, ఫంక్షన్ హాళ్లు, పలు వ్యాపార సంస్థలు ఉండటం వల్ల విద్యార్థులు హాజరయ్యేందుకు వచ్చే సమయంలోనూ, తిరిగి వెళ్లే సమయంలోనూ ఈ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పరీక్షా కేంద్రాల నిర్వాహకులు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసినప్పటికి అభ్యర్థులను తీసుకొని వచ్చినప్పుడు తిరిగి తీసుకొని వెళ్లే సమయంలో వెంట తీసుకొని వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు పరీక్షా కేంద్రాల్లోని సమీప ప్రధాన రహదార్ల పక్కనే ఇష్టారీతిన పార్కింగ్ చేస్తుండటం, వాటిని అదుపు చేసేందుకు అటు నిర్వాహకులు కానీ ట్రాఫిక్ పోలీసులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. గత మూడు రోజుల నుండి పది రోజుల పాటు జరుగుతున్న టెట్ పోటీ పరీక్షలకు గాను వివిధ జిల్లాల నుండి వేలాది సంఖ్యలో హాజరయ్యేందుకు వస్తున్న అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల వాహనాలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఇప్పటికైనా పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రధాన రహదార్లపై ఏర్పడుతున్న ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.1.5 లక్షలు ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఆర్థిక భారంతో చికిత్సకు నోచుకోలేని ఓ వ్యాధిగ్రస్తుడికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద లక్షన్నర రూపాయల ఆర్థిక సహాయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి బుధవారం అందించారు. మల్కాజిగిరి డివిజన్ శ్రీకృష్ణానగర్ కృపా కాంప్లెక్స్ ప్రాంతానికి చెందిన సఫ్వాన్ సబేర్ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యులకు చూపించుకోగా శస్త్ర చికిత్సలకు భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని తెలిపారు. చిన్నా చితకా పనులతో కుటుంబాన్ని పోషించుకొనే అతడి వైద్యం కోసం ఇబ్బందులు తలెత్తడటంతో ఆర్థిక సాయం కోసం స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించి సిఎం రిలీఫ్ ఫండ్ కోసం ధరఖాస్తు చేసుకొన్నాడు. ఈ మేరకు అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన లక్షన్నర రూపాయల చెక్కును స్థానిక మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, పార్టీకి చెందిన జెఎసి వెంకన్న మేకల రాము యాదవ్, శ్రీకాంత్, మణిరత్నం, ఆకారం సాయిల సమక్షంలో అతడికి ఎమ్మెల్యే అందించారు. మల్కాజిగిరి ప్రాంతంలో నివసించే ప్రజలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం తనను సంప్రదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

## పసికందుల వ్యాపారం గుట్టు రట్టు



**ప్రజాపక్ష/మేడ్చల్ ప్రతినిధి:** ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ముసుగులో పసికందుల వ్యాపారం కొనసాగిస్తున్న ఓ మహిళ గుట్టు రట్టయింది. అక్షర ఫౌండేషన్ అనే స్వచ్ఛంధ సంస్థ పథకం ప్రకారం తమకో పసిపాప కావాలని వెళ్లటంతో ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే....మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫిర్జాదిగూడ రామకృష్ణనగర్ ప్రాంతంలో ఆర్‌ఎంపి వైద్యురాలినంటూ శోభారాణి గత కొద్ది కాలంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను నడిపిస్తోంది. కొద్ది రోజుల క్రితం ఫౌండేషన్ ఎలాగైనా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలన్న ఆలోచనతో సంస్థకు చెందిన ఓ మహిళతో శోభారాణిని సంప్రదించి తమకు ఓ పసికందు కావాలని ఫోన్‌లో కోరి రూ.4.50 లక్షలు ఇస్తే ఏర్పాటు చేస్తానని చెప్పటంతో రూ.10 వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. ఒప్పందం ప్రకారం బుధవారం పాపను తీసుకొనేందుకు శోభారాణికి చెందిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు వెళ్లగానే పాపను అందిస్తున్న సమయంలో స్థానిక పోలీసులు, పాత్రికేయులు అక్కడికి చేరుకొని పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా శోభారాణిని అప్పగించారు. తాను పిల్లలను పెంచేందుకు ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను అవసరమైన వారికి అందిస్తున్నానని శోభారాణి చెబుతోంది. పసి పాప, ఆమె తల్లి, ఆర్‌ఎంపి వైద్యురాలు శోభారాణిలనను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## దుస్తుల తయారీలో నాణ్యత పాటించాలి

### అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను మే 30లోపు పూర్తి చేయండి
### పెద్దేముల్ మండలంలో పనులను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను మే 30లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయరెడ్డి అధికారులను ఆదేశించారు. బుదవారం పెద్దేముల్ మండల పరిధి మన్‌సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాలల్లోని ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో చేపట్టిన పనులను పరిశీలిస్తూ మొదటి ప్రాధాన్యతగా మౌలిక సౌకర్యాలు అయినటువటి మంచినీటి సౌకర్యం, మరుగు దోడ్ల మరమ్మత్తులు, విద్యుత్ పనులను చేపట్టాలని సూచించారు. పాఠశాలలో చేపట్టవలసిన పనులను మంజూరు అయిన నిధుల ద్వారా పక్కగా పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులన్ని నాణ్యతగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా వర్షాలు కురిసే సమయాల్లో లీకేజీలు, ఉంటే సరి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో చేపడుతున్న పనులన్నింటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.మంబాపూర్‌లోని ఆపూర్వ లేడీస్ టైలల్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఏకరూప దుస్తులు(స్కూల్ యూనిఫామ్) తయారి విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బట్టల కుట్టు విధన్నాన్ని కలెక్టర్ సంఘ సభ్యులతో కలసి మాట్లాడారు. విద్యార్థిని, విద్యార్థలలకు సంబంధిత పాఠశాలలో తీసుకున్న కొలతల ఆదారంగా ఆ దుస్తులను సక్రమంగా కుట్టాలని, నాణ్యతను పాటించాలని కలెక్టర్ వారికి సూచించారు. జిల్లా కలెక్టర్ వెంటా మండల ప్రత్యేకాధికారి జ్యోతి పద్మ,జిల్లా విద్యాధికారి , మండల అధికారులు తదితరులు ఉన్నారు.

## అలంకర ప్రాయంగ రైతు వేదికలు

### జిల్లాలో 97 భవనాలు, రైతువేదికల్లో అందుబాటులో ఉండని ఎఓలు , ఎఇఓలు




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో 20మండలాలు,525 రెవెన్యూగ్రామాలు ఉన్నాయి. రెవెన్యూ గ్రామలను 97 క్లష్టర్లుగా విభజించారు. ప్రతి కష్టర్‌లో ఒక రైతు వేదిక భావనాన్ని నిర్మించారు. ఇందుకోసం ప్రభుత్వం 21.34 కోట్లు ఖర్చు చేసింది ప్రతి నెల రైతు వేదికల్లో వ్యవసాయశాఖ అధికారులు అన్నదాలతో సమావేశం నిర్వహించాలి. పంటల సాగుపై అవగాహన కల్పించాలి అవసరం అనిపిస్తే శాస్త్రవేత్తలతో సూచనలు సలహాలు ఇప్పించాలి కానీ సంవత్సరంలో ఒక సారికుడా జరగడం లేదని తెలుస్తుంది. వేసవిలో ఏ అక్క అధికారుల సమావేశాలు నిర్వహించలేదు, కొందరు అధికారులు రైతు వేదికల వైపు చుడలేరు. ప్రస్తుత వర్షాలు పడుతున్నయి. వానాకాలం సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు కానీ అధికారుల మాత్రం రైతు వేదికల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు ఎఓలు ,ఎఈఓలు రైతువేదికల ను పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలే ఖర్చు చేస్తున్నా ఆశించిన మేర ఫలితం కనిపించడంలేదు సాగుపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. వ్యవసాయ అధికారులు అనుబంధ శాఖల అధికారుల తో సమావేశాలు నిర్వహించి పంట సాగుపై అవగాహన కల్పించాలి. కాని అధికారుల నిర్లక్ష్యంతో ,ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రస్తుత వేసవిలో ఎలాంటి సమావేశాలు,కార్యక్రమలు ఏర్పాటు చేయాలేదు ,పంటసాగుకు సిద్ధం అవుతున్న రైతులకు ఎలాంటి సూచానలు సలహాలు రైతులకు అధికారు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేరు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 9.50 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది వానాకాలం సీజన్‌లో 5.97లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో పత్తి , కంది ,మొక్కజోన్న వరి,పెసర, మినుములు ,తదితర పంటలు వానాకాలంలో సాగు విస్తీర్ణంలో 45 శాతం వరకు పత్తి పంట ఉంటుంది. గత సీజన్‌లో వివిధ కారణాల వల్ల పత్తి దిగుబడులు భారీగా పడిపోయాయి. అలాగే కంది పంట దిగుబడులు భారీగా పడిపోయాయి. అధికారుల సూచానలు ,సలహాలు అందక రైతులు భారీగా నష్టాపోయారు. ప్రస్తుత సీజన్‌లో అధికారులు ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రైతు వేదికలు అలంకరణ ప్రయాంగ మరాయని , రైతులు లేని, వ్యవసాయ అధికారులు లేని రైతు వేదకలు దేనికోసం నిర్మించారు అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేంటనే సమావేశలు నిర్వహించి రానున్న వానాకాలంలో ఏయే పంటలు వేయాలో తెలుపలని రైతులు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలన



**ప్రజాపక్షం/తాండూరు:** రైతులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా వరి ధాన్యాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దేముల్ మండల పరిది మంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం సేకరణ కేంద్రాన్ని బుదవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్స్‌కు చేరవేయాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ఇప్పటికే 20వేల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని సేకరించడం జరిగిందని వివరించారు. 18వేల మెట్రిక్ టన్నులకు సంబందించి చెల్లింపులకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. రైతుల ఖాతాల్లోకి నగదును వెంట వెంటనే జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వరి ధాన్యం సేకరణ కేంద్రాలలో రైతులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. వరి ధాన్యాన్ని సరైస్ మిల్లులకు తరలించెందకు వాహానాలను కూడ అందుబాటులో ఉంచడం జరుతుందన్ని తెలిపారు. కలెక్టర్ వెంటా జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వరి, జిల్లా మేనేజర్ సుగణబాయి, డిఆర్ డిఒ శ్రీనివాస్, డిడబ్ల్యుఓ , మండల ప్రత్యేకాధికారి జ్యోతి పద్మ మండల తహసిల్దార్ కిషన్ నాయక్, ఎంపిడిఒ జర్నప్ప, పంచాయతీ రాజ్ ఎఈ సిద్ధార్థ, పాఠశాల ప్రధానోపాధ్యాయు షరిఫోద్దిన్, రవిందర్ , కార్యదర్శులు సంజీవ, సుజీత్‌కుమార్, సంబధిత అధికారులు ఉన్నారు.

క్రీడ

# బెంగళూరుపై రాజస్థాన్ విజయం

ఐపీఎల్ 2024 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) పోరాటం ముగిసింది. అసాధారణ ప్రదర్శనతో వరుసగా 6 విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ చేరిన ఆర్‌సీబీ.. కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేసింది. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ నాకౌట్ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఆర్‌సీబీ 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. మరో వైపు అసాధారణ ప్రదర్శనతో విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్2కు అర్హత సాధించింది. చెన్నై వేదికగా శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే క్వాలిఫయర్2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 172 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సో 33), రజత్ పటీదార్(22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సతో 34), మహిపాల్ లోమ్రోర్(17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సతో 32 నాటౌట్) రాణించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో ఆవేశ్ ఖాన్(3/44) మూడు వికెట్లు పడగొట్టగా.. అశ్విన్ రెండు వికెట్లు తీసాడు. యుజ్వేంద్ర చాహల్, ఆవేశ్ ఖాన్, ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన రాజస్థాన్ రాయల్స్ 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. యశస్వి జైస్వాల్(30 బంతుల్లో 8 ఫోర్లతో 45), రియాన్ పరాగ్(26 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సతో 36), షిమ్రాన్ హెట్మైర్(14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సో 26) సత్తా చాటారు. చివర్లో రోవ్మన్ పోవెల్(8 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సో 16 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. ఆర్‌సీబీ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(2/33) రెండు వికెట్లు తీయగా.. లాకీ ఫెర్గూసన్, కర్ణ్ శర్మ, కామెరూన్ గ్రీన్ తలో వికెట్ తీసారు.



**చెలరేగిన యశస్వి..**

173 పరుగుల సాధారణ లక్ష్య చేధనకు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, టామ్ కోహ్లర్(20) దూకుడుగా ఆడారు. అయితే ఆరంభంలోనే ఈ ఇద్దరు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. యశస్వి జైస్వాల్ ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను కామెరూన్ గ్రీన్ నేలపాలు చేయగా.. టామ్ కోహ్లర్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ విడిచిపెట్టాడు. అయితే ఫెర్గూసన్ స్టన్నింగ్ యార్కర్‌తో టామ్ కోహ్లర్‌ను పెవిలియన్ చేర్చాడు. అనంతరం హాఫ్ సెంచరీకి చేరువైన యశస్వి జైస్వాల్‌ను కామెరూన్ గ్రీన్ కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. ఆ వెంటనే సంజూ శాంసన్‌ను కర్ణ్ శర్మ స్టంప్ ఔట్ చేయడంతో రాజస్థాన్ 10 ఓవర్లలో 3 వికెట్లకు 86 పరుగులు చేసింది.

**పరాగ్, హెట్‌మైర్ దూకుడు..**

ఈ పరిస్థితుల్లో రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ ఆచి తూచి ఆడే ప్రయత్నం చేశారు. కానీ విరాట్ కోహ్లీ స్టన్నింగ్ త్రోకు ధ్రువ్ జురెల్(8) రనౌట్‌గా వెనుదిరిగాడు. దాంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ షిమ్రాన్ హెట్‌మైర్, రియాన్ పరాగ్ భారీ షాట్లతో ఒత్తిడి తగ్గించారు. గ్రీన్ వేసిన 16వ ఓవర్‌లో 17 పరుగులు పిండుకున్న ఈ జోడీ.. మ్యాచ్‌ను తమవైపు తిప్పుకుంది.

**సిరాజ్ చెలరేగినా..**

యశ్ దయాల్ వేసిన 17వ ఓవర్‌లో 11 పరుగులు రావడంతో రాజస్థాన్ విజయ సమీకరణం మరింత సులువైంది. కానీ 18వ ఓవర్‌లో సిరాజ్ స్టన్నింగ్ యార్కర్‌తో రియాన్ పరాగ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి హెట్‌మైర్(26) కూడా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను మరింత ఉత్కంఠగా మార్చాడు. చివరి 12 బంతుల్లో 13 పరుగులు అవసరమవ్వగా.. ఫెర్గూసన్ వేసిన 19వ ఓవర్‌లో రోవ్‌మన్ పోవెల్ వరుసగా రెండు బౌండరీలు బాది ఒత్తిడిని తగ్గించాడు. తర్వాతి రెండు బంతులను డాట్ చేసినా.. ఆఖరి బంతిని సిక్సర్ బాదిన పోవెల్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## అంబటి రాయుడు యూటర్న్

ఐపీఎల్ 2024 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై తన అక్కసు వెళ్లగక్కిన టీమిండియా వెటరన్ క్రికెటర్ అంబటి రాయుడు యూటర్న్ తీసుకున్నాడు. మొన్న చెన్నై సూపర్ కింగ్స్‌పై ఆర్‌సీబీ సాధించిన విజయాన్ని రాయుడు ఎగతాళి చేసిన విషయం తెలిసిందే. ప్లే ఆఫ్స్ చేరితేనే ఆర్‌సీబీ, ఆ జట్టు అభిమానులు టైటిల్ గెలిచిన రీతిలో సంబరాలు చేసుకుంటున్నారని సెటైర్లు పేల్చాడు. అంతేకాకుండా ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఓడిపోవాలని కూడా కోరుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. ఆర్‌సీబీ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టార్ స్పోర్ట్స్ షోలో సహచర కామెంటేటర్ వరుణ్ అరుణ్.. ఆర్‌సీబీ టైటిల్ గెలుస్తుందని చెప్పగా.. రాయుడు ఎగతాళి చేశాడు. ఇప్పటికే టైటిల్ గెలిచిందనే రీతిలో సంబరాలు చేసుకుంటున్నారని ఆర్‌సీబీ విజయాన్ని తక్కువ చేసి మాట్లాడాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓడిపోతుందని కూడా చెప్పాడు. క్వాలిఫయర్1 మ్యాచ్ సందర్భంగా కూడా రాయుడు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఈ సారి సౌత్ టీమ్ టైటిల్ గెలుస్తుందని, ఆర్‌సీబీ విజేతగా నిలుస్తుందని దిగ్గజ కామెంటేటర్ సునీల్ గవాస్కర్ అనగా.. రాయుడు అతని వ్యాఖ్యలతో ఏకీభవించాడు. కానీ ఆర్‌సీబీ గెలవదని చెప్పాడు. ఐపీఎల్ 2024 టైటిల్‌ను సౌత్ టీమ్ గెలుస్తుందని, కానీ ఆర్‌సీబీ మాత్రం కాదని, సన్‌రైజర్స్ హైదరాబాద్ విజేతగా నిలుస్తుందని చెప్పాడు. తాజాగా రాజస్థాన్ రాయల్స్, ఆర్‌సీబీ ఎలిమినేటర్ మ్యాచ్ నేపథ్యంలో రాయుడు యూటర్న్ తీసుకున్నాడు.



ఆర్‌సీబీ టైటిల్ గెలుస్తుందని ఆశిస్తున్నానని చెప్పాడు. ఆర్‌సీబీ టైటిల్ గెలవాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఈ సారి ఆ జట్టుకు మంచి అవకాశం దక్కింది. సీఎస్‌కే కూడా లేదు. కాబట్టి ఆ జట్టు మరో మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా.'అని తెలిపాడు. అయితే రాయుడు పూటకో మాట మాట్లాడటంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రీల

# చిరంజీవి రాబోయే సినిమా

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ చిత్రం విశ్వంభర కోసం తెలిసిందే. అయితే ఇది చిరు నుంచి స్ట్రెయిట్ సినిమా కావడంతో మెగా అభిమానుల్లో మరిన్ని అంచనాలు నెలకొనగా ఈ సినిమా తర్వాత చిరు 157 సంబంధించి ఇంట్రెస్టింగ్ బజ్ రీసెంట్ గా స్టార్ట్ అయ్యింది. మెగాస్టార్ తో వర్క్ చేసిన ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా మెగాస్టార్ 157ని చేయనున్నారు అని టాక్ వచ్చింది. మరి ఇది దాదాపు నిజం అన్నట్టుగానే వినిపిస్తుండగా ఈసారి మాత్రం గాడ్ ఫాథర్ లా రీమేక్ కాకుండా స్ట్రెయిట్ సినిమా తోనే వస్తే బాగుంటుంది అని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. అంతే కాకుండా ఆల్రెడీ రీమేక్ సినిమాల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో చూస్తూనే ఉన్నాము. మరి ఈ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ నుంచి ఎలాంటి సినిమా రానుందో వేచి చూడాల్సిందే.

## విశ్వక్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ట్రైలర్




టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న విలేజ్ యాక్షన్ డ్రామా గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఈ చిత్రం గతేడాది థియేటర్ల లోకి రావాల్సి ఉండగా, వాయిదా పడుతూ వస్తోంది. మొత్తానికి మే 31, 2024 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక రిలీజ్ డేట్ లో ఎలాంటి మార్పు లేదని క్లారిటీ ఇచ్చేశారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో మేకర్స్ సినిమా నుండి ట్రైలర్ ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ కి సంబంధించిన వివరాలను సరికొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. మే 25, 2024 న హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద దేవి థియేటర్ లో ట్రైలర్ ను లాంఛ్ చేయనున్నారు. సాయంత్రం 4:06 గంటలకు లాంఛ్ ఈవెంట్ ప్రారంభం కానుంది. నేహా శెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ లపై నిర్మిస్తున్నారు. అంజలి కీలక పాత్రలో నటిస్తుండగా, యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు.

## కాజల్ 'సత్యభామ' కోసం బాలకృష్ణ



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫిమేల్ సెంట్రిక్ మూవీ సత్యభామ. సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. మొదట ఈ సినిమాని మే 17, 2024న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. కానీ తర్వాత మే 31, 2024కి వాయిదా పడింది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండగా, సత్యభామ థియేట్రికల్ ట్రైలర్ను మే 24, 2024న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. అయితే ఈ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను చాలా గ్రాండ్ గా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ ఈవెంట్ కి గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ చీఫ్ గెస్ట్ గా రానున్నారు. ఐటీసీ కోహినూర్, హైదరాబాద్ లో సాయంత్రం 6:30 గంటలకు ఈ ఈవెంట్ ప్రారంభం కానుంది. నవీన్ చంద్ర, ప్రకాష్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవివర్మ, అంకిత్ కొయ్య, సంపద ఎన్, ప్రజ్వల్ యద్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ను ఔరం ఆరట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస్ రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి శశి కిరణ్ తిక్క కథా రచయితగా, శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.

## మహేష్‌బాబు లాంచ్ చేసిన సాంగ్

ప్రస్తుతం టాలీవుడ్ నుంచి రానున్న ఇంట్రెస్టింగ్ చిత్రాల్లో యంగ్ హీరో ఆశిష్ అలాగే యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య కాంబినేషన్ లో దర్శకుడు అరుణ్ భీమవరపు తెరకెక్కిస్తున్న లేటెస్ట్ చిత్రం లవ్ మీ కూడా ఒకటి. ఇంట్రెస్టింగ్ హారర్ థ్రిల్లర్ గా వస్తున్నా ఈ చిత్రంపై మంచి బజ్ నెలకొనగా తాజాగా మేకర్స్ సినిమా నుంచి సూపర్ స్టార్ మహేష్ బాబు చేతుల మీదగా సరికొత్త సాంగ్ ని అయితే లాంచ్ చేశారు. ఏం అవుతుందో అంటూ సాగే ఈ సాంగ్ ని ఆస్కార్ కాంబినేషన్ ఎం ఎం కీరవాణి సంగీతం అందించగా చంద్రబోస్ సాహిత్యంలో వచ్చింది. మరి దయ్యానికి ప్రేమికుడికి నడుమ సన్నివేశాలతో ఆకట్టుకునే విధంగా ఈ సాంగ్ ఉందని చెప్పాలి. అలాగే ఈ సాంగ్ కి నితీష్ కొండిపాటి అలాగే గోమతి అయ్యర్ ల వోకల్స్ కూడా పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాయి. ఇక ఈ వినూత్న హారర్ ప్రేమ కథా చిత్రం ఈ మే 25న రిలీజ్ కి రాబోతుండగా దిల్ రాజు నిర్మాణం వహించారువహించారు.




## రాహుల్‌గాంధీపై పోలీసులకు జెడి(ఎస్) ఫిర్యాదు

**బెంగళూరు :** ప్రజ్వల్ రేవన్న 400 మంది మహిళలపై అత్యాచారం చేశాడని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై జెడి(ఎస్) పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంఎల్‌సి, బెంగళూరు సిటీ జెడి(ఎస్) పార్టీ అధ్యక్షుడు హెచ్.ఎం.రమేశ్ గౌడ ఐపిసి 202 సెక్షన్ కింద రాహుల్‌గాంధీపై ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చే శా రు. మే 2వ తేదీన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించిన రాహుల్‌గాంధీ, ప్రజ్వల్ 400 మంది మహిళపైఅత్యాచారాలకు పాల్పడ్డాడని ఆరోపణలు చే శారు. శివమొగ్గ, రాయ్‌చూర్ జిల్లా కేంద్రాలలో ఆయన ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు. అందుకు సంబంధించిన వీడియో సాక్ష్యాలు కూడా సమర్పించారు.

## రూ.2.11లక్షల కోట్ల డివిడెండ్‌కు రిజర్వు బ్యాంకు ఆమోదం

**ముంబయి :** కేంద్ర ప్రభుత్వానికి గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన రూ.2.11 లక్షలకోట్ల డివిడెండ్‌కు రిజర్వుబ్యాంకు బుధవారంనాడు ఆమోద ముద్ర వేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించిన డివిడెండ్ కంటే ఇప్పుడు చెల్లించిన డివిడెండ్ రెట్టింపుకంటే ఎక్కువ. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 608వ సమావేశంలో ఈ మేరకు డివిడెండ్లకు ఆమోదముద్ర వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,10,874 కోట్లు కేంద్ర ప్రభుత్వ మిగులు మొత్తాన్ని బదిలీ చేస్తూ బోర్డు ఆమోద ముద్ర వేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.87,416 కోట్లు డివిడెండ్ చెల్లించగా, 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ జరగడంతో ఆరూశాతం పెరిగింది.

## పవన్‌సింగ్‌ను బహిష్కరించిన బిజెపి

**పాట్నా :** లోక్‌సభ ఎన్నికల్లో ఇండిపెండెంటుగా పోటీ చేసిన భోజ్‌పురి సూపర్‌స్టార్ పవన్ సింగ్‌ను బిజెపి తమ పార్టీ నుండి బహిష్కరించింది. ఎన్‌డిఎ తరపున నిర్ణయించిన అధికారిక అభ్యర్థికి వ్యతిరేకంగా ఆయన బీహార్‌లోని కరకట్ స్థానం నుండి ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. రాష్ట్రీయ లోక్ మోర్చా గుర్తుపై పోటీ చేస్తున్న ఎన్‌డిఎ భాగస్వామి కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహపై ఆయన పోటీ చేశారు. బీహార్ బిజెపి కేంద్ర కార్యాలయం ఇన్‌ఛార్జి అరవింద్ శర్మ ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై పవన్‌సింగ్‌ను సంప్రదించేందుకు అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. అనేక సంవత్సరాలుగా సింగ్ బిజెపిలో సభ్యుడుగా ఉన్నారు. ఆయనకు పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నుం డి పోటీ చేసేందుకు పార్టీ టిక్కెట్టు తిరస్కరించడంతో నెలరోజుల క్రి తం ఆ యన తిరగబడ్డారు. ఆయన పాడిన పాటలు బెంగాలీయులను అప్రతిష్టపా లు చేసేవిగా ఉండటం, మహిళను కించపరచేవిగా ఉండటంతో ఆయన కు పార్టీ టిక్కెట్టు తిరస్కరించింది. తర్వాత అరా నియోజకవర్గంలో టిక్కెట్టు కా వాలని అడిగారు. ఐతే అక్కడి నుండి మూడోసారి పోటీ చేస్తున్న కేంద్ర మ ంత్రి ఆర్ కె.సింగ్‌ను కాదని పవన్‌సింగ్‌కు టిక్కెట్టు ఇచ్చేందుకు బిజెపి నిరాకరించింది.

## షారుఖ్‌కు వడదెబ్బ

**అహ్మదాబాద్ :** బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్‌కు వడదెబ్బ సోకింది. దీనితో ఆయనను బుధవారం అహమ్మదాబాద్‌లోని కెడి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్చినట్టు పోలీసులు తెలిపారు. ఇండియన్ ప్రీమియల్ లీగ్ (ఐపిఎల్)కు చెందిన కోల్‌కతా నైట్‌రైడర్స్ సహభాగస్వామిగా ఉన్న షారుఖ్ మంగళవారం అహమ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి వెళ్లారు. అక్కడ హైదరాబాద్ సన్‌రైజర్స్‌తో నైట్ రైడర్స్ తలపడిన మ్యాచ్‌ని తిలకించారు. ఆ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై నైట్‌రైడర్స్ 8 వికెట్ల తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌ని తిలకించిన అనంతరం షారుఖ్ హీ ట్‌స్ట్రోక్‌తో బాధపడ్డాడు. దీనితో అతనిని ఆసుపత్రికి తరలించినట్టు అ హమ్మదాబాద్ (రూరల్) సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఓం ప్రకాశ్ జాట్ తెలిపారు.

# రామాలయాన్ని కూల్చేస్తామనడం మోదీ దుష్ప్రచారమే : ఖర్గే

కాంగ్రెస్ వస్తే అన్ని మతాలకు సమాన గౌరవం

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రామాలయాన్ని కూల్చివేస్తుందనడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న దుష్ప్రచారమేనని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. మోదీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే అన్ని మతాలను గౌరవిస్తుందనీ, అన్ని మత విశ్వాసాలకూ గౌరవం ఇస్తుందనీ ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో 55 సంవత్సరాలు అధికారంలో ఉందనీ, కానీ ఏనాడూ ఎవ్వరినీ ఎవ్వరినీ పూజలు చేసుకోకుండా అడ్డుకోలేదనీ లేదా ప్రధానమంత్రి ప్రచారం చేస్తున్నట్టుగా ఎవ్వరి మంగళ సూత్రాలనూ లాక్కుపోలేదనీ అన్నారు. ''ఇది పూర్తిగా అసత్యమే. వాళ్ళు కావాలనే ఈ విధంగా మాట్లాడుతున్నారు. మా పార్టీలో ఏ నాయకుడూ ఆ విధమైన ప్రకటనలు చేయలేదు, ఆ విధంగా ఎప్పుడూ మాట్లాడలేదు, ఈ విషయాలేమీ రాజ్యాంగంలో రాసిపెట్టలేవు, మేము అందరినీ గౌరవిస్తాం, అన్ని మతాల విశ్వాసాలనూ గౌరవిస్తాం'' అని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బుధవారం మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఏ మతంలో ఉన్నవారైనా సరే పేదరికంలో ఉన్నవారికి సహాయం చేయడం బుజ్జగింపు ధోరణి కానే కాదని, ఇది బిజెపి చేస్తున్న ఆరోపణ మాత్రమేనని మండిపడ్డారు. ''ఇంతకుముందు దేశంలో ప్రజలు చాలా సంతోషంగా బతికేవారు, కానీ బిజెపి, మోదీజీ అధికారంలోకి వచ్చాక వారు తమ ఓట్లకోసం ప్రజలను విభజించడం ప్రారంభించిన తర్వాత ఆ సంతోషం పోయింది, ఓట్లకోసమే వారు ఇలాంటి పనులు చేస్తున్నారు, బుల్‌డోజర్లు ఉపయోగించి కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారు'' అని ఖర్గే విమర్శించారు. యుపిఎ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు మేలు చేసేందుకు పథకాలు తెచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా బిజెపి దేశంలో తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. పేదల కోసం పథకాలు అమలు చేసే పార్టీపై ఇప్పుడు ప్రధామంత్రి ఉచితాలు ప్రకటిస్తున్నారంటూ 'ఉచిత' రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ మొట్టమొదటిసారి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం చట్టాన్ని తెచ్చినప్పుడు, తర్వాత గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను అమలు చేసినప్పుడు కూడా బిజెపి వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అదేవిధంగా దేశంలో భూ సంస్కరణలను, బ్యాంకుల జాతీయకరణను కూడా చరిత్రలో బిజెపి వ్యతిరేకించిందని అన్నారు. ''పేదలకోసం మేం ఎప్పుడు పథకాలు ప్రవేశపెట్టినాగానీ వారు వాటిని విమర్శించారు, ఇప్పుడు కూడా మేం పేదలకు డబుల్ రేషన్ ఇస్తామని చెబుతున్నాం, వారు విమర్శిస్తున్నారు'' అని ఖర్గే అన్నారు. కాంగ్రెస్‌పార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని చేస్తున్న బిజెపి విమర్శను ఆయన తిరస్కరిస్తూ, ''ఏ మతానికి చెందినవారికైనా అన్యాయం జరుగుతుంటే దానిని ఆపేయడం, అడ్డుకోవడం బుజ్జగింపు రాజకీయం కాదు, వారు (బిజెపి) ఈ ఎన్నికల సమయంలో ఓటర్లమధ్య, ప్రజల మధ్య విభజన తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారు, మేం ఏం చేసినాగానీ వాళ్ళు దాన్ని బుజ్జగింపు రాజకీయంగానే చిత్రీకరించేందుకు ప్రయత్నం చేస్తారు, పేదలకు ఏదైనా ఇవ్వడం, పేదలకు స్కాలర్‌షిప్ ఇవ్వడం, పేద ముస్లింలకు ప్రత్యేక స్కూళ్ళ ద్వారా విద్యాబోధన చేయడం వంటివన్నీ బుజ్జగింపు రాజకీయాలుగా ఎవరూ చెప్పరు'' అని ఖర్గే అన్నారు. మతపరమైన రిజర్వేషన్లు కాంగ్రెస్ ఇవ్వాలనుకుంటోందని అందుకే రిజర్వేషన్లపై పరిమితి అంశాన్ని ప్రస్తావిస్తున్నారని బిజెపి ఆరోపించడాన్ని ఆయన ఖండిస్తూ,పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడంకోసమే ఆ ప్రస్తావన తెచ్చామన్నారు. మేం ఏం చేసినాగానీ, పేదలకోసం ఏం చెప్పినాగానీ ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం కోసం అపార్థాలు సృష్టిస్తున్నారన్నారు. కుల గణన డిమాండ్‌ను ఆయన సమర్థిస్తూ, గతంలో ఏ వర్గాలకైనా ఏదైనా దక్కకపోతే వాటిని తిరిగి సమకూర్చడంకోసమే ఈ కులగణన చేస్తామన్నారు. ''పేదలకు ఎలాంటి సహాయం అవసరమైనా, వెనుకబడిన వారికి సహాయం అవసరం అయినా మేం వారికోసం ఒక విధానం సృష్టిస్తాం, అంటే జవహర్‌లాల్ నెహ్రూ ఒకనాడు పంచవర్ష ప్రణాళికను సృష్టించినట్టుగా అన్నమాట, అదేవిధంగా సహాయం అందనివారికోసం మేం పథకాలు సృష్టిస్తాం, అంతేతప్ప ఎవరి హక్కులను మేం హరించబోం'' అని ఖర్గే వివరించారు. కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేసే ఈ శక్తులన్నీ భూస్వామ్య మనస్తత్వం గలవారేనన్నారు. ''మేం రూ.72 వేల కోటు విలువైన వాగ్దానాలు చేశామని ఇంతకుముందు ఆయన (మోదీ) ప్రచారం చేశారు, ఇప్పుడు లక్షకోట్ల రూపాయలు విలువైన వాగ్దానాలు పేదలకోసం చేశామని అంటున్నారు, ఐను కాంగ్రెస్‌పార్టీ కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో చేసింది'' అన్నారు. మేం పేదలకోసమే చేస్తున్నాం, ఈ డబ్బును పేదలకోసమే ఖర్చు పెడుతున్నాం, మేం ప్రవేశపెట్టిన పథకాలు చాలా విజయవంతంగా అమలవుతున్నాయి, ధనవంతులైన వ్యాపారవేత్తలకు బిజెపి రూ.16 లక్షల కోట్లు రుణాలను మాఫీ చేసిందనీ, అలాంటప్పుడు పేదలకోసం ఎందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయకూడదనీ ఖర్గే ప్రశ్నించారు.



# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

కొవిడ్ వ్యాక్సిన్ల కంపెనీ నుంచి రూ. 52 కోట్ల విరాళం

ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక ధ్వజం

**గొడ్డా/రాంచీ (జార్ఖండ్):** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నదని, ఇందుకు నరకయాతన పడుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ బుధవారం ఆరోపించారు. గత పదేళ్లలో పార్లమెంటు, న్యాయవ్యవస్థ వంటి సంస్థలను నిర్వీర్యం చేసిందని మోదీ సర్కారుపై ఆమె విరుచుకుపడ్డారు. గొడ్డా, రాంచీలో జరిగిన ర్యాలీలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, కేంద్రం విధానాలను వ్యతిరేకించే వారందరినీ బలిపశువులుగా మారుస్తున్నారని అన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని, రిజర్వేషన్లపై కోత విధిస్తుందని హెచ్చరించారు. గత పదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని, అలాగే పార్లమెంట్, న్యాయవ్యవస్థ వంటి సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆమె ఆరోపించారు. ఐఐఎం, ఐఐటి, ఇస్రో, డిఆర్‌డిఒ, ఎయిమ్స్ వంటి దేశంలోని అన్ని ప్రధాన సంస్థలను నెలకొల్పింది కాంగ్రెసేనని ఆమె గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వం మాదిరిగా కాకుండా, కాంగ్రెస్ విధానాలు గిరిజనుల హక్కులను బలోపేతం చేసే లక్ష్యంతో ఉన్నాయని ప్రియాంక గొడ్డాలో అన్నారు. జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్‌ను ప్రధాని మోదీ తప్పుడు కేసుల్లో ఇరికించారని విమర్శించారు. అయితే, సోరెన్ భార్య కల్పన శివంగిలా పోరాడతున్నారని చెప్పారు. ఆమె సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అదే విధంగా గండే అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలోనూ బరిలోకి దిగిన ఆమెను గెలిపించాలని కోరారు. గతంలో చట్టాల రూపకల్పన కోసం పార్లమెంట్లో చర్చలు జరిగాయని కానీ, ఇప్పుడు బిజెపి కేవలం ప్రతిపక్షాలపై విరుచుకుపడేందుకే సమావేశాలు నిర్వహిస్తున్నదని విమర్శించారు. కొవిడ్ వ్యాక్సిన్లను తయారు చేసే సంస్థ నుంచి ప్రధాని రూ. 52 కోట్ల విరాళం తీసుకున్నారని ప్రియాంక ఆరోపించారు. ఆ వ్యాక్సిన్ ఇప్పుడు ప్రజల శరీరంలో ప్రతిచర్యలకు కారణమవుతోందని చెప్పారు. చాలా మంది జిమ్‌లో లేదా పని చేస్తున్న సమయంలోనో అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. హేమంత్ సోరెన్‌ను కటకటాల వెనక్కి నెట్టడం ద్వారా జార్ఖండ్‌లో లాభపడాలని బిజెపి భావిస్తున్నదని, అయితే, మోదీ ఆలోచనకు భిన్నంగా ఇక్కడ గిరిజనులంతా ఒక్కటయ్యారని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బిలియనీర్ల కోసమే విధానాలను రూపొందిస్తున్నదని, విమానాశ్రయాలు, ఓడరేవులను వారికి విక్రయిస్తున్నదని అన్నారు. అనేక మంది బిలియనీర్లకు మేలు కలిగేలా రూ. 16 లక్షల కోట్లను మాఫీ చేసిందని చెప్పారు. కానీ, రుణాల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించడం లేదని విమర్శించారు. 'మీ జల్ జంగిల్ జమీన్ (నీరు, అడవి, భూమి)ని లాక్కోవడానికి పెట్టుబడిదారులు చూస్తున్నారు. ఆ ప్రయత్నాలను అడ్డుకోవాలి' అని పిలుపునిచ్చారు. బిజెపిని గెలిపిస్తే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

## ప్రజ్వల్ టైప్–డి పాస్‌పోర్ట్ రద్దుపై కేంద్రం స్పందించలేదు

కర్ణాటక మంత్రి పరమేశ్వర



**బెంగళూరు :** ఒక మహిళలను లైంగికంగా దోపిడీ చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న హసన్ నియోజకవర్గ ఎంపి ప్రజ్వల్ రేవన్న టైప్–డి (ప్రభుత్వ వ్యవహారాల నిమిత్తం కేటాయించే ముదురు ఎరుపురంగు ప్రత్యేక పాస్‌పోర్ట్) పాస్‌పోర్టు రద్దు చేయాలని చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ స్పందించలేదని కర్ణాటక హోంశాఖామంత్రి జి.పరమేశ్వర చెప్పారు. ప్రజ్వల రేవన్నకు ఉన్న దౌత్యపరమైన పాస్‌పోర్టును రద్దు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేననీ, ఈ విషయంలో కేంద్రమే సహాయం చేయాలని ఆయన అన్నారు. ప్రజ్వల రేవన్న వరుగా లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ దర్యాప్తు బృందమే ఆయన పాస్‌పోర్టు రద్దు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ''ఇప్పటివరకూ ఈ విషయంలో కేంద్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు, కేంద్రం కూడా మాకు సహాయం చేయాలి, అందుకే మేం విజ్ఞప్తి చేస్తున్నాం, చట్టపరిధిలో విమర్శలు చేసినంతమాత్రాన ప్రయోజనం లేదు, కేంద్రం సహాయం చేయాల్సిందే'' అని మంత్రి పరమేశ్వర అన్నారు. బుధవారంనాడు బెంగళూరులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ''రేవన్న డిప్లమొటిక్ పాస్‌పోర్టును రద్దు చేయాలని కోరుతూ పధాన మంత్రికి మా ముఖ్యమంత్రి ఒక లేఖ రాశారు, కానీ సమాధానం లేదు, ఇప్పుడు కోర్టు ఆయనపై అరెస్టు వారెంటు జారీ చేసింది, సిట్ కూడా ఈ సమాచారం తెలియజేస్తూ లేఖ రాసింది, పాస్‌పోర్టు రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వం విధి, ఈ విషయం వారు అర్థం చేసుకోవాలి'' అన్నారు. జెడి(ఎస్) పార్టీ నాయకుడు దేవెగౌడ మనుమడు ప్రజ్వల్ హసన్ లోక్‌సభ నియోజకవర్గం నుండి రెండోసారి ఎంపిగా పోటీ చేస్తున్నారు, మహిళలను లైంగికంగా వేధించారని అనేక ఆరోపణలు ఆయన ఎదుర్కొంటున్నారు'' అని చెప్పారు. ఈ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏప్రిల్ 27న ప్రజ్వల్ జర్మనీకి వెళ్ళిపోయారని తెలుస్తోంది. సిట్ విజ్ఞప్తి మేరకు ఆయనపై బ్లూ కార్నర్ నోటీసు కూడా ఇప్పటికే ఇంటర్‌పోల్ జారీ చేసింది. అదేవిధంగా గడచిన శనివారంనాడు ప్రజాప్రతినిధులకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యాయస్థానం కూడా అరెస్టు వారెంటు జారీ చేసింది.